

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 243

గురువారం 18-5-2023



ఢిల్లీ గెలిచెన్

15 పరుగులతో పంజాబ్ పరాజయం మెరిసిన రోసో, పృథ్వీషా - 12లో



ఎస్పీ హిందూజా ఇక లేరు

అనారోగ్యంతో లండన్‌లో కన్నుమూసిన హిందూజా గ్రూప్ చైర్మన్ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వచ్చే ఐదేళ్లలో ఎండ ప్రచండం!

ఐదేళ్ల పాటు ప్రపంచమంతా ఎండలు దంచికొడతాయని ఐరాసకు చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది.

వివరాలు 6లో ▸



27సార్లు ఎవరెస్టు ఎక్కాడు

నేపాల్‌కు చెందిన పర్వతారోహకుడు కమీ రీటా షెర్పా 27వ సారి ఎవరెస్ట్‌ను అధిరోహించి కొత్త రికార్డ్‌ను లిఖించారు.


వివరాలు 6లో ▸



చైనా నౌక మునక

39 మందితో చేపల వేటకు బయలుదేరిన చైనా నౌక హిందూ మహాసముద్రంలో మునిగిపోయిందని ఆ దేశ అధికారులు తెలిపారు.

వివరాలు 6లో ▸



బైడెన్ గైర్హాజరుతో క్వాడ్ రద్దు

తాను సదస్సుకు రాలేనని అమెరికా అధ్యక్షుడు బైడెన్ తేల్చిచెప్పడంతో 24న ఆస్ట్రేలియాలో జరగాల్సిన క్వాడ్ సదస్సు రద్దయ్యింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

టీడీపీ మాజీ మంత్రి అఖిలప్రియ అరెస్టు



లోకేశ్ పాదయాత్రలో టీడీపీ సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డిపై దాడి చేసి, హత్యాయత్నం చేసిన కేసులో అదే పార్టీకి చెందిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 14లో ▸

ఇద్దరు చిన్నారుల కిడ్నాప్.. రక్షించిన పోలీసులు



నంద్యాలలోని నాగులకట్టకు చెందిన ఇద్దరు బాలికలను ఆటోడ్రైవర్ ఇమామ్ కిడ్నాప్ చేయగా.. పోలీసులు చాకచక్యంగా విశాఖలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారులిద్దరినీ క్షేమంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

వివరాలు 5లో ▸

ఠారెత్తిస్తున్న ఉష్ణోగ్రతలు



విశాఖలోని రామా టాకీస్ రోడ్డు

రాష్ట్రంలో సూర్యుడి ప్రతాపం కొనసాగుతోంది. బుధవారం రాయలసీమ జిల్లాల్లో ఎండ నిప్పులు చెరిగింది. తిరుపతి జిల్లా పల్లాం, నెల్లూరు జిల్లా కసుమూరులో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రిపూట కూడా అనేక ప్రాంతాల్లో 36 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

వివరాలు 14లో ▸

అత్యంత సంపన్నులు తగ్గారు



భారతదేశంలో 30 మిలియన్ డాలర్ల పైన నెట్‌వర్త్ ఉన్న వ్యక్తుల సంఖ్య గత ఏడాది 7.5 శాతం తగ్గి 12,069కి చేరిందని నైట్ ఫ్రాంక్ తాజా నివేదిక వెల్లడించింది. రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య 19,119 పెరిగే అవకాశముందని అభిప్రాయపడింది.

వివరాలు 13లో ▸

ఇది పేదల విజయం

అమరావతిలో ఇళ్ల స్థలాలిచ్చేందుకు అభ్యంతరం లేదు

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

- ఫలించని టీడీపీ కుట్రలు, కుతంత్రాలు.. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీలో జోక్యానికి తిరస్కరణ
- పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని నిరోధించేందుకు విముఖత
- అక్కడ ఇళ్ల పట్టాలిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు ఉందని స్పష్టీకరణ
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరణ



పేదలు మరింత నిరుపేదలుగా మారాలి.. పెత్తందార్లకు జీ హుజూర్ అంటూ బతకాలి.. పేదల పిల్లలు పెద్ద పెద్ద చదువులు చదవరాదు.. ఇంగ్లిష్ చదువులు అసలే చదవకూడదు.. కనీసం వారికి నిలువ నీడ కూడా లేకుండా ఉంటేనే తమ ఆటలు సాగుతాయన్నది చంద్రబాబు అండ్ కో మానసిక పరిస్థితి. అమరావతి ప్రాంతంలో వారికి ప్రభుత్వం సెంటు భూమి ఇస్తామంటే ఇదే పచ్చ గ్యాంగ్, ఎల్లో మీడియాతో కలిసి గగ్గోలు పెట్టింది. బాబు 3డి గ్రాఫిక్స్ రాజధానిలోని సింగపూర్, మలేసియా, జపాన్‌లు మురికి కూపాలైపోతాయని ఆందోళనలు, చర్చోపచర్చలతో ప్రజల్లో విష బీజాలు నింపడానికి విఫలయత్నం చేసింది. నిస్సిగ్గుగా కోర్టులకూ ఎక్కింది. 'రాజధాని అయినంత మాత్రాన అక్కడ పేదలు ఉండకూడదంటే ఎలా?' అని హైకోర్టు తలంటినప్పటికీ ఈ పచ్చ గ్యాంగ్‌కు బుద్ధి రాలేదు. రైతుల పేరుతో సుప్రీంకోర్టులోనూ వంకర బుద్ధి చూపించబోయింది. 'పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ఏ విధంగా అన్యాయం? రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టలేం' అని తాజాగా గడ్డి పెట్టింది. అయినా వీళ్లలో మార్పు వస్తుందని ఆశించలేం. ఈ పెత్తందార్ల యుద్ధాన్ని ఎదిరిస్తూ.. వారి కుట్రలను సమర్థవంతంగా తిప్పికొడుతూ సీఎం వైఎస్ జగన్ గట్టిగా నిలవడం వల్లే పేదలకు న్యాయం జరిగింది. ఇది పేదల కోసం నిలబడ్డ ప్రభుత్వ ఘన విజయం.

సాక్షి, అమరావతి: రాజధానిలో పేదలకు స్థానమే లేకుండా చేసేందుకు తెలుగుదేశం పార్టీ కుట్రలు, కుతంత్రాలను సుప్రీంకోర్టు పటాపంచలు చేసింది. రాజధాని ప్రాంతంలో పేదలకు 5 శాతం భూమి కేటాయించాలన్న సీఆర్‌డీఏ చట్ట నిబంధనలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అడ్డుకునేందుకు శక్తివంచన లేకుండా తెలుగుదేశం పార్టీ పెద్దలు చేసిన యత్నాలను సుప్రీంకోర్టు తిప్పికొట్టింది. పేదలకు ఇళ్ల స్థలాలు రాకుండా చేసేందుకు న్యాయవాదులకు కోట్ల రూపాయలను వెదజల్లినా టీడీపీ ప్రయత్నాలు

మిగతా 2వ పేజీలో ▸

బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

ఉద్యోగులకు ఈనెల 22 నుంచి 31 వరకు అవకాశం

అభ్యర్థన, పరిపాలన అవసరాలే ప్రాతిపదిక

- ఒకేచోట రెండేళ్లుగా పనిచేస్తున్న వారు అర్హులు
- ఒకేచోట ఐదేళ్లుగా పని చేస్తుంటే బదిలీ తప్పనిసరి
- తొలుత ఐటీడీఏల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ
- జూన్ 1 నుంచి బదిలీలపై నిషేధం తిరిగి అమల్లోకి
- ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ రావత్ ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 22వ తేదీ నుంచి 31 వరకు బదిలీలకు అవకాశం కల్పిస్తూ ప్రస్తుతం బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలించింది. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ బుధవారం జారీ చేశారు. ఉద్యోగుల అభ్యర్థన, పరిపాలన ప్రాతిపదికనే బదిలీలు ఉంటాయని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు నాటికి రెండేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులు అభ్యర్థన మేరకు బదిలీలకు అర్హులని ఆర్థిక శాఖ పేర్కొంది. అలాగే ఏప్రిల్ నెలాఖరు నాటికి ఐదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులకు తప్పనిసరిగా బదిలీలు ఉంటాయని స్పష్టం చేసింది.

- ఒకేచోట అంటే సిటీ, పట్టణం, గ్రామంలో పనిచేయడాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు. రాష్ట్ర ఆడిట్ శాఖ ఉద్యోగులకు సంబంధించి ఒకేచోట అంటే ఆ జోన్ పరిధిలో పరిగణిస్తారు. బదిలీల్లో 40 శాతం వైకల్యం కలిగిన ఉద్యోగులకు ప్రాధాన్యం ఇస్తారు. మానసిక వైకల్య బాధిత పిల్లలున్న ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కలిగిన ప్రాంతానికి బదిలీల్లో

మిగతా 3వ పేజీలో ▸

కొనసాగుతున్న 'కర్నాటకం'

పట్టు వీడని సిద్దరామయ్య, డీకే శివకుమార్

- తలపట్టుకుంటున్న కాంగ్రెస్ అధిష్టానం
- సిద్దూను ఖరారు చేస్తూ తొలుత నిర్ణయం!
- మధ్యాహ్నం ఖర్గే–డీకే భేటీతో మారిన సీను
- మొదలైన ప్రమాణస్వీకార ఏర్పాట్లు బంద్
- రెండు, మూడు రోజుల్లో నిర్ణయం: కాంగ్రెస్ నేత సుర్జేవాలా

- వివరాలు 6లో



ఢిల్లీలో కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలతో డీకే శివకుమార్

తెలంగాణలో 105 సీట్లు మనవే!

- ఏమరుపాటుతో ఉంటే మునుగుతాం
- బోగస్ గుజరాత్ మోడల్‌తో దేశాన్ని మోదీ మోసం చేశారు.. బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో తెలంగాణ సీఎం కేసీఆర్

- వివరాలు 2లో



పూర్ణాహుతితో పరిపూర్ణం

విజయవాడలో ముగిసిన శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

మంత్రోచ్ఛారణల మధ్య సీఎం జగన్ శాస్త్రోక్తంగా పూజలు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి స్వయంగా పంచామృతాలతో అభిషేకం
- పూర్ణాహుతి కార్యక్రమంలో శ్రీస్వరూపానందేంద్రస్వామి, శ్రీగణపతి సచ్చిదానందస్వామి, సుబుధేంద్ర తీర్థస్వామి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీర్వచనం అందజేసిన పీఠాధిపతులు
- రాష్ట్ర ప్రజలందరి క్షేమాన్ని కాంక్షిస్తూ ఆరు రోజుల పాటు మహాయజ్ఞం నిర్వహించిన దేవదాయ శాఖ

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అష్టోత్తర శత కుండాత్మక, చండీ, రుద్ర, రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞం బుధవారంతో ముగిసింది. వేద మంత్రోచ్ఛారణల నడుమ పీఠాధిపతులు ముందుండి నడిపించగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మహాయజ్ఞ అఖండ పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా పూర్తైంది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, శాంతి సౌభాగ్యాలు, పాడిపంటలు, సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో ప్రజలంతా వర్ధిల్లాలని కాంక్షిస్తూ, ప్రకృతి అనుగ్రహం ఎల్లప్పుడూ కొనసాగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ ఈనెల 12వ తేదీన మహాయజ్ఞ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆరు రోజులపాటు నిత్య పారాయణాలు, వైదిక క్రతువులు, వివిధ క్షేత్రాల కల్యాణోత్సవాలు, పీఠాధిపతుల అనుగ్రహ భాషణలు, ప్రవచనాలు, పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన మహాయజ్ఞ క్రతువులో 600 మందికి పైగా

మిగతా 2వ పేజీలో ▸



అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం జగన్, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి

ఇదండీ సంగతి



ఎందుకైనా మంచిది.. ముందు సీఎం అభ్యర్థిని ఇప్పుడే ఎన్నుకుందాం సార్!

టెన్త్, ఇంటర్ టాపర్లకు ప్రభుత్వ సత్కారం

ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు ప్రోత్సాహం: మంత్రి బొత్స

- నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు
- మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి సత్కారం, నగదు పురస్కారం
- ఈ నెల 23, 27, 31వ తేదీల్లో నిర్వహణ



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెరిగాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. టెన్త్, ఇంటర్ ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను సన్మానించనున్నట్లు బొత్స ప్రకటించారు. బుధవారం విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులను అవార్డులు, నగదు పురస్కారాలతో సత్కరిస్తామన్నారు. జడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్, ఏపీ మోడల్, బీసీ రెసిడెన్షియల్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, జీటీడబ్ల్యూ ఆశ్రమ స్కూళ్లు, కేజీబీవీ విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. మార్కుల ఆధారంగా టెన్త్, ఇంటర్‌లో 2,831 మంది విద్యార్థులను సత్కరించనున్నట్లు చెప్పారు. విద్యారంగాన్ని ప్రోత్సహిస్తూ పేదలు అధికంగా చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగన్ సంకల్పమన్నారు. అందుకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, దీర్ఘకాలిక ప్రయోజనాల దిశగా అధునాతన వసతులు, డిజిటల్ విద్యా బోధన తదితరాలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఇప్పటివరకు అమలు చేసిన విప్లవాత్మక కార్యక్రమాలకు తోడు ఈ ఏడాది నుంచి

మిగతా 3వ పేజీలో ▸



టీడీపీ నేతలు చంద్రబాబు, బొజ్జల సుధీర్‌రెడ్డితో నగ్న పూజల మాంత్రికుడు సుబ్బయ్య (ఫైల్)

నగ్నపూజల మాంత్రికుడు.. టీడీపీ నాయకుడు

- మహిళను చెరబట్టేందుకు యత్నించి కటకటాలపాలు
- టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అండతో ఎదిగిన మాంత్రికుడు
- పదేళ్లుగా క్షుద్రపూజల పేరుతో బురిడీ

- వివరాలు 3లో

మీకిచ్చిన సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుంది

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల స్థలాలపై టీడీపీ నేత చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. మీకిచ్చిన సెంటు భూమి.. ఎవరైనా చనిపోతే పూడ్చడానికి మాత్రమే సరిపోతుందంటూ కించపరిచారు.

- వివరాలు 3లో



విశాఖలో చినముషిడివాడ వద్ద జనం లేక చంద్రబాబు రోడ్‌షో

క్లుప్తంగా...

రేపు సీఎం వైఎస్ జగన్ విజయవాడ పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ శుక్రవారం విజయవాడలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌కు సీఎం చేరుకుంటారు. వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి.. ఉత్తమ వలంటీర్లను సీఎం సత్కరిస్తారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

సీఎం అభాగ్యులకు అండగా నిలిచారు

- బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- సీఎం ఆదేశాల మేరకు ఆరుగురికి సాయం చెక్కుల పంపిణీ



బుల్లా శివయ్యకు చెక్కు అందిస్తున్న బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభాగ్యులకు అండగా నిలిచారని బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. ముఖ్యమంత్రి హామీలను తక్షణమే అమలు చేస్తూ నిరుపేదలైన ఆరుగురికి ఆర్థిక సహాయం చెక్కులను బుధవారం బాపట్ల కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తదుపరి ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి వివరాలు పంపుతామని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బాపట్ల జిల్లా నిజాంపట్నం పర్యటనలో మానవత్వంతో మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. నిరాదరణకు గురై నిస్సహాయ స్థితిలో ఉన్న ఆపన్నులను అక్కున చేర్చుకున్నారు. తనను కలిసేందుకు ఎదురు చూస్తున్న అభాగ్యులను హెలిప్యాడ్ ప్రాంగణంలోకి పిలిపించుకుని వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. వారు చమర్చిన కళ్లతో సాయం కోరుతూ వినతిపత్రాలిచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారి భుజం తట్టి ఓదార్చిన సీఎం నేనున్నానంటూ కొండంత భరోసా ఇచ్చారు. ఆరుగురికి తక్షణసాయంగా రూ.లక్ష వంతున నగదు, అవసరమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు వారికి రూ.లక్ష వంతున చెక్కులు ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సీహెచ్. శ్రీధర్, డీఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, కలెక్టరేట్ ఏవో సునీల తదితరులు పాల్గొన్నారు.

విశాఖ హయగ్రీవ బ్రాంచ్‌లో ఐటీ సోదాలు

- 2019 ఎన్నికల సమయంలో రూ.100 కోట్ల లావాదేవీలపై దర్యాప్తు
- సంస్థ ఎండీతో పాటు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): విశాఖ ఎంవీపీ కాలనీలోని హయగ్రీవ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ బ్రాంచ్‌లో ఐటీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. 2019లో ఎన్నికల్లో జరిగిన రూ.100 కోట్ల ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కేసులో భాగంగా అధికారులు సోదాలు చేసినట్టు తెలిసింది. గత ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీకి అనధికారికంగా రూ.కోట్లు లబ్ధి చేకూర్చారనే అభియోగంపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఢిల్లీ, హైదరాబాద్‌లో నవయుగ, ఇతర కంపెనీలపై జరిపిన దాడుల్లో లభ్యమైన సమాచారం ఆధారంగా విశాఖలో ఐటీ అధికారులు ఈ సోదాలు చేపట్టినట్టు సమాచారం. హయగ్రీవ మేనేజింగ్ డైరెక్టర్ జగదీశ్వరుడు, ఇతర కీలక బాధ్యతల్లో ఉన్న పున్నం నారాయణరావు, రాధారాణి చిలుకూరి, నారాయణ శ్రీనివాస్‌మూర్తి, సీహెచ్ ఇంద్రకుమార్, నారాయణరావు గుస్నం ఇళ్లలో ఏకకాలంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఈ సోదాలు కొనసాగాయి. సోదాల్లో లభించిన ఆధారాలపై ఐటీ శాఖ అధికారులు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

తెలంగాణ

105 సీట్లు మనవే!

- ఏమరుపాటుతో ఉంటే మునుగుతాం
- తెలంగాణ సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 95 నుంచి 105 స్థానాలు కచ్చితంగా గెల్చుకొని మళ్లీ అధికారంలోకి వస్తున్నామని, ఇందులో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. ప్రతి ఒక్కరికీ 50 వేలకంటే ఎక్కువ మెజారిటీ వస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలంగా ఉన్నా.. ఏమరుపాటుగా ఉంటే అందరమూ మునుగుతామని స్పష్టం చేశారు. బుధవారం ఇక్కడ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా పరిషత్, కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్న ఈ భేటీలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. అన్ని వర్గాలను సమాన దృష్టితో చూస్తున్నామని, అదే మన విజయ రహస్యమని తెలిపారు. బోగస్ గుజరాత్ మోడల్‌తో మోదీ భారతదేశాన్ని మోసం చేశారని ఆరోపించారు. కానీ తెలంగాణ పదేళ్లలో అద్భుత ప్రగతిని సాధించిందని తెలిపారు. అందువల్లే దేశం తెలంగాణ మోడల్‌ను కోరుకుంటోందని అన్నారు.



సీఎం జగన్‌ను ఆశీర్వదిస్తున్న సుబుధేంద్ర తీర్థస్వామి



అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్



సీఎం జగన్‌ను ఆశీర్వదిస్తున్న శ్రీగణపతి సచ్చిదానందస్వామి

పూర్ణాహుతితో పరిపూర్ణం

మొదటి పేజీ తరువాయి

రుత్వికులు, వేదపండితులు పాలుపంచుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ దంపతులు దీక్షాధారణ చేపట్టి రోజువారీ యజ్ఞ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం

మహాయజ్ఞం ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం జగన్‌కు వేద పండితులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పాంచరాత్ర, వైదిక స్మార్త, వైఖానస, శైవ ఆగమ యాగశాలలను సందర్శించిన సీఎం జగన్ వేద పండితుల సూచనలకు అనుగుణంగా హోమ గుండంలోకి సుగంధ ద్రవ్యాలను జారవిడిచి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక మండపంలో ఏర్పాటు చేసిన అనంత(మహా)లక్ష్మీ అమ్మవారికి స్వయంగా పంచామృతాలతో అభిషేకం చేసి హారతి ఇచ్చారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులందరి పేర్లతో, గోత్రనామాలతో వేదపండితులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా రూపొందించిన దుర్గ గుడి మాస్టర్ ప్లాన్ నమూనాను యజ్ఞశాల వద్ద ముఖ్యమంత్రి పరిశీలించారు.

ఆశీర్వదించిన పీఠాధిపతులు

మహాయజ్ఞం అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో విశాఖ శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర స్వామి, మైసూరు దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానందస్వామి, రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థస్వామి, విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర స్వామితోపాటు శ్రీత్రిదండి దేవనాథ జియ్యర్ స్వామి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరి బాగోగులు కోరుతూ ప్రత్యేక సంకల్పం తీసుకుని మహాయజ్ఞ దీక్షను నిర్వహించిన సీఎం జగన్‌కు పీఠాధిపతులు వేర్వేరుగా వేదాశీర్వచనం అందజేశారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపూర్ణంగా ఫలప్రదం

– ఉప ముఖ్యమంత్రి కొట్టు

వేదాలు సూచించిన ఎనిమిది ఆగమాల ప్రకారం దేశ చరిత్రలో తొలిసారిగా ఆరు రోజులు నిర్వహించిన మహాయజ్ఞం, సీఎం వైఎస్ జగన్ సంకల్పం సంపూర్ణంగా ఫలప్రదమైందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఇతర అధికారులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తూ కార్యక్రమానికి ముందురోజు వరుణ దేవుడు వర్షం కురిపించి ఆశీస్సులు అందించినట్లు చెప్పారు. ప్రత్యేకంగా శ్రీనగర్ నుంచి తెప్పించిన కల్తీ లేని కుంకుమ పువ్వు, ఎక్కడా దొరకని కస్తూరిని విశేష ద్రవ్యాలతో పూజల్లో ఉపయోగించినట్లు వెల్లడించారు. మహాయజ్ఞం విజయవంతంగా పూర్తి కావడం పట్ల సీఎం సంతోషం వ్యక్తం చేశార న్నారు. సనాతన హిందూ ధర్మం పట్ల ముఖ్యమంత్రికి ఉన్న గౌరవానికి ఇది నిదర్శనమని చెప్పారు. రాష్ట్రమంతా ధర్మ ప్రచారం కోసం ప్రభుత్వం ఇప్పటికే ధర్మపరి రక్షణ పరిషత్‌ను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈనెల 25 నుంచి 31వతేదీ వరకు శ్రీశైలంలోని శివాజీ రాజగోపురంపై బంగారు కలశం ఏర్పాటు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునస్వామి వారికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. మహాయజ్ఞం క్రతువును నిర్విఘ్నంగా పూర్తి చేసిన అర్చన ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ వేదాంత రాజగోపాల చక్రవర్తి, గోపాలాచార్యులు, కైతేపల్లి సుబ్రహ్మణ్యం, కండవల్లి సూర్యనారాయణాచార్యులు, మృత్యుంజయప్రసాద్, దుర్గగుడి స్థానాచార్యులు శివప్రసాద్‌ను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ అభినందించారు.

కాగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం వేద పండితులు, చైర్మన్ మోహన్‌రెడ్డి కలసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి: సీఎం జగన్

సాక్షి, అమరావతి: శ్రీలక్ష్మీ మహాయజ్ఞం అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో బుధవారం పాల్గొన్న అనంతరం సీఎం జగన్ ఆ ఫోటోలను జత చేస్తూ ట్వీట్ చేశారు. 'ఆరు రోజుల పాటు జరిగిన చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో వేలాది మంది పాల్గొని రాష్ట్ర పురోగతి, శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రజలు నాపై ఉంచిన అచంచల విశ్వాసానికి నేను కృతజ్ఞత తెలుపుకుంటున్నా. మనకందరికీ అభివృద్ధి, సమృద్ధితో కూడిన ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆశిస్తున్నా. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నా' అని సీఎం జగన్ ఆకాంక్షించారు.

ఇది పేదల విజయం

మొదటి పేజీ తరువాయి

ఏపీ ఫలించలేదు. పేదలకు వ్యతిరేకంగా రైతుల ముసుగులో పిటిషన్లు దాఖలు చేయించి, వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరోధించాలన్న అభ్యర్థనలను సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. చట్ట ప్రకారం రాజధాని ప్రాంతంలో వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిచ్చింది. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని నిరోధించేందుకు నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులు రాజధాని ప్రధాన కేసులో తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకోండి

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించేందుకు సీఆర్‌డీఏకు అనుమతిస్తూ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 45ను సవాలు చేస్తూ అమరావతి రైతులు హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలు చేశారు. జీవో 45 అమలును నిలుపుదల చేయడంతో పాటు పేదలకు ఎలాంటి ఇళ్ల స్థలాలు కేటాయించకుండా ప్రభుత్వాన్ని నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం ఇటీవల విచారణ జరిపి వాటిని కొట్టేసింది. పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని ధర్మాసనం తన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ అమరావతి రైతులు కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై బుధవారం జస్టిస్ జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సీఆర్‌డీఏ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్యాం దివాన్, రంజిత్ కుమార్ తదితరులు వాదనలు వినిపించారు. ఈ విచారణకు హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కూడా హాజరయ్యారు.

ఎలా చూసినా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, పిటిషన్లు దాఖలు చేసిన పిటిషన్‌లకు ఎలాంటి విచారణ అర్హత లేదన్నారు. వేలాది మంది రైతుల్లో కనీసం పది మంది కూడా కోర్టుకు రాలేదన్నారు. సీఆర్‌డీఏ చట్టం ప్రకారం కూడా ఐదు శాతం భూమి ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) వర్గాలకు ఇవ్వాల్సి ఉందన్నారు. దాని ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తోందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. రాజధాని ప్రధాన కేసులో అనుకూలంగా తుది తీర్పు రాకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. ఒకవేళ అలా జరిగినా ప్రస్తుతం పేదలకు చేస్తున్న కేటాయింపులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఎందుకంటే సీఆర్‌డీఏ చట్టమే పేదలకు ఐదు శాతం భూమి ఇవ్వాలని చెబుతోందని తెలిపారు. కాని ఇప్పుడు పేదలకు ప్రభుత్వం ఇస్తున్నది కేవలం 3.1 శాతం భూమి మాత్రమేనన్నారు. 34 వేల ఎకరాల్లో సుమారు 1,200 ఎకరాలు మాత్రమే పేదలకు కేటాయించామని తెలిపారు. సీఆర్‌డీఏ చట్టంలో సెక్షన్ 53 డీ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. ఆర్–5 జోన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం వల్ల ఎలక్ట్రానిక్ సిటీ (ఈ–సిటీ)కి వచ్చిన ఇబ్బందేంటో తెలియడం లేదన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందని తుది విచారణ జరగాల్సి ఉందన్నారు. కోర్టులో దాఖలు అవుతున్నవన్నీ వ్యక్తిగత పిటిషన్లేనని, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు కాదని వివరించారు.

ఈ పది మంది వెనుక ఎవరున్నారో పరిశీలించండి

వేల మంది భూములిచ్చిన రైతులుండగా, కేవలం పది మందే కోర్టుకు ఎందుకొచ్చారో, దీని వెనుక ఎవరున్నారో పరిశీలించాలన్నారు. ప్రస్తుతం పేదలకు కేటాయించిన స్థలాల వల్ల పిటిషనర్లకు చెందిన రిటర్నబుల్ ప్లాట్లకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని సింఘ్వీ తెలిపారు. పేదలకు ప్రస్తుతం కేటాయించిన స్థలాలు ఈ–సిటీ దగ్గర్లో ఉన్నాయని, 6,500 ఎకరాల ఈ–సిటీలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలం చాలా తక్కువని చెప్పారు. అసలు ఆర్–5 జోన్‌లోనే ఎందుకు.. మరెక్కడైనా ఇవ్వొచ్చుగా అని ప్రశ్నించినా సమాధానం చెప్పగలమన్నారు. ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లలో జోన్–1ను ప్రస్తుతం ఉన్న గ్రామాల కారణంగా ముట్టుకునే పరిస్థితి లేదని, జోన్–2 స్పెషల్ ఏరియా అని.. ఢిల్లీలో లుటియన్స్ ఢిల్లీ మాదిరి అని తెలిపారు. జోన్–3 భూములిచ్చిన వారికి ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు ఉన్న ప్రాంతమని, జోన్–4 హై డెన్సిటీ ప్రాంతం అని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అందుకే పేదల కోసం ఆర్–5 జోన్‌ను సృష్టించామని తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్లు ఒక చోట, ఈ–సిటీ మరో చోట అని తెలిపారు. ఒకవేళ పిటిషనర్లు హైకోర్టులో గెలిచినా కూడా సీఆర్‌డీఏ చట్టం ప్రకారం పేదలకు ఐదు శాతం భూమి కేటాయించాల్సిందేనన్నారు. రాజధాని ప్రధాన వ్యాజ్యాలు జూలైలో విచారణకు రానున్నాయని, ఒకవేళ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పు వచ్చినా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిందేనని, అప్పుడు కూడా ఐదు శాతం ఈడబ్ల్యూఎస్‌కు కేటాయించాల్సి ఉంటుందన్నారు.

మాస్టర్ ప్లాన్‌ను మార్చలేదు

సీఆర్‌డీఏ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మాస్టర్ ప్లాన్‌లో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. కేటాయించిన స్థలాల్లో నివాసాలు కట్టుకోవడానికి కూడా ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. చట్ట ప్రకారం పేదలకు ఐదు శాతం స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. భూసేకరణ అనేది ప్రభుత్వం ప్రజల కోసమే చేస్తుందని, దాన్ని ఇతరత్రా ప్రజా ప్రయోజనాల కోసం కూడా వినియోగిస్తుందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్థలాల కేటాయింపు ప్రజా ప్రయోజనం కాదని అనడం ఎంత మాత్రం సబబు కాదన్నారు. అంతకు ముందు పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు శ్యాం దివాన్, రంజిత్ కుమార్ తదితరులు వాదనలు వినిపిస్తూ.. 29 గ్రామాలకు చెందిన 33 వేల మంది రైతులు భూ సమీకరణ కింద ప్రభుత్వానికి రాజధాని కోసం భూములు ఇచ్చారన్నారు. అమరావతిలో మీడియా సిటీ, నాలెడ్జ్ సిటీ, జస్టిస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ ఇలా తొమ్మిది రకాల సిటీలు అభివృద్ధి చేయాలని మాస్టర్ ప్లాన్‌లో ఉందన్నారు. ఒరిజినల్ మాస్టర్ ప్లాన్‌లో 5 శాతం పేదలకు ఇళ్ల స్థలాలను తొమ్మిది సిటీలకు విస్తరించాలన్నారు. మాస్టర్ ప్లాన్‌లో 17వేల ఎకరాలు రెసిడెన్షియల్ జోన్లకు కేటాయించారని పేర్కొన్నారు. జూలైలో తుది తీర్పు రానుందని, అంతకు ముందుగానే పట్టాలు కేటాయించడం సబబు కాదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరు పక్షాల వాదనల అనంతరం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. అటు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో, ఇటు ప్రభుత్వ నిర్ణయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది.

టీడీపీ ఏ ముఖంతో ఓట్లడుగుతుంది?

- అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు అడ్డుకోవడం అనైతిక చర్య
- ప్రభుత్వ సలహాదారు సజ్జల



సాక్షి, అమరావతి: అమరావతిలో పేదలు ఉండొద్దంటున్న తెలుగుదేశం పార్టీ వచ్చే ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతుందని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుకోవడం అనైతిక చర్య అన్నారు. 'టీడీపీ అండ్ కో'కి ఈ ఆలోచన రావడమే సిగ్గుచేటు. పైగా సుప్రీంకోర్టుకు వెళ్లడం వారి బరితెగింపునకు నిదర్శనం. ప్రభుత్వం భూమి వాడకం ప్రభుత్వ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. అవసరాన్ని బట్టి దానిని వినియోగిస్తుంది. అమరావతిలో అందరికీ ప్రాతినిథ్యం ఉండాలి. రాజకీయ పార్టీగా టీడీపీ అర్హత కోల్పోయింది' అన్నారు. ఆర్–5 జోన్‌ను ప్రతిపక్షాలు వివాదంగా మార్చడం దారుణమన్నారు. గుడిలో లింగాన్ని.. మట్టిని, అన్నింటిని మింగేయాలని చంద్రబాబు భావించారని చెప్పారు. ఆర్–5 జోన్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలు పేదలకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయన్నారు.

రియల్ ఎస్టేట్ బ్రోకర్లు

అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని కోర్టుల్లో కేసుల కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్న వాళ్లు రైతులా.. రియల్ ఎస్టేట్ బ్రోకర్లా అని సజ్జల నిలదీశారు. ఆ రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు నాయకుడు చంద్రబాబు అని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. పవన్ కల్యాణ్ చిల్లర చేష్టలతో.. అజ్ఞానంతో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జీవో–1 అమలు చేయడానికి వీలు లేదని కోర్టు చెప్పలేదని.. ఇంకొక చట్టం తీసుకురావాలని సూచించిందన్నారు. న్యాయ నిపుణులు, అధికారులతో చర్చించి కొత్త చట్టం తెస్తామని స్పష్టం చేశారు.

కుట్ర రాజకీయాలకు చెక్

- అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాలపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం
- న్యాయం జరిగే వరకు పోరాడిన సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తిదాయకం
- మంత్రులు ఆదిమూలపు సురేష్, బొత్స, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ డొక్కా, మాజీ మంత్రి కొడాలి నాని

ఒంగోలు/సాక్షి, అమరావతి/గుడివాడ రూరల్: అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదని సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నామని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. అక్కడ పేదలు నివసించకూడదని చంద్రబాబు అండ్ కో ఎన్ని కుట్రలు పన్నినా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు అవి నిలవలేదని చెప్పారు. ఇది సీఎం జగన్, పేదల విజయమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, విద్య శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వర ప్రసాద్, మాజీ మంత్రి కొడాలి నాని బుధవారం వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. కుట్ర రాజకీయాలకు ఈ తీర్పు చెక్ పెట్టిందని చెప్పారు. అమరావతి భూముల్లో పేదలకు పట్టాలిస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందన్న చంద్రబాబు ఆలోచన విధానమేంటో స్పష్టమవుతోందన్నారు.

బాబు కుట్ర బట్టబయలు



పేద, బడుగు, బలహీన వర్గాలు, దళితుల సొంతింటి కల నెరవేర్చడానికి సీఎం వైఎస్ జగన్ సుప్రీంకోర్టు వరకు వెళ్లి.. చేసిన పోరాటం దళితులు, పేదలకు స్ఫూర్తిదాయకం. ఏపీసీఆర్‌డీఏ చట్టం సెక్షన్ 53(1)(డి) ప్రకారం 5 శాతం భూమిని పేదల నివాసాలకు కేటాయిస్తామని పేర్కొన్నారు. కానీ ఆ చట్టంలో ఉన్న అంశాన్ని ప్రభుత్వం అమలు చేసేందుకు ఆర్–5 జోన్‌ను ఏర్పాటు చేస్తే దానిని అడ్డుకునేందుకు తెలుగుదేశం పార్టీ అమరావతి రైతుల ముసుగులో పోరాటం చేసింది. ఇవ్వకూడదని భావించినప్పుడు చట్టంలో ఎందుకు పొందుపరిచారో చంద్రబాబు సమాధానం చెప్పాలి. కేవలం వారి బినామీల భూములను కాపాడుకునేందుకు, భవిష్యత్‌లో రియల్ వ్యాపారం చేయాలనే దుర్మార్గమైన కుట్రతోనే అమరావతి భూ కుంభకోణం జరిగింది. ఈ స్కాం నిగ్గు తేల్చేందుకు న్యాయ స్థానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడం కూడా శుభదాయకం. 51 వేల మంది పేదలకు 900 ఎకరాల్లో పట్టాలు ఇచ్చే ప్రక్రియ మరో వారం పది రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతుంది. తాము చేసిన మంచిని చూసి, ఓటు వేయండని మా నాయకుడు అడుగుతున్నారు. తాను చేసిన మంచి పని ఒక్కటీ చెప్పలేక చంద్రబాబు పొత్తులు, కుట్రలపై ఆధారపడ్డాడు.

– ఆదిమూలపు సురేష్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

న్యాయం ఎప్పుడూ పేదల పక్షానే



పేదల పక్షాన న్యాయం ఉంటుందనడానికి ఈ తీర్పే నిదర్శనం. అమరావతిలో పేదలు ఉండకూడదని మూడేళ్లుగా అడ్డుకుంటున్న ధనిక వర్గాల కుట్రల నుంచి వేలాది మంది పేదలకు న్యాయం చేసిన కోర్టులకు ధన్యవాదాలు. ధనిక వర్గాలకే పరిమితమయ్యేలా స్వర్ణనగరంగా ఉండాలన్న పిడి వాదన నుంచి అమరావతి బయటపడటం సంతోషంగా ఉంది. మంగళగిరిలో లోకేశ్‌ను ఓడించడానికే సీఎం వైఎస్ జగన్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని టీడీపీ నాయకులు ఎలా అనగలుగుతున్నారు? అంటే పేదలు ఉన్న చోట లోకేశ్ ఓడిపోతాడని టీడీపీ నేతలు కూడా నమ్ముతున్నారా? నిజ జీవితంలో హీరో అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెట్టి తీసే సినిమాలో టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడును విలన్‌గా, 420 బ్యాచ్‌ను ఆయనకు అసిస్టెంట్లుగా పెట్టాలి. అవసరమైతే దర్శకుడు రాంగోపాల్ వర్మతో నేను స్వయంగా మాట్లాడుతాను. 2024 ఎన్నికల తర్వాత పవన్‌కు మిగిలేది ప్యాకేజీ డబ్బు, సినిమాలే. సునీల్ పకోడి (ఏపీ బీజేపీ ఇన్‌చార్జ్ సునీల్ ధియోధర్) లాంటి వాళ్ల వల్లే కర్ణాటకలో బీజేపీ పరిస్థితి దిగజారింది. చేసిన మంచి గురించి చెప్పకుండా, ఇక్కడకొచ్చి మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. ఇలాంటి వారిపై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దృష్టి పెట్టాలి.

– కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని), గుడివాడ ఎమ్మెల్యే

పేదలు ఉండొద్దనడానికి వారెవరు?



సీఆర్డీఏ పరిధిలో 50 వేల మందికి పైగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతుండటం దారుణం. అక్కడ పేదవారు ఉండకుండా చేయడానికి కుయుక్తులు పన్నుతున్నారు. రాజ్యాంగం తెలిసిన వారెవరూ ఇలాంటి చర్యలకు పూనుకోరు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా వారు కళ్లు తెరవాలి. టీడీపీ అధికారంలోకి వస్తే అమరావతిలో పేదలకు కేటాయించిన ఇళ్ల నుంచి తరిమి కొడతామని ఇటీవల అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడం దుర్మార్గం. ఆ ప్రాంతంలో అసలు పేదలు ఉండొద్దనడానికి వారెవరు? మా ప్రభుత్వం పేదల పక్షానే నిలబడుతుంది. సీఆర్డీఏ పరిధిలో ఇళ్ల స్థలాలు పొందిన వారందరికీ అవసరమైన వసతులు కల్పిస్తాం.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి


బాబు అండ్ కో కు చెంపపెట్టు



అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామం. రాష్ట్ర ప్రభుత్వానికి ఆ హక్కు ఉందని తీర్పు వెలువరించడం చంద్రబాబు అండ్ కోకు చెంపపెట్టు. పవన్.. పేదల పక్షమా? బాబు పక్షమా? అన్నది చెప్పాలి. సీఎం జగన్ గట్టిగా పేదల పక్షాన నిలచారు కాబట్టే పేదలకే ఇళ్ల స్థలాలు దక్కాయి. పేదల మట్టి, చెమట వాసన అమరావతిలో ఉండకూడదా చంద్రబాబూ? అమరావతి.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌ల సొత్తు కాదు. తాటి చెట్టంత వయసొచ్చినా బాబులో మాత్రం మార్పు రాలేదు. రాష్ట్రంలో తిరగడానికి చంద్రబాబు, లోకేశ్‌లు అనర్హులు. ఈ రాష్ట్రానికి దిక్సూచి ఒక్క సీఎం వైఎస్ జగనే. దుర్మార్గపు ఆలోచనలకు టీడీపీ మూల్యం చెల్లించుకుంటుంది.

– నందిగం సురేష్, ఎంపీ

ఈ పెత్తందార్లకు పేదలంటే ద్వేషం



సుప్రీం తీర్పు చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. పేదలకు సెంటు స్థలం ఇస్తుంటే ఓర్వలేని నాయకులు రాజకీయాలకు అనర్హులు. పేదలకు నివాసం కల్పించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయినా చంద్రబాబు అండ్ కో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పెత్తందార్లకు పేదలంటే ఎందుకంత ద్వేషం? సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదవాలని కాంక్షిస్తే వీరు వ్యతిరేకించారు. పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే ఈ మేధావులు, వామపక్షాల నేతలు ఎందుకు స్వాగతించరు?

– డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ

క్లుప్తంగా...

ఎన్టీటీపీఎస్‌లో సాంకేతిక లోపం

ఆరు యూనిట్లలో నిలిచిన ఉత్పత్తి



ఇబ్రహీంపట్నం: ఎండల తీవ్రత వల్ల స్థానిక నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్) స్విచ్ యార్డ్‌లోని కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్స్ (సీటీ)లో బుధవారం రెండో రోజు కూడా సాంకేతిక లోపం తలెత్తింది. రాత్రి ఏడు గంటల సమయంలో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో 1, 3, 4, 5, 6, 7 యూనిట్లలో 1,550 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. రెండో యూనిట్ నిరంతరాయంగా పని చేస్తూ 210 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఇంజినీర్ల బృందం సమస్య పరిష్కారానికి కృషి చేస్తోంది. మరికొన్ని గంటల్లో సమస్య పరిష్కారమవుతుందని ఎన్టీటీపీఎస్ అధికారులు తెలిపారు. ఏపీ జెన్‌కో థర్మల్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఎన్టీటీపీఎస్‌కు చేరుకుని మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఏవీ సుబ్బారెడ్డి మీద దాడిపై అధ్యయనానికి కమిటీ

- ముగ్గురు నాయకులతో ఏర్పాటు చేస్తాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వెల్లడి

సాక్షి, అమరావతి/నంద్యాల: నంద్యాలలో తమ పార్టీ నేత ఏవీ సుబ్బారెడ్డిపై జరిగిన దాడి ఘటనపై అధ్యయనం చేయనున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. లోకేశ్ పాదయాత్ర సందర్భంగా మంగళవారం నంద్యాలలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఏవీ సుబ్బారెడ్డి వర్గాల మధ్య జరిగిన ఘర్షణపై ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అఖిలప్రియ స్వయంగా దగ్గరుండి తన మనుషులతో సుబ్బారెడ్డిపై దాడి చేయించినట్లు స్పష్టమైంది. దీనిపై ఇరువర్గాలు కేసులు పెట్టుకోవడంతో చంద్రబాబు వారి మధ్య రాజీకి ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఈ ఘటనపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

భూమా అఖిలప్రియకు షోకాజ్ నోటీసు

ఏవీ సుబ్బారెడ్డిపై దాడి ఘటనలో అఖిలప్రియకు అచ్చెన్నాయుడు బుధవారం షోకాజ్ నోటీసు జారీచేశారు. షోకాజ్ నోటీసుకు ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

- ప్రభుత్వ ఉత్తర్వులకు వక్రభాష్యం చెబుతూ తప్పుడు ప్రచారం చేసిన ఫలితం
- మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణపై చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలకు వక్రభాష్యం చెబుతూ తప్పుడు ప్రచారం సాగిస్తున్న ఒక ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. గుంటూరు నగర పరిధిలోని గుజ్జనగుండ్ల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు) సోమరౌతు రామకృష్ణ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్‌కు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో పోస్టింగ్స్ పెట్టడంతో పాటు వివిధ దినపత్రికల్లో తప్పుడు ప్రచారం సాగించారు. దీంతో మున్సిపల్ ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. జరిగిన ఘటనపై విచారణ జరిపిన అనంతరం సీసీఏ రూల్స్‌ను అతిక్రమించినందుకు విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు ఉపాధ్యాయుడు రామకృష్ణను సస్పెండ్ చేస్తూ గుంటూరు డీఈవో శైలజ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

నగ్నపూజల మాంత్రికుడు.. టీడీపీ నాయకుడు

పదేళ్లుగా క్షుద్రపూజల పేరుతో బురిడీ



బాధితురాలి ఇంట్లో పూజగది



నిందితుడు సుబ్బయ్యను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బారెడ్డి



బాధితురాలి మెడపై గోళ్లతో రక్కిన గాయాలు

రేణిగుంట: చేతబడి చేశారేమో అనే అనుమానంతో ఓ మహిళ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి చెందిన మాసారపు సుబ్బయ్య అనే మాంత్రికుణ్ణి ఆశ్రయించగా.. ఆ మాంత్రికుడు ఆమెపై బలాత్కారం చేయబోయిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. తెలుగుదేశం పార్టీ నాయకుడైన సుబ్బయ్య శ్రీకాళహస్తిలో మాంత్రికుడిగా చెలామణి అవుతున్నాడు. రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన 35 ఏళ్ల మహిళకు చేతబడి వదిలిస్తానని చెప్పిన సుబ్బయ్య ఈ నెల 14న పూజా సామగ్రితో ఆమె ఇంటికి వెళ్లాడు. పూజలో నగ్నంగా కూర్చోవాలని మాంత్రికుడు సుబ్బయ్య కోరగా.. ఆమె నిరాకరించింది. దీంతో చేతులతో బంధించి బలాత్కారం చేయబోగా.. ఆమె తప్పించుకుని గట్టిగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించడంతో కామ మాంత్రికుడు సుబ్బయ్యను అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు.

గోర్లతో రక్కి... చాకుతో పొడవబోయాడు

ఆ మహిళ పూజలో నగ్నంగా కూర్చునేందుకు నిరాకరించి ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా.. మాంత్రికుడు ఆమె వీపు, చేతి భాగంలో గోర్లతో రక్కి బలాత్కారం చేసేందుకు యత్నించాడని రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డి వెల్లడించారు. అతని నుంచి విడిపించుకుని బయటకు వచ్చేందుకు ఆ మహిళ ప్రయత్నించగా.. నిమ్మకాయలు కోసిన చాకుతో ఆమెను పొడిచేందుకు ప్రయత్నించాడని తెలిపారు. దీంతో ఆమె ప్రాణభయంతో గట్టిగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీయగా.. చుట్టుపక్కల వాళ్లు వచ్చేలోగా మాంత్రికుడు కారులో పరారయ్యాడన్నారు.



సుబ్బయ్య (ఫైల్)

పదేళ్ల క్రితం ఆటో డ్రైవర్.. ఇప్పుడు టీడీపీ నేత

మాంత్రికుడు మాసారపు సుబ్బయ్య పదేళ్ల క్రితం ఆటో తోలుకుంటూ జీవనం సాగించేవాడు. తనకు మంత్ర శక్తులు తెలుసునని స్థానికులను నమ్మించి శ్రీకాళహస్తిలోని బహదూరుపేటలో మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఇంటి వద్దే తాయెత్తులు కడుతూ ప్రజల నుంచి డబ్బులు గుంజుతున్నాడు. తిరుపతి జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న సుబ్బయ్య పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. శ్రీకాళహస్తి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి నమ్మిన బంటుగా చక్రం తిప్పుతున్నాడు. సమస్యలు, ఆరోగ్య ఇబ్బందులతో వచ్చే అమాయక ప్రజలకు మాయమాటలు చెబుతూ అందినకాడికి దోచుకుంటున్నాడు. మహిళలకు మాయమాటలు చెప్పి వశపర్చుకుని వారి మాన, ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడనే విమర్శలు ఉన్నాయి. ఎవరైనా నిలదీస్తే వారిపై ఎస్సీ, ఎస్టీ అక్రమ కేసులు పెడతానంటూ భయపెట్టేవాడు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి రాజకీయ భవిష్యత్ బాగుండాలని శ్రీకాళహస్తి స్వర్ణముఖి నదిలో సుబ్బయ్య తాంత్రిక పూజలు చేసి నరబలులు కూడా ఇచ్చాడన్న ఆరోపణలున్నాయి. దొంగ మాంత్రికుని ముసుగులో అకృత్యాలు, ఆగడాలకు పాల్పడుతున్న సుబ్బయ్య అక్రమాల డొంకను పోలీసులు కదిలించారు. సమగ్ర విచారణ చేపడుతున్నారు. విచారణలో మరిన్ని విస్తుగొలిపే అంశాలు వెలుగుచూసే వీలుంది.

టెన్త్, ఇంటర్ టాపర్లకు ప్రభుత్వ సత్కారం

▶ మొదటి పేజీ తరువాయి

టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారిని ప్రోత్సహించే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాళ్లను కూడా సత్కరిస్తామన్నారు.

ఆరోగ్యకరమైన పోటీతో ప్రోత్సహించేందుకే..

ఈ నెల 23న నియోజకవర్గ స్థాయిలో సత్కార వేడుక నిర్వహించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పతకం, సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని బొత్స తెలిపారు. మే 27న జిల్లా స్థాయిలో సత్కారంలో విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు అందజేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు చొప్పున నగదు పురస్కారాలతో సత్కరిస్తామని వెల్లడించారు. ఈ నెల 31న జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యకరమైన పోటీతో ప్రతిభను ప్రోత్సహించేందుకే మెరిట్ అవార్డులు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు, పాఠశాల విద్య పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి, కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాధాన్యం కల్పిస్తారు. కారుణ్య నియామకాల్లో వితంతు ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు.

- ➡ భార్యాభర్తల కేసుల్లో ప్రాధాన్యత ఇస్తారు. అయితే ఒకసారి అవకాశం వినియోగించుకుంటే మళ్లీ ఐదేళ్ల తర్వాతే బదిలీలకు అర్హులవుతారు. బదిలీలన్నింటినీ ఉద్యోగుల అభ్యర్థన బదిలీలుగానే పరిగణిస్తారు. పదోన్నతిపై ఉద్యోగి బదిలీ తప్పకపోతే బదిలీ చేసే చోట ఆ పోస్టు ఉండాలి.
- ➡ తొలుత ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తూ బదిలీలు చేపట్టాలి. ఆ తరువాతే నాన్ ఐటీడీఏ ప్రాంతాల్లో బదిలీలు చేయాలి.
- ➡ ఐటీడీఏ పరిధిలో స్థానిక, జోనల్ కేడర్‌లో రెండు సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న ఉద్యోగులను వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయాలి.
- ➡ ఐటీడీఏ ప్రాంతాలకు బదిలీ చేసే ఉద్యోగులు 50 ఏళ్ల లోపు వారై ఉండాలి. గతంలో ఐటీడీఏలో పనిచేయని ఉద్యోగులై ఉండాలి.
- ➡ ఐటీడీఏ ప్రాంతాలతోపాటు మారుమూల వెనుకబడిన ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉంటే తొలుత ఆ ప్రాంతాల్లో పోస్టులు భర్తీ చేసేలా బదిలీలను చేపట్టాలని కలెక్టర్లు, శాఖాధిపతులకు ప్రభుత్వం స్పష్టం చేసింది.
- ➡ ఎటువంటి ఫిర్యాదులు, ఆరోపణలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా బదిలీలు జరిగే బాధ్యత సంబంధిత శాఖాధిపతులపై ఉంటుందని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది.
- ➡ ఆదాయార్జన శాఖలైన వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రవాణా, వ్యవసాయ శాఖల్లో ఉద్యోగుల బదిలీలను ఆయా శాఖల మార్గదర్శకాల మేరకు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
- ➡ పాఠశాల విద్య, ఉన్నత విద్య, ఇంటర్మీడియెట్ విద్య, సాంకేతిక విద్య, సంక్షేమ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలపై సంబంధిత శాఖలు సొంతంగా మార్గదర్శకాలను జారీ చేస్తాయి. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులను బదిలీ చేయరాదు.
- ➡ దృష్టి లోపం ఉన్న ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఒకవేళ స్వచ్ఛందంగా బదిలీ కోరుకుంటే వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయాలి.
- ➡ ఏసీబీ, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బదిలీ అభ్యర్థనలను పరిగణలోకి తీసుకోరాదు.
- ➡ జూన్ 1వ తేదీ నుంచి తిరిగి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుంది.

నేటినుంచి ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ

6,249 మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

- విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడి
- జిల్లాల వారీగా ఉత్తర్వులకు పరిశీలన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు చర్యలు తీసుకున్నట్టు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ ప్రక్రియ గురువారం నుంచి మొదలవుతుందని చెప్పారు. విజయవాడలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో బుధవారం ఆయన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, జాయింట్ డైరెక్టర్ (సర్వీసులు) మువ్వా రామలింగంతో కలిసి పదోన్నతులు, బదిలీల విధివిధానాలపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మేలు జరిగేలా పదోన్నతులు, బదిలీలు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా మంజూరుచేసిన 679 ఎంఈవో–2 పోస్టులను ప్రధానోపాధ్యాయుల ద్వారా భర్తీచేయనున్నట్టు తెలిపారు. దీంతోపాటు 350 గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పోస్టులు కూడా భర్తీచేస్తామన్నారు. ప్లస్ 2 బోధనకు అనుగుణంగా పీజీటీల అవసరం ఉందని, ఈ క్రమంలో అర్హత గల స్కూల్ అసిస్టెంట్లను 1,746 మందిని ఒక ఇంక్రిమెంట్ ఇచ్చి నియమిస్తామని (రీడిప్లాయిమెంట్) తెలిపారు. ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 6,249 మందికి పదోన్నతులు కల్పిస్తామని, దీనికి సంబంధించి ఇప్పటికే ఆర్జేడీలకు, జిల్లా విద్యాశాఖాధికారులకు ఉత్తర్వులు జారీచేశామని చెప్పారు. 117 జీవో ప్రకారం కొంతమందిని సర్దుబాటు చేశామని, ఈ నేపథ్యంలో వారు పాత పాయింట్లే కావాలని (స్టేషన్) అడిగిన నేపథ్యంలో ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్ ఉండాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్కూళ్లను పునఃప్రారంభించేలోగా ఈ ప్రక్రియ పూర్తిచేస్తామని చెప్పారు. తొలుత సీనియర్స్ లిస్టు తయారుచేసి వారిని బదిలీ చేసిన అనంతరం పదోన్నతులు కల్పించనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీకి ఎనిమిది విద్యా సంవత్సరాలు, ప్రధానోపాధ్యాయులకు ఐదేళ్ల సర్వీసు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ ప్రక్రియలో న్యాయపరమైన సమస్యలు ఎదురవకుండా జిల్లాల వారీగా ఉత్తర్వులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ఆప్టా రాష్ట్ర కార్యదర్శి ప్రకాశరావు చెప్పారు. ప్లస్ 2 బోధనకు నియమించే స్కూల్ అసిస్టెంట్లను ఒక ఇంక్రిమెంట్‌తో కాకుండా రెండు ఇంక్రిమెంట్లతో కూడిన పదోన్నతి కల్పించాలని కోరారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు చాలా తక్కువగా ఉంటాయని, అందువల్ల వీరికి పీజీటీలుగా లేదా జూనియర్ లెక్చరర్లుగా అవకాశం కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.

మీకిచ్చిన సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుంది

- పేదల ఇళ్లపై చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలు
- మేము కరెంట్ చార్జీలు పెంచలేదు.. కరెంట్ కట్‌లూ లేవు
- టీడీపీ అధికారంలోకి రావాలంటే నా ఒక్కడి బలం సరిపోదు
- జగన్ పని, వైఎస్సార్‌సీపీ పని అయిపోయింది
- నవంబర్, డిసెంబర్‌లో కాదు.. ధైర్యం ఉంటే రేపే ఎన్నికలు పెట్టాలి
- పెందుర్తి సభలో చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం: పేదల సొంతింటి కల నెరవేర్చేలా అక్కచెల్లెమ్మలకు రూ.లక్షలు విలువ చేసే ఆస్తిని అందించేందుకు ప్రభుత్వం ఇస్తున్న సెంటు స్థలాలపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. మీకిచ్చే సెంటు భూమి శవాన్ని పూడ్చడానికి సరిపోతుందంటూ కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. బుధవారం పెందుర్తిలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎన్టీఆర్ జంక్షన్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సెంటు భూమిలో ఇళ్లు కడతామని జగన్ చెబుతున్నారని, ఆ సెంటు భూమి బరియల్ గ్రౌండ్‌కు మాత్రమే ఉపయోగపడుతుందని ఎద్దేవా చేశారు. ఎవరైనా చనిపోతే అందులో పూడ్చడానికి మాత్రమే దీన్ని ఉపయోగించవచ్చని అన్నారు. టీడీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 2 సెంట్లు ఇచ్చామని తెలిపారు. తాము కరెంట్ చార్జీలు పెంచలేదని, కరెంట్ కూడా ఒక్కసారి కూడా ఆపకుండా సరఫరా చేశామని అన్నారు. విశాఖలో వీధిదీపాలు వేసింది తానేనని, ఈ ప్రభుత్వానికి వాటికి రిపేర్లు కూడా చేసే స్థోమత లేదన్నారు. అమరావతిని రాజధానిగా, విశాఖపట్నం ఐటీ, ఆర్థిక రాజధానిగా, టూరిజం హబ్‌గా తయారు చేస్తామని చెప్పానని చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు బాధ్యత టీడీపీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. విశాఖపట్నం, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలో ఏ మూల నుంచైనా అమరావతికి వచ్చి ఇళ్లు కట్టుకోవడానికి 5 శాతం భూమి రిజర్వ్ చేశానన్నారు. ఇప్పుడా భూముల అంశం సుప్రీంకోర్టుకు వెళ్లిందని తెలిపారు. అమరావతిలో తానుండే అద్దె ఇంటిని కూల్చేసేందుకు ప్రయత్నించి.. ఇప్పుడు దానిపై క్విడ్ ప్రోకో పేరుతో కేసు పెట్టారన్నారు. రాష్ట్రంలో మళ్లీ టీడీపీ అధికారంలోకి రావాలంటే తన ఒక్కడి బలమే సరిపోదని, అందరం కలిసి సమష్టిగా పోరాడాలని అన్నారు. ధనిక ముఖ్యమంత్రికి, నిరుపేదలకు మధ్య జరుగబోతున్న కురుక్షేత్ర పోరాటంలో అందరం కలిసి కౌరవుల్ని ఓడించాలన్నారు. ఇక జగన్ పని, వైఎస్సార్‌సీపీ పని అయిపోయిందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఒక్కరూ కూడా గెలవరని అన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 కాదు.. వైఎస్సార్‌సీపీకి గుండుసున్నాయే మిగులుతుందన్నారు. నవంబర్, డిసెంబర్‌లో ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నారని, ధైర్యం ఉంటే.. రేపే ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు. తన దగ్గర డబ్బులు లేవని వాళ్లనుకుంటున్నారని, తనది ప్రజాబలం, వాళ్లది ధనబలమని అన్నారు.

ఇంకా జనం రాలేదా?

షెడ్యూల్ ప్రకారం చంద్రబాబు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా వేపగుంట జంక్షన్‌కు చేరుకొని రోడ్ షోలో పాల్గొనాల్సి ఉంది. కానీ మధ్యాహ్నం 4 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న చంద్రబాబు.. జనం లేరని తెలిసి మారియట్ హోటల్‌కు వెళ్లిపోయారు. ఈలోగా జనాల్ని నాయకులు తీసుకొచ్చి సమాచారం ఇవ్వడంతో రోడ్ షోకు వెళ్లారు. అప్పటికీ జనం లేకపోవడంతో స్థానిక నేతలపై బాబు అసహనం వ్యక్తం చేశారు. పెందుర్తి సభకు కూడా జనాల్ని తీసుకొచ్చారు. అది కూడా చిన్న రహదారిలో రెండువైపులా హోర్డింగ్‌లు పెట్టి.. ఇరుకు రోడ్డులోనే భారీగా జనం వచ్చినట్లు షో చేసి.. మమ అనిపించారు.

పేదరికంలేని సమాజ నిర్మాణమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేశ్



పటమట (విజయవాడతూర్పు): పేదరికంలేని సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలవారంతా అండగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేశ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బీసీ కులసంఘ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు పేదలకు అనుకూలంగా తీర్పు నివ్వటం పేదప్రజల విజయమని, దీనికి సంఘం తరపున హర్షం తెలియజేస్తున్నామని చెప్పారు.

చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసమే పవన్ రాజకీయాలు

మంత్రి చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా





మంత్రి వేణు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసమే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని.. ఈ విషయం మరోసారి స్పష్టమైందని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం రాజమండ్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. తన మీద నమ్మకం పెట్టుకున్న జనసేన కార్యకర్తలను పవన్ నట్టేట ముంచేశారని విమర్శించారు. ప్యాకేజీ రాజకీయాలు చేస్తున్న పవన్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు తనయుడు లోకేశ్ కోసమే వారాహిని పవన్ లోపల దాచిపెట్టుకున్నారని ఆరోపించారు. దేశంలోనే అత్యంత శక్తివంతమైన నాయకులను సీఎం జగన్ ఎప్పుడో ఎదుర్కొన్నారని.. ఆయన ముందు వీరు ఎందుకూ పనికిరారని విమర్శించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ.. పవన్ తీరుపై జన సైనికులకు సైతం స్పష్టత వచ్చిందన్నారు. వారంతా జనసేన నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఏయూ ప్రగతి భేష్

ఉన్నత విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జె.శ్యామలరావు



త్రీడి ప్రింటింగ్‌ను పరిశీలిస్తున్న శ్యామలరావు

ఏయూక్యాంపస్: నాడు–నేడు పథకం స్ఫూర్తితో ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ప్రతి భవనాన్ని ఆధునీకీకరించడం, మౌలిక వసతులు అభివృద్ధి చేయడం చాలా బాగుందని ఉన్నత విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జె.శ్యామలరావు అన్నారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన బుధవారం పరిశీలించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలకు ప్రోత్సహిస్తూ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఆ–హబ్, నాస్కామ్ ఐవోటీ, డిజిఫాక్‌లో కోడ్ టెక్నాలజీ సెంటర్‌లను పరిశీలించి, అక్కడ శిక్షణ పొందుతున్న, పరిశోధనలు చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఫార్మశీ ఇంక్యుబేషన్ సెంటర్, అమెరికన్ కార్నర్, ఓపెన్ ఎయిర్ థియేటర్, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, హాస్టల్స్‌ను కూడా పరిశీలించారు. ఏయూ విద్యార్థులను ఆవిష్కర్తలుగా మార్చడానికి యూనివర్సిటీలో ఏర్పాటులో చేసిన ఆ–హబ్, నాస్కామ్ ఐవోటీ, డిజిఫాక్‌లో కోడ్ టెక్నాలజీ సెంటర్ దోహదపడతాయని శ్యామలరావు అన్నారు. ఇటీవల ద వీక్–హాన్స్ సర్వేలో జాతీయ స్థాయిలో ఏయూ 9వ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డిని అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కరకట్ట ఇల్లు ఎవరిది బాబూ?

- నీవు ఉండే కరకట్ట ఇల్లు నీది కాదు
- నీ కొడుకు విదేశీ చదువు ఖర్చు నీది కాదు
- సమాజంలో ఎవరి పిల్లలకు వారు ఖర్చు పెట్టుకుంటారు
- మీరు మాత్రం ఇతరుల ఖర్చుతో పనులు జరిపించుకుంటారు
- జగన్, ఆయన కుటుంబ సభ్యులను ఏమైనా అంటే ఊరుకోం
- చంద్రబాబుపై కారుమూరి వెంకటరెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నేరుగా ఎదుర్కొలేక టీడీపీ గజ్జి కుక్కలను పార్టీ ఆఫీస్‌లో కూర్చోబెట్టి చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి మండిపడ్డారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'బాబూ.. మీరుండే కరకట్ట ఇల్లు మీదా? ఆ ఇల్లు మీది కాదు. మీ కొడుకు విదేశీ చదువు ఖర్చు మీది కాదు. సమాజంలో ఎవరైనా పిల్లలకు వారే ఖర్చు పెట్టుకుంటారు. మీరు మాత్రం ఇతరుల ఖర్చుతో పనులు జరిపించుకుంటారు. ఇలా మేం నిజాలు చెబితే మీరు తట్టుకోలేరు. కానీ మాకు సంస్కారం ఉంది. సీఎం జగన్ మాకు అది నేర్పారు' అని అన్నారు.

ఇకనైనా ఫెయిర్ పాలిటిక్స్ చేయండి

చంద్రబాబు ఈ వయస్సులోనైనా ఫెయిర్ పాలిటిక్స్ చేయాలని హితవు పలికారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా అనుకూల పత్రికల్లో నీచాతినీచంగా రాయించడం, ఆయన ప్రయోజనం కోసం హత్యలకు కూడా వెనుకాడకపోవడమేనని చెప్పారు. ఈ నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేశామన్నది గర్వంగా చెబుతోందని తెలిపారు. ధైర్యం ఉంటే బాబు ప్రజలకు ఏమి చేశారో చెప్పుకోవాలి తప్ప, సీఎం జగన్, ఆయన కుటుంబ సభ్యులను తిట్టించడం సరి కాదన్నారు. ఎల్లో మీడియాలో పిచ్చి రాతలు రాయిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఊడిగం స్టార్ పవన్

'ప్యాకేజీ పనివాడు.. ఊడిగం స్టార్' అని ఎవరో ఒకరితో పవన్ కళ్యాణ్‌పై సినిమా తీయాలని వెంకటరెడ్డి అన్నారు. వారి కుటుంబంలో హీరోలు చాలా మంది ఉన్నారని, పవన్‌కళ్యాణే చంద్రబాబుకు ఊడిగం చేస్తున్నారని, ప్యాకేజీ తీసుకుని ఏ పనైనా చేస్తారని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీకి, బీజేపీకి మధ్య బ్రోకరిజం చేయడానికి పోతారని, లేదంటే చంద్రబాబు చెబితే కమ్యూనిస్టులతో పాటు, బీఎస్పీతో కూటమి కట్టి వెళ్తారని, లేదు ఇవాళ నా దగ్గరే ఉండు... అని బాబు అంటే, ఆయన దగ్గరే ఉంటారన్నారు.

జగన్.. మాతో పెట్టుకుంటే మటాషే..

- పాదయాత్రలో టీడీపీ నేత లోకేశ్

నంద్యాల: జగన్ బెదిరిస్తే భయపడే బచ్చాలు ఇక్కడ ఎవరూ లేరని టీడీపీ నాయకుడు నారా లోకేశ్ చెప్పారు. జగన్ మాతో పెట్టుకుంటే మటాష్ అయిపోతావ్.. అని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన వారిని విడిచిపెట్టబోమని, అధికారంలోకి వచ్చాక వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన పాదయాత్ర బుధవారం జిల్లా కేంద్రం నంద్యాలలో కొనసాగింది. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ చంద్రబాబువి అంబేడ్కర్ చట్టాలు అయితే జగన్‌వి బ్రిటిష్ చట్టాలన్నారు. తనను అడ్డుకోవడానికి జీవో నంబర్ 1 తీసుకొచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వంలోని అన్న క్యాంటిన్, పండుగ కానుక, పెళ్లికానుక, చంద్రన్నబీమా, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఆరులక్షల పింఛన్లు వంటివి ఈ ప్రభుత్వం రద్దు చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో అమలు చేసిన అన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభిస్తామని చెప్పారు. గ్రూప్–2, డీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్లు లేవని, రాష్ట్రంలోని కంపెనీలు తరలిపోతున్నాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే కర్నూలు, నంద్యాల జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని, ఏటా ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం 10 వేల టిడ్కో ఇళ్లు నిర్మిస్తే వాటిని ప్రజలకు ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఎవరినీ వదలబోమని, వడ్డీతో సహా చెల్లిస్తాం రాసి పెట్టుకోండి అని హెచ్చరించారు.

రవాణా రంగానికి అండగా ప్రభుత్వం

- లారీ యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- 17 ఏళ్ల తరువాత స్వల్పంగా పన్ను పెంపు
- ఇప్పటికే పన్నును పెంచిన ఇతర రాష్ట్రాలు
- కేంద్ర మార్గదర్శకాల మేరకే గ్రీన్ ట్యాక్స్
- రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను పెంపుపై కొన్ని పత్రికలు వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నాయని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, రోడ్ల నిర్వహణ వ్యయం పెరుగుదల కారణంగా దేశంలో అన్ని రాష్ట్రాలూ రవాణా వాహనాలపై పన్నును ఇప్పటికే పెంచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఏపీలో 17 ఏళ్ల తరువాత స్వల్పంగా మాత్రమే ప్రభుత్వం పన్నును పెంచిందన్నారు. లారీ యజమానుల సంఘం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రవాణా రంగానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని చెప్పారు. లారీ యజమానుల సంఘం లేవనెత్తిన సందేహాలను ఆయన బుధవారం ఓ ప్రకటనలో నివృత్తి చేశారు. అంశాలవారీగా ఆయన వెల్లడించిన విషయాలు.. 'రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నును 17 ఏళ్ల తరువాత ప్రభుత్వం కేవలం 25 శాతం పెంచింది. పెరిగిన ద్రవ్యోల్బణం, రోడ్ల నిర్వహణ వ్యయంతో దేశంలో అన్ని రాష్ట్రాలూ ఈ పన్ను పెంచాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా గత ఏడాది మే నుంచి పెంచింది. రాష్ట్రంలో రవాణా వాహనాలపై పన్నును 2006లో పెంచారు. రోడ్ల నిర్వహణ వ్యయం పెరగడంతో అనివార్యంగా ఏపీ ప్రభుత్వం కూడా ఈ పన్ను పెంచింది. కాలుష్య నివారణ కోసం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పాత వాహనాలపై గ్రీన్ ట్యాక్స్ (హరిత పన్ను)ను విధించింది. ఏపీఎస్‌ఆర్టీసీ కర్ణాటక నుంచి డీజిల్ కొనడంలేదు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా అర్హులైన డ్రైవర్లు, పౌర సరఫరాల శాఖలోని ఇంటింటికి రేషన్ అందించే వాహనాల డ్రైవర్లకు ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. ఆటోలు, మూడు చక్రాల రవాణా వాహనాల (ఎల్‌జీవీ)కు మోటారు వాహన పన్ను రద్దును ప్రభుత్వం కొనసాగిస్తుంది.' అని తెలిపారు.



> సమానత్వం అనేది బహుశా సరైనదే కావొచ్చు, కానీ భూమ్మీది ఏ శక్తి కూడా దాన్నొక వాస్తవంగా మార్చలేదు.
>
> – హానొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 18 మే 2023

ప్రజాతీర్పుకు పట్టం కట్టాలి!

అణిచివేత ఎక్కువైనప్పుడు ఆగ్రహం వస్తుంది. ఎన్నికలు జరిగినప్పుడు మార్పును కోరుతూ ప్రజా సందేశాన్ని మోసుకొస్తుంది. ఆదివారం థాయిలాండ్‌లో జరిగిన ఎన్నికల ఓటింగ్ సరళి అందుకు తాజా ఉదాహరణ. సైన్యం కనుసన్నల్లో నడుస్తున్న, మరోమాటలో సైన్యమే తొమ్మిదేళ్ళుగా నడుపుతున్న ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి, ఆగ్రహం స్పష్టంగా బయటపడింది. మార్పు కోరుతూ థాయిలాండ్ ఓటర్లు తీర్పునిచ్చారు. అలా 2020లో విద్యార్థుల నేతృత్వంలో సాగిన ప్రజాస్వామ్య అనుకూల భారీ నిరసన ఉద్యమాల తర్వాత జరిగిన తొలి జనరల్ ఎలక్షన్ ఫలితం అపూర్వం. దేశ రాజకీయాల్లో మిలటరీ, రాయల్టీ ప్రాబల్యాన్ని సామాన్యులు నిరసించడం అక్కడి ప్రజాస్వామ్యవాద శక్తులకు సంతోషకరమే. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ పాలకులందరికీ గుణపాఠమే.

6.5 కోట్ల జనాభా గల థాయిలాండ్‌లో 5.2 కోట్ల మందికి ఓటు హక్కుంది. రానున్న నాలుగేళ్ళ కాలానికి 500 స్థానాల ప్రజా ప్రతినిధుల సభకు సభ్యులను ఎన్నుకొనేందుకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. సుమారు 4 కోట్ల మంది ఓటర్లు తమ ఛాయిస్ ఏమిటో చెప్పేశారు. దేశంలో ప్రధాన ప్రతిపక్షాలైన ఫ్యూథాయ్, మూవ్ ఫార్వర్డ్ పార్టీలు రెండూ అధికార పార్టీని మట్టి కరిపించాయి. ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య అనుకూల శిబిరాలు విజయం సాధిస్తాయని ముందస్తు ప్రజాభిప్రాయ సేకరణల నుంచి ఊహిస్తున్నదే. కానీ, ఈ స్థాయి విజయం అనూహ్యం, అద్భుతమే. పట్టణప్రాంతాల్లో పట్టున్న, ప్రగతిశీల 'మూవ్ ఫార్వర్డ్' 151 స్థానాలతో అగ్రపీఠిన నిలుస్తుందని అంచనా. ప్రస్తుతం ప్రవాసంలో ఉన్న పదవీచ్యుత ప్రధానమంత్రి తక్షిణ్ శినవాత్ర తరఫున జనాకర్షక రాజకీయ పక్షమైన 'ఫ్యూథాయ్'కి 141 స్థానాలు రావచ్చని లెక్క. అయితే, అధికార శక్తులు ఈ ఫలితాలను అంగీకరించి, ఈ సంస్కరణవాద పార్టీలు ప్రభుత్వం ఏర్పరిచేలా గద్దెను అప్పగిస్తాయా అన్నదే ప్రశ్న.

గత రెండు దశాబ్దాల్లో స్వేచ్ఛగా ఎన్నికలైన ప్రతిసారీ తక్షిణ్ నేతృత్వంలోని పార్టీలు గెలుస్తూ వచ్చాయి. సైన్యం మాత్రం కోర్టు జోక్యంతోనో, తిరుగుబాట్లతోనో వారిని పదే పదే అధికారానికి దూరం పెడుతూ వచ్చింది. నిండా 36 ఏళ్ళ తక్షిణ్ కుమార్తె ఇంగ్లక్ ఇప్పుడు 'ఫ్యూథాయ్' పార్టీని నడుపుతున్నారు. అయితే, వారసత్వ రాజకీయాలతో విసిగిన లక్షలాది తొలి యువ ఓటర్లు 'మూవ్ ఫార్వర్డ్' వైపు మొగ్గడంతో, ఆ పార్టీకి ఎక్కువ సీట్లు దక్కుతున్నాయి. విదేశాల్లో చదివి, వ్యాపార నిమిత్తం తిరిగొచ్చి, సైనికపాలన, రాజరికానికి వ్యతిరేకంగా సాగిన ప్రజాస్వామ్య పోరులో పాల్గొన్న 42 ఏళ్ళ పిటా లిమ్జాయెరాత్‌కు ఎన్నికల్లో జనం జై కొట్టారు. ఈ నేతలిద్దరూ సైన్యానికి ఎదురొడ్డిన ధనిక వ్యాపార కుటుంబాల వారే కావడం గమనార్హం. ఇక, చిన్నాచితకా ప్రతిపక్షాలు సైతం ఈసారి మెరుగైన ఫలితాలు సాధిస్తుండడం విశేషమే. ఈ ప్రజాస్వామ్య అనుకూల పార్టీలన్నీ కలసి సంకీర్ణ సర్కార్‌గా పనిచేసేందుకు సుముఖంగా ఉన్నాయట. అలా అన్నీ ఒక తాటిపైకొస్తే సైనిక పాలన, రాచరికపు అపరిమిత అధికారాలకు చరమగీతం పాడాలన్న జనం కోరిక నెరవేరుతుంది.

కానీ, పార్టీలు అనుకున్నంత మాత్రాన జరగాలని లేదు. 2019 ఎన్నికల్లో నేటి 'మూవ్ ఫార్వర్డ్' పార్టీ ముందస్తు రూపం 'ఫ్యూచర్ ఫార్వర్డ్' మూడోస్థానంలో నిలిచింది. తీరా పార్టీ సారథిని ఎంపీగా అనర్హుడిగా ప్రకటించారు. పార్టీ రద్దయింది. ఇప్పుడు ప్రధాని కావాలని ఆశిస్తున్న 'మూవ్ ఫార్వర్డ్' నేత పిటాకు సైతం ఎన్నికైన ఎంపీల మద్దతుతో పాటు సైన్యం నియమించిన సెనేటర్ల మద్దతు అవసరం. ఎన్నికల్లో గెలిచినా సరే ప్రభుత్వ ఏర్పాటుకు ఇతరుల మద్దతు అవసరం కావడమే థాయ్‌లోని విచిత్రం. ఇదంతా ఎన్నికల్లో గెలిచిన పార్టీల అధికారాన్ని సైతం తటస్థీకరించేలా, సెనేట్‌ను నియమిస్తూ 2017లో రాజ్యాంగాన్ని సైన్యం తిరగరాసిన ఫలితం. 2014లో జనరల్ ప్రయూత్ చాన్ – ఓచా అప్పటి పౌరప్రభుత్వాన్ని పడదోసి, సైన్యం, రాయలిస్ట్ పార్టీలు, రాచరికపు అండతో తనను తాను ప్రధానిగా నియమించుకున్నారు. న్యాయవ్యవస్థ సహా అన్నిటినీ విధేయులతో నింపేశారు.

ఇటు నిరుపేద థాయ్‌లను ఆకర్షించే ఫ్యూథాయ్ పార్టీ అన్నా... అటు నిర్బంధ సైనిక శిక్షణ, రాజు – రాణులను పల్లెత్తు మాటన్నా 15 ఏళ్ళ దాకా జైల్లోకి నెట్టే కఠినమైన 'లెస్–మాజెస్టీ' చట్టాలకు చరమగీతం పాడతానంటున్న మూవ్ ఫార్వడ్ పార్టీ అన్నా... సహజంగానే సైన్యానికి గిట్టదు. కానీ, రాచరిక అనుకూల చట్టాలను మారుస్తానంటున్న పార్టీకి నవతరం థాయ్ ప్రజలు జేజేలు పలకడం ఈ ఆగ్నేయాసియా దేశంలో ప్రజాస్వామ్య మార్పు పవనాలకు సూచన. ఇది గ్రహించి సంప్రదాయ శక్తులు పట్టు సడలిస్తాయా? జనం ఎన్నుకున్న 500 సభ్యుల ప్రతినిధుల సభతో పాటు పాలక సైనిక వర్గమే నియమించిన 250 మంది సభ్యుల సెనేట్‌కూ ప్రధాని ఎంపికలో ఓటు ఉండడమే విషాదం. అంటే ఎన్నికల్లో పెల్లుబికిన ప్రజాస్వామ్య వెల్లువను సైతం సైన్యం పరోక్షంగా తొక్కేసే ముప్పుంది.

ఇన్నేళ్ళుగా దేశాన్ని తమ కబంధ హస్తాల్లో ఉంచుకున్న సైనిక జనరల్స్ తాజా ప్రజా తీర్పును గౌరవించాలి. అధికారాన్ని గెలిచిన పార్టీలకు అప్పగించి, సైనిక విధులకు పరిమితం కావాలి. ఆ పని చేయక, ప్రజాకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అది థాయిలాండ్‌కే మంచిది కాదు. పొరుగునే మయన్మార్‌లో 2020 నవంబర్ ఎన్నికల్లో ఆంగ్‌సాన్ సూకీ అఖండ విజయం సాధించినా, మూడునెలల్లో సైన్యం అధికారం హస్తగతం చేసుకొని, ఎన్నికల ఫలితాన్ని రద్దు చేసింది. ఇప్పుడు అంతర్యుద్ధంతో అల్లాడుతున్న ఆ దేశంలా థాయ్‌లాండ్ తయారు కాకుండా ప్రపంచ దేశాలూ జాగరూకత వహించాలి. అప్పుడే థాయ్ ప్రజలు గెలిచినట్టు, అక్కడ ప్రజాస్వామ్యం నిలిచినట్టు!

కర్ణాటక ఫలితాన్ని ఎలా చూడాలి?



మల్లెపల్లి లక్ష్మయ్య


కర్ణాటక శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది అనడం కన్నా బీజేపీ ఓడింది అనడం కరెక్టు. ఎందుకంటే కాంగ్రెస్‌ది సంపూర్ణ విజయం అనుకోలేం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని వద్దనుకున్నవాళ్లు కాంగ్రెస్, జేడీ(ఎస్) మధ్య ఎటూ తేల్చుకోలేకపోయారు. ఈసారి మాత్రం కాంగ్రెస్ వైపు వచ్చారంతే! ఇప్పటికీ కర్ణాటకలో బీజేపీ బలమేమీ తగ్గలేదు. కానీ విడిపోయిన ప్రజలను ప్రతిపక్షం వైపు నిలబడేటట్టు చేసి, తన ఓటమిని తానే రాసుకుంది బీజేపీ. కాంగ్రెస్ పార్టీ ఆర్థిక విధానాలకూ, బీజేపీ అమలు చేస్తున్న విధానాలకూ మౌలికమైన తేడా లేదు. దేశంలో నెలకొన్న అన్ని విషయాలపైనా, ప్రజల క్షేమం, సంక్షేమం, సమగ్రాభివృద్ధి అనేవి కాంగ్రెస్ ఆశయాలైతే, వాటికి అనుగుణమైన విధానాన్ని ప్రకటించాలి.

ఇది ప్రజా విజయం. అధికార భారతీయ జనతా పార్టీ ఓటమి. ఇదే ఇటీవల కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సారాంశం. అంతేగానీ, ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ విజయమనుకుంటే పొరపాటు. ఇది దేశ వ్యాప్తంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతమవుతుందనుకుంటే అంతకన్నా పొరపాటు. అయితే, ఈ ఎన్నికల ఫలితాల వల్ల అంచనాలు తారుమారయ్యే అవకాశం మాత్రం ఉంది.

మొదటిగా, ప్రజల విజయం విషయానికి వస్తే– గతంలో జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీని కాదనుకున్నవాళ్ళు జనతాదళ్ (ఎస్)కు, కాంగ్రెస్‌కు మధ్యలో నిలిచిపోయారు. ఈ ఎన్నికల్లో వాళ్ళు తెలివిగా చాలా చోట్ల జనతాదళ్(ఎస్)ను పక్కన పెట్టి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారు. భారతీయ జనతాపార్టీకి వ్యతిరేకంగా జేడీ(ఎస్), కాంగ్రెస్ పోటీలో ఉంటే, బీజేపీని కాదనుకున్న వాళ్ళు కాంగ్రెస్ వైపు మొగ్గారు. గత ఎన్నికల్లో జేడీ(ఎస్) 37 సీట్లలో విజయం సాధిస్తే, ప్రస్తుత ఎన్నికల్లో అది 19కి పడిపోయింది. అంటే సగానికి దిగజారిందని అర్థం. దీనికి కారణం, ప్రజల చతురత తప్ప మరొకటి కాదు. మూడు, నాలుగు పార్టీలు పోటీలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలు అనుసరించడానికి ఇది ఒక నమూనా.

ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ చాలా బలంగా ఉన్నట్టు మనం భావిస్తున్నాం. ఎందుకంటే, పార్లమెంటు ఎన్నికల్లో, శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని రెండుసార్లు నిలబెట్టుకుంది. అది కూడా అత్యంత అధిక సంఖ్యలో. అక్కడ నాలుగు పార్టీలు పోటీ పడుతున్నాయి. అందులో గత ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ చాలా బలహీనపడింది. కాంగ్రెస్ కూడా అంతంత మాత్రంగానే తన ఉనికిని చాటగలిగింది. అయితే అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) బలమైన ప్రతిపక్షంగా నిలిచింది. 2017లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ 312 సీట్లు గెలుచుకోగా, 2022లో దాని బలం 255కు పడిపోయింది. సమాజ్‌వాదీ పార్టీ 2017 ఎన్నికల్లో 47 స్థానాలకు పరిమితం కాగా, 2022లో 111 స్థానాలకు తన బలాన్ని పెంచుకున్నది. అంటే క్రమంగా సమాజ్‌వాదీ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి బలమైన ప్రతిపక్షంగా ఎదుగుతోంది. మిగతా రెండు పార్టీల పరిస్థితిని చూస్తే, ఇది మనకు అర్థం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ 2017 ఎన్నికల్లో 7 స్థానాల్లో గెలిచి, 6.25 శాతం ఓట్లను సాధించుకుంటే, 2022 ఎన్నికల్లో రెండు సీట్లకు పరిమితమై పోయి, 2.33 శాతం ఓట్లను మాత్రమే పొందగలిగింది. బహుజన్ సమాజ్ పార్టీ 2017 ఎన్నికల్లో 22.23 శాతం ఓట్లను సంపాదించి, 19 స్థానాల్లో విజయం సాధించింది. అయితే 2022 ఎన్నికల్లో ఓట్ల శాతం 12.88కి పడిపోగా, కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావాల్సి వచ్చింది. కాంగ్రెస్, బీఎస్పీ క్రమంగా తమ రాజకీయ బలాలను కోల్పోతున్నట్టు కనిపిస్తున్నది. ఒకవేళ అక్కడ బీజేపీని ఓడించాలనుకునే ప్రజలు సమాజ్ వాదీ

కొత్త కోణం



పార్టీవైపే మొగ్గితే భారతీయ జనతాపార్టీ ఉత్తరప్రదేశ్‌లో తన ప్రాధాన్యతను కోల్పోవాల్సి వస్తుంది. అంటే జాతీయస్థాయి ఎన్నికల్లో కూడా బీజేపీ తన ఆధిపత్యాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడక తప్పదు. దానికి ఉదాహరణగా సీట్లు మాత్రమే కాదు, ఓట్ల శాతాన్ని కూడా చూడాలి. సమాజ్‌వాదీ పార్టీ 2017 ఎన్నికల్లో 21.82 శాతం ఓట్లను పొందితే, 2022 ఎన్నికల్లో అది 32.06 శాతానికి పెరిగింది. అంటే దాదాపు పది శాతానికి పెరిగింది. కాంగ్రెస్, బహుజన సమాజ్‌వాదీ పార్టీలు ప్రజాదరణ కోల్పోతున్నట్లు, సమాజ్‌వాది పార్టీ వైపు ప్రజలు వెళుతున్నట్లు అర్థం చేసుకోవచ్చు.

ఇక రెండో విషయం, బీజేపీ ఓటమి: నిజానికి కర్ణాటక రాష్ట్ర చరిత్రలో ఇప్పటికీ ఒకే పార్టీ రెండు పర్యాయాలు అధికారంలోకి రాలేదు. 1985 నుంచి ఇదే చరిత్ర పునరావృతమవుతూ ఉంది. 1985 వరకు కర్ణాటకలో కాంగ్రెస్ పాలన కొనసాగింది. 1985లో మొదటిసారిగా జనతాపార్టీ నాయకత్వంలో రామకృష్ణ హెగ్డే ప్రభుత్వం ఏర్పాటయ్యింది. ఇదే మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం.1994లో జనతాదళ్ 227 సీట్లతో అధికారంలోకి వచ్చింది. 1999లో కాంగ్రెస్, 2004లో జనతాదళ్ సంకీర్ణ ప్రభుత్వం, 2008లో బీజేపీ ప్రభుత్వం, 2013లో మళ్ళీ కాంగ్రెస్, 2018లో మళ్ళీ బీజేపీ అధికారాన్ని అందుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ గెలిచింది. ఇది కర్ణాటక అసెంబ్లీ చరిత్ర. కర్ణాటక ప్రజలు 1985 నుంచి ఇప్పటి వరకు ఒకే పార్టీకి రెండవసారి అధికారం కట్టబెట్టలేదు. అయితే బీజేపీ ఈ చరిత్రను తిరగరాయాలని ఉవ్విళ్ళూరింది. అది ప్రజల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని చూసింది. సూటిగా చెప్పాలంటే ముస్లింల మీద వ్యతిరేకతను రెచ్చగొట్టి, మిగతా ప్రజలందరినీ తమవైపు తిప్పుకోవాలని చూసింది. అందులో భాగంగానే హిజాబ్, అజాన్, ఉమ్మడి సివిల్ కోడ్, పశుసంరక్షణ పేరుతో దాడులు, ఒక రకంగా, ఉత్తర ప్రదేశ్‌లో అనుసరించిన అన్ని విధానాలను ఇక్కడ అమలు చేయాలని శతవిధాలుగా ప్రయత్నించింది. కానీ ఆ విషయాలేవీ కర్ణాటక ప్రజలు పట్టించుకోలేదనడానికి ఈ ఫలితాలే నిదర్శనం.

ఇది మతాల మధ్య విభజన అయితే – ఇక కులాల మధ్య ముఖ్యంగా ఎస్సీలలో ఉన్న వ్యత్యాసాలను ఉపయోగించుకొని మాదిగల ఓట్లను పొందడం కోసం రిజర్వేషన్ల విభజనను తెరపైకి తీసుకొచ్చింది. అదికూడా ఫలించలేదు. తన ఆర్థిక, సామాజిక కార్యక్రమాలు, అభివృద్ధి పనులను చూపించుకోవడం కాకుండా, ఇటువంటి విభజనతో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలనుకున్నది. ఇప్పటికీ కర్ణాటకలో బీజేపీ బలమేమీ తగ్గలేదు. కానీ విడిపోయిన ప్రజలను ప్రతిపక్షం వైపు నిలబడేటట్టు చేసి, తన ఓటమిని తానే రాసుకుంది బీజేపీ.

మూడో విషయం, కాంగ్రెస్ గెలుపు: ఇది బీజేపీ ఓడిపోయి, అందించిన గెలుపు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులైన శివకుమార్, సిద్ధరామయ్య ఐక్య కృషి తోడైనప్పటికీ తనకు తాను గెలిచిన గెలుపు కాదిది. ఎందుకంటే, పదేళ్ళ కిందట దేశంలో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఆర్థిక విధానాలకూ, ఇప్పుడు బీజేపీ అమలు చేస్తున్న విధానాలకూ మౌలికమైన తేడా లేదు. అయితే ఇటీవల ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతున్న మాటలు గత కాంగ్రెస్ విధానాలకు భిన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అదే విధంగా కార్పొరేట్ల గుత్తాధిపత్యం మీద రాహుల్ చేస్తున్న విమర్శల్లో ఆ మార్పును చూడవచ్చు. కానీ అవి పార్టీ విధానంగా ప్రకటించాలి. అదే విధంగా గతంలో తాము అనుసరించిన ఆర్థిక, రాజకీయ విధానాల పైన ఆత్మవిమర్శ చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అంబానీలను ఆకాశానికెత్తిన విషయాన్ని గుర్తు చేసుకొని సవరించుకోవాల్సిన బాధ్యత ఆ పార్టీపై ఉంది. అదే విషయంపై కొన్ని విషయాల్లో వ్యతిరేకించిన జైపాల్‌రెడ్డి లాంటి నాయకులు పదవులు కోల్పోవాల్సి వచ్చింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అదే సంవత్సరంలో రాజీవ్ గాంధీ లాంటి నాయకులు అనుసరించిన హిందుత్వ అనుకూల విధానాలను సమీక్షించుకోవాలి. అయితే బీజేపీని కేవలం అధికారం కోసం మాత్రమే వ్యతిరేకించాలనే భావన ఉంటే కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను ఆశించలేం. దేశంలో నెలకొన్న అన్ని విషయాలపైనా, ప్రజల క్షేమం, సంక్షేమం, సమగ్రాభివృద్ధి అనేవి కాంగ్రెస్ ఆశయాలైతే, వాటికి అనుగుణమైన విధానాన్ని ప్రకటించాలి. కేవలం ఎన్నికల సమయంలో, లేదా ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని, ఆ తర్వాత దాని ఊసుఎత్తకపోతే, కాంగ్రెస్‌కు కర్ణాటక లాంటి గెలుపులు కష్టమనే చెప్పాలి. అందుకే ఇకనైనా కాంగ్రెస్ చేసిన తప్పులకు లెంపలేసుకొని, సరికొత్త ప్రజా మార్గాన్ని ఎంచుకోక తప్పదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మహావీరులు



తొంభై ఏళ్ల క్రితం 1933 మే 17న మహావీర్ సింగ్‌ను అండమాన్‌లోని సెల్యులార్ జైల్లో బ్రిటిష్ వాళ్లు హింసించి చంపారు. ఆయన భగత్‌సింగ్ సన్నిహిత మిత్రుడు. భగత్, రాజ్‌గురు 1928లో శాండర్స్‌ను చంపినప్పుడు మహావీర్ కారు నడిపి వారు తప్పించుకునేలా చూశాడు. 1929లో అరెస్టయ్యాడు. అండమాన్‌లో ఖైదీలతో వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా చేపట్టిన నిరశన దీక్ష కారణంగా బ్రిటిష్ వాళ్లు మహావీర్‌తో పాటు మొహిత్ మొయిత్రా, మోహన్ కిశోర్ నామదాస్‌ల మరణానికి కారణమయ్యారు. వాళ్ల పేర్లు ఎంతమందికి తెలుసు?

– అద్వైద్, చరిత్రకారుడు

వాళ్లనేం చేస్తారు?



డియర్ (పాకిస్తాన్) జనరల్స్: (నిరసనల్లో భాగంగా) సైనిక నిర్మాణాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసిన యువతీ యువకులందరి మీదా విచారణ జరుపుతామని శపథం చేశారుగానీ దయచేసి కొంచెం వెనక్కి తగ్గి ఆలోచించండి. అసలు ఈ గందరగోళానికి నేరుగా మీ సీనియర్లు బాధ్యులు. సైనిక చట్టం కింద మీరు వాళ్లను కూడా విచారిస్తారా?

– రజా అహ్మద్ రూమీ, రచయిత

చూస్తూ ఉండాలి...



మహారాష్ట్ర రాజకీయాలు, పాకిస్తాన్ రాజకీయాలు, బీజేపీ–కాంగ్రెస్ రాజకీయాలు, క్రీడా రాజకీయాలు– ఈ విషయాలు విస్తారమైనవి. ఒక బయటి మనిషిగా ఇందులో ఎవరు సరో, ఎవరు కాదో అర్థం కాదు. నేను చేయగలిగిందల్లా వీటిని ఫాలో కావడమే.

– మానసీ నారాయణ జోషీ, పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

పరస్పర అభినందన



నువ్వొక పుస్తకం చదువుతున్నప్పుడు దాని రచయిత ఆ పక్కనే మనతో ప్రయాణించడం అద్భుతంగా ఉంటుంది. అదే రచయిత మన పుస్తకాన్ని చదువుతుంటే ఇక ఆ క్షణానికి విలువ కట్టలేం. (రచయిత, దౌత్యవేత్త నవతేజ్ సర్నాతో ప్రయాణిస్తున్న ఫొటో షేర్ చేశారు.)

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

చీకటి శిరసున సినీవాలి సిరివెన్నెల!


సందర్భం



డా॥ పైడిపాల

'సిరివెన్నెల' పేరునూ, కనీసం ఒకటైనా ఆయన సినిమా పాటనూ వినని తెలుగు వాళ్లుండరు. సిరివెన్నెల అసలు పేరు చేంబోలు సీతారామశాస్త్రి. సిరివెన్నెల చిత్రానికి 'సింగిల్ కార్డ్' పాటలతో ప్రాచుర్యం పొందిన సీతారామశాస్త్రికి ఆయనకు సినీగేయకవిగా జన్మనిచ్చిన దర్శకుడు కె.విశ్వనాథ్ వాత్సల్యంతో పెట్టిన పేరు 'సిరివెన్నెల సీతారామశాస్త్రి'. అలా 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి కలం పేరుగా స్థిరపడింది. 1955 మే 20వ తేదీన మధ్యప్రదేశ్‌లోని 'శివని' గ్రామంలో ఒక దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన శాస్త్రి పూర్వాశ్రమంలో టెలిఫోన్ సంస్థలో చిరుద్యోగి. 'భరణి' కలం పేరుతో కవితలు రాయడం ప్రవృత్తిగా పెట్టుకొన్న శాస్త్రి సినిమాలకు పాటలు రాయాలని, రాస్తానని ఎపుడూ అనుకోలేదు.

'గంగావతరణం' గేయఖండిక ద్వారా కాకతాళీయంగా విశ్వనాథ్ దృష్టినాకర్షించిన సీతారామశాస్త్రి 'సిరివెన్నెల' చిత్రం సింహద్వారంగా సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి పాటకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి నంది పురస్కారాన్ని అందుకోవడమేగాక, వరుసగా మూడు సంవత్సరాల పాటు నంది పురస్కారాల నందుకొని 'హ్యాట్రిక్' సాధించిన ఏకైక సినీగేయకవిగా తన ప్రత్యేకతను నిరూపించుకున్నారు. అలాగే తన మూడున్నర దశాబ్దాల సినీగేయ ప్రస్థానంలో అత్యధిక (పదకొండు) నంది పురస్కారాలను, మనస్విని, కళాసాగర్, ఫిల్మ్‌ఫేర్ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థల నుండి అవార్డులను అందుకున్నారు. కేవలం సినిమాలకే పరిమితమైన ఏ తెలుగు సినీ గేయకవికీ లభించని 'పద్మశ్రీ' అవార్డు గౌరవాన్ని కూడా సాధించి అనితర సాధ్యమైన విజయాలను నమోదు చేసుకున్నారు. సినిమా పాట కొత్త పోకడలు పోతూ, ఎత్తు పల్లాల దారిలో ప్రయాణిస్తూ విమర్శలకు గురువుతున్న అయోమయ దశలో వేటూరి ఝుంఝూమారుతంలా విజృంభించి ఎల్లల్ని చెరిపివేస్తే... సిరివెన్నెల మలయమారుతంలా వేదిక మీదకు వచ్చి రసజ్ఞులకు సేద తీర్చారు.



పూర్వ సినీకవులు అనుసరించిన మార్గానికి భిన్నంగా సిరివెన్నెల ప్రేక్షకుల స్థాయిని తక్కువగా అంచనా వేయక వారిని తన స్థాయికి తీసుకొని వెళ్లడానికి ప్రయత్నించారు. కవిత్వానికి సినిమాపాటకు తేడా లేదనీ, సినిమాపాట కూడా కవిత్వమేననీ ఆయన నిశ్చితాభిప్రాయం. సినిమా పాటల్ని కూడా కవితీకరించి వాటిని శుచిగా రుచిగా వడ్డించిన నైష్ఠికుడు సిరివెన్నెల. 'వాసి'కి ప్రాధాన్యమిస్తూ ఆయన రాసిన మొత్తం పాటలు సుమారు రెండు వేలు.

సీతారామశాస్త్రి సినీగేయరచనలో తొక్కిన కొత్త పుంతలకు స్ఫూర్తిప్రదాత, బహుభాషా కోవిదుడైన ఆయన తండ్రి డా॥ సీవీ యోగి. ఆయన తాత్వికత, తార్కికత, భారతీయ సనాతన ధర్మం పట్ల నిబద్ధత సిరివెన్నెలకు సాహిత్యపరంగా దిశానిర్దేశం చేశాయి. ఆ ప్రభావంతోనే సిరివెన్నెల తన మొదటిపాటలోనే విశ్వమంతా ప్రణవనాదం నుంచి ఆవిర్భవించిందనే వేదప్రామాణికమైన తత్త్వాన్నీ, సత్యాన్నీ ఆవిష్కరించారు. ఉపనిషత్ సారాన్ని జీర్ణించుకొని తర్కబద్ధమైన పాటల్ని రాశారనడానికి ఆయన ముందుగా రాసి ఉంచిన పాటల కోసమే తీసిన 'గాయం', 'చక్రం' వంటి చిత్రాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. ఆయన తన పాటల్లో సనాతన ఆర్షధర్మానికి, భారతీయ సంస్కృతికి పెద్దపీట వేశారనడానికి 'స్వర్ణకమలం', 'శుభలగ్నం' వంటి చిత్రాల్లోని పాటలే నిదర్శనం. పై గుణాలకు తోడు పాట సంగీతం, గానం వంటివి లేకుండా విడిగా చదివినా సాహిత్యపరంగా స్వయం ప్రతిపత్తి కలిగి ఉండాలనీ, సంగీత ప్రమేయం లేకుండా మాట్లాడుకునే మామూలు భాషలో 'బోటనీ పాఠముంది' వంటి పాటల్లా వచన శైలిలో కూడా ఉండొచ్చనీ ఆయన అభిప్రాయాలు. అన్నిటికీ మించి తన పాటల్లో మనిషితనాన్ని శోధించడానికి నిరంతరం ప్రయత్నించిన 'మనిషి కవి' సిరివెన్నెల.

'నా ఉచ్ఛ్వాసం కవనం... నా నిశ్వాసం గానం' అని పాటను ప్రేమించి, శ్వాసించి, శాసించిన స్వాప్నికుడు సిరివెన్నెల. 'నా పాట పంచామృతం' అని పాటను పవిత్రంగా భావించిన సిరివెన్నెల ముద్ర ఏ విభాగానికి చెందిన పాటలలోనైనా స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన తనకు ముందుతరం కవులను గౌరవించడమే కాదు, తన నుండి స్ఫూర్తి పొందిన యువకవులను కూడా అంతగానూ ప్రోత్సహించారు. అందరిలో త్వరగా కలిసిపోవడం, అందర్నీ కలుపుకోవడం శాస్త్రి స్వభావం కనుకనే 'బాలు'లా ఆయన అందరివాడయ్యారు. ఏ రంగంలోనైనా శిఖరసమానుడైన మనిషి హఠాత్తుగా నిష్క్రమిస్తే అక్కడ ఎవరూ పూడ్చలేని శూన్యం, వెలితి ఏర్పడితే... ఆ మనిషి మనీషి, మహర్షి, సిరివెన్నెల సీతారామశాస్త్రి!

వ్యాసకర్త సినీగేయసాహిత్య పరిశోధకులు । 99891 06162

(మే 20న సిరివెన్నెల జయంతి; 19న పైడిపాల 'సిరివెన్నెల రసవాహిని', 20న చేంబోలు శ్రీరామశాస్త్రి 'పూర్ణత్వపు పొలిమేరలో' పుస్తకాల ఆవిష్కరణ)

బౌద్ధధర్మ స్వీకరణ ఎందుకంటే...


అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

బుద్ధుని కాలంలో మతం అనేది... మనిషికి మంచి చేయాలన్న స్ఫూర్తినిచ్చేది, మనిషిలో జిజ్ఞాసను పెంపొందించేది, సామాజిక వికాసం కోసం అంకితం కమ్మని చెప్పేది. ఇవన్నీ బౌద్ధం కూడా చెప్పింది కాబట్టి దాన్ని అప్పట్లో ఒక మతంగా కొందరు భావించారు. నిజానికి దాన్ని మతం అనేకన్నా ధర్మం అనడం సబబుగా ఉంటుంది. ఇతర మతాలను గమనిస్తే... దేవుడు, దయ్యం, భూతం, అతీంద్రియ శక్తులు వంటివెన్నో మత విశ్వాసాలుగా కనిపిస్తాయి. అయితే ఈ విశ్వాసాలకు ఆధారాలు లేవు. ఇవి సైన్సును వ్యతిరేకిస్తాయి. బౌద్ధం తప్ప దాదాపు చాలా జీవన మార్గాలు మతాలుగా ఘనీభవించుకుపోయాయి. అందుకే బౌద్ధం మతం కాదు... ధర్మం!

నాకు ఏ మత విశ్వాసంపైనా వ్యతిరేకత లేదు, అభిమానమూ లేదు. పుట్టడం మన చేతుల్లో లేని పరిస్థితుల్లో ఇష్టం ఉన్నా లేకున్నా ఏదో ఒక మతంతో సంబంధం కలిగి ఉంటాం. బౌద్ధం అంటే పెద్దగా తెలవకున్నా నాకు చిన్నప్పటినుంచీ బుద్ధుడంటే ఇష్టం. అప్పటినుంచి ఇప్పటివరకు బౌద్ధ జీవనమార్గాన్నే అవలంబిస్తున్నాను. కానీ బౌద్ధాన్ని స్వీకరించలేదు. బౌద్ధం గురించి అవగాహన పెంచుకున్న తర్వాత అది నాకు మతంగా కనబడలేదు. సైంటిఫిక్ నైతిక ధర్మంగా అర్థమైంది. నాకు నలభై ఏళ్ళుగా బౌద్ధం స్వీకరించాలనున్నా అదీ ఓ మతమే ఐనప్పుడు ఎందుకని నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను. కాని అన్ని మతాల్లా మతంగా ఘనీభవించకుండా ఉన్న ఒకే ఒక ధర్మం బౌద్ధం అని అర్థమయ్యాక దాన్ని స్వీకరించాలనుకున్నాను. నేను గాఢంగా అభిమానించే నా మార్గదర్శి బీఆర్ అంబేడ్కర్ బౌద్ధాన్ని ఎందుకనుసరించాడని పరిశీలించినపుడు బౌద్ధంలోని మతాతీత, నైతిక ధర్మబద్ధత నాకు పూర్తిగా అర్థమైంది.



అందుకే గత పదేళ్ళుగా బౌద్ధం స్వీకరించాలని సీరియస్‌గా ఆలోచిస్తున్నాను. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఉద్యోగాలు... ఇలా రకరకాల కారణాలు నాకు నేను చెప్పుకుంటూ వాయిదా వేస్తూ వస్తున్నాను. కుటుంబ ఆమోదం లేకపోవడమూ ఈ ఆలస్యానికి ఒక కారణం. ఇక ఈ బంధాలను అధిగమించి డెబ్బయ్యేళ్లు దాటిన ఈ తరుణంలోనైనా బౌద్ధం స్వీకరించి తీరాలని నిర్ణయించుకున్నాను. కుటుంబంతో ఉంటూనే, భవిష్యత్తులో పూర్తిస్థాయిలో బౌద్ధ భిక్షువుగా మారాలన్నది నా సంకల్పం. చిన్నదైన జీవితాన్ని సుఖమయంగా దుఃఖ రహితంగా గడపడానికి మార్గాలు బౌద్ధంలో ఉన్నాయి. అష్టాంగ మార్గాలు, చతురార్య సూత్రాలు పాటించి నైతిక జీవనంతో ధర్మ వర్తనాన్ని అనుసరించితే దుఃఖం దూరమవుతుందని బుద్ధుడు చెప్పాడు. అందుకే నేను బౌద్ధం స్వీకరించాలని అనుకుంటున్నాను. నేను అంబేడ్కర్ మహాశయుడి అనుయాయిని మాత్రమే. కానీ ఆతడు చెప్పిన 'పేదరికంలో పుట్టడం మన తప్పు కాదు. కానీ పేదరికంలో మరణించకూడదు' అన్న మాటలను మాత్రం పట్టించుకోలేదు. ఇవి పేదరికంలో మగ్గుతున్న అణగారిన జాతులకు ఆత్మవిశ్వాసాన్నిచ్చే మాటలు. కానీ నేనెందుకీ మాటలు పట్టించుకోలేదో ఇప్పటికీ అర్థం కాదు. ఆ మాటలు వృద్ధాప్యంలోకి ప్రవేశించేంతవరకు దృష్టిలోకి రాకపోవడం ఒక కారణం కావచ్చు. అంబేడ్కర్ మాట పెడచెవిన పెట్టి కొన్నికష్టాలను అనుభవిస్తున్న మాట వాస్తవమే కాని నాకీ విషయంపై రిగ్రెట్స్ ఏమీ లేవు.

కానీ ఆయన మరో రెండు మాటలను మాత్రం పెడచెవిన పెట్టను. తు.చ. తప్పకుండా పాటిస్తాను. అందులో ఒకటి 'నేను మతంతో పుట్టానేమో కాని మతంతో చావను' అనేది. నేను ఏ మతస్థుడిగానూ చావను గాక చావను. అందుకే బౌద్ధధర్మాన్ని ఆశ్రయిస్తున్నాను. అంబేడ్కర్ చెప్పిన మరో మాట 'పే బ్యాక్ టు సొసైటీ'ని నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ పాటిస్తున్నాను. ఇక ముందూ పాటిస్తాను.

ఈ సంసార బంధాల్లో, ఈ భావవాద మత సంబంధిత జీవనవిధానంలో నేను నేనుగా ఉండలేకపోతున్నాను. ఇలాగే ఉంటే నేను నేనుగా చావడం కూడా సాధ్యం కాదు. పెదవులు దాటని ఏడ్పులు, పైపై నటనలు, చచ్చినాక ఆర్భాటాల విందులు, ఏడ్పులు లాంటివెన్నో చూశాను. ఇవన్నీ నాకు నచ్చవు. అందుకే శేషజీవితం బౌద్ధుడిగా జీవించి అలాగే మరణించదలుచుకున్నాను.

కుటుంబ పాశాలను డెబ్బై ఏళ్ళు దాటినా అధిగమించలేని పరిస్థితి నుంచి ఇకనైనా బయటపడాలి. బుద్ధుడు పొందినట్టు సంపూర్ణ మానసిక పరిపక్వ స్థితి పొందడం నాలాంటివాడికి సాధ్యం కాకున్నా బౌద్ధాన్ని స్వీకరించడం వల్ల మిగిలి ఉన్న కొద్దిపాటి మనో క్లేశాలనూ, మనో దౌర్భాగ్యాలనూ, జిహ్వ చాపల్యాన్నీ వదులుకోవచ్చన్నది నా నిశ్చితాభిప్రాయం. మనసునూ, భౌతిక కార్యకలాపాలను మరింత సామాజిక పరం చేయడానికి బుద్ధం, సంఘం, ధర్మాలు మాత్రమే శరణ్యం!

వ్యాసకర్త కథారచయిత । 91829 18567

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.9.20 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** అశ్వని ఉ.7.20 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.4.53 నుండి 6.29 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.38 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.46 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.37.

సుప్రీం తీర్పు బహుజనుల విజయం


962వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాజధానిలో పేదల ఇళ్ల స్థలాల పంపిణీపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు బహుజనుల సంపూర్ణ విజయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 962వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. సుప్రీంకోర్టులో రాజధానిలోని ఆర్‌–5 జోన్‌లో పేదల ఇళ్ల స్థలాలకు అనుకూలంగా తీర్పు వచ్చిన నేపథ్యంలో బహుజన పరిరక్షణ సమితి దీక్షా శిబిరం వద్ద సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పేదలు ఈ ప్రాంతంలో నివసిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందంటూ తప్పుడు కేసులు వేసిన కులవాదులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. సిట్, సీఐడీ దర్యాప్తులో రాజధాని పేరిట జరిగిన అవినీతి వ్యవహారంలో బాబు ఆయన కుమారుడు లోకేశ్‌ను అరెస్టు చేయడం తప్పదన్నారు. బాబు అండతో ఎల్లో మీడియా, రామోజీ చేసిన దోపిడీ అంతా ఇంతా కాదని, చిట్‌ఫండ్‌ నిబంధనలకు విరుద్ధంగా మార్గదర్శిలో జరిగిన స్కామ్‌లో రామోజీని జైలుకు పంపించాలని డిమాండ్‌ చేశారు.నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్‌వో

- పట్టాదారు పాసు పుస్తకాలకు రూ.1.5 లక్షల డిమాండ్‌
- రూ.45 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం



పట్టుబడిన వీఆర్వో వెంకటేష్‌

సాక్షి, అమరావతి/కుప్పంరూరల్‌ (చిత్తూరు జిల్లా): పట్టాదారు పాసు పుస్తకం కోసం రూ.1.5 లక్షల లంచం డిమాండ్‌ చేసి, రూ.45 వేలు తీసుకుంటూ ఓ వీఆర్వో బుధవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. చిత్తూరు ఏసీబీ అడిషనల్‌ ఎస్పీ దేవప్రసాద్‌ వివరాలు వెల్లడించారు. కుప్పం మండలం ఇందిరానగర్‌ గ్రామానికి చెందిన కన్నప్పన్‌కు ఐదుగురు కుమారులు. ఇటీవల కన్నప్పన్‌ తనకున్న పొలాన్ని ఐదుగురు కొడుకులకు పంచారు. ఈ భూమి పట్టాదారు పాసు పుస్తకాల కోసం గత సంవత్సరం మల్లానూరు వీఆర్వో వెంకటేష్‌ను సంప్రదించారు. ఆ భూమికి 15 పుస్తకాలు దరఖాస్తు చేయాల్సి ఉందని, పుస్తకానికి పది వేల వంతున 1.5 లక్షల రూపాయలు ఇవ్వాలని వీఆర్వో డిమాండ్‌ చేశాడు. రూ.1.5 లక్షలు ఇచ్చుకోలేని కన్నప్పన్‌ కుమారులు మిన్నకుండిపోయారు. అయితే కన్నప్పన్‌ కుమారుల్లో ఒకరైన మణి గత నెలలో పాసు పుస్తకాలు చేసి ఇవ్వాలని వీఆర్వోను సంప్రదించారు.అందుకు 50 వేల రూపాయలు ఇవ్వాలని వీఆర్వో డిమాండ్‌ చేశారు. తర్జన భర్జన తరువాత ఒక్కో పుస్తకానికి 9 వేలు వంతున బేరం కుదుర్చుకున్నారు. ఇదే విషయాన్ని కన్నప్పన్‌ కుమారుడు మణి 14400 ద్వారా ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి ఆదేశం మేరకు మణి బుధవారం మల్లానూరు సచివాలయంలో 45 వేల రూపాయలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు వీఆర్వోను పట్టుకున్నారు. ఏసీబీ సీఐలు సునీల్‌కుమార్, ఈశ్వర్, వెంకట నాయుడు, సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జూలో ఆడ జిరాఫీ మృతి



జిరాఫీ(ఫైల్‌)

ఆరిలోవ (విశాఖ తూర్పు): నగరంలోని ఇందిరాగాంధీ జూ పార్కులో 'మే' అనే పేరు గల ఆడ జిరాఫీ బుధవారం మృతి చెందింది. ఎన్‌క్లోజరులో ఒక జత జిరాఫీలు హుషారుగా తిరుగుతూ సుమారు పదేళ్ల నుంచి సందర్శకులను అలరించేవి. ఇప్పుడు వాటి జత విడిపోయింది. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈ జిరాఫీ ఆరోగ్యం విషమించి మృత్యువాతపడింది. జూ క్యూరేటర్‌ నందనీ సలారియా తెలిపిన వివరాల ప్రకారం.. 2013లో మలేషియాలో నెగ్రా జూ పార్కు నుంచి ఒక జత జిరాఫీలను ఇక్కడకు తీసుకొచ్చారు. అప్పటికి నాలుగు నెలల వయసులో ఉన్న మే అనే ఆడ జిరాఫీకి ప్రస్తుతం పదేళ్లు. ఇది మూడు నెలలుగా మెట్రైటర్స్, నిమోనియా వ్యాధులతో బాధపడుతోంది. ఇక్కడ వైద్య సిబ్బంది దానికి వైద్యం అందించారు. అయినా ఆరోగ్యం విషమించడంతో బుధవారం వేకువజామున మృతి చెందింది. మృతదేహానికి జూ వెటర్నరీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

ఉరిశిక్ష పడిన దోషుల క్షమాభిక్ష పిటిషన్‌ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలోని చిలకలూరిపేట బస్సు దహనం కేసులో ఉరిశిక్ష పడిన దోషుల పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తమకు క్షమాభిక్ష పెట్టి విడుదల చేయాలంటూ గంటల విజయవర్ధనరావు, సాతులూరి చలపతిరావు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం చీఫ్‌ జస్టిస్‌ డి.వై. చంద్రచూడ్, జస్టిస్‌ పి.ఎస్‌.నరసింహ, జస్టిస్‌ జె.బి.పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అనారోగ్య సమస్యల నేపథ్యంలో శిక్షాకాలం తగ్గించి విడుదల చే యాలని పిటిషనర్ల న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. దీనికి అంగీకరించని ధర్మాసనం పిటిషన్‌ను కొట్టేసింది. నిందితులు ఇద్దరికి గుంటూరు సెషన్స్‌ కోర్టు విధించిన మరణశిక్షను హైకోర్టు, సుప్రీంకోర్టు సమర్థించాయి.

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం

- రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ వాసిరెడ్డి పద్మ
- సీఐడీ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1091 ప్రారంభం



హెల్ప్‌లైన్‌ 1091ను ప్రారంభిస్తున్న వాసిరెడ్డి పద్మ, సీఐడీ ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి/నగరంపాలెం: రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఉద్దేశించిన హెల్ప్‌ లైన్‌ నంబర్‌ 1091ను ఆమె బుధవారం గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో ప్రారంభించారు. రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ల భద్రత, వారి గౌరవం కాపాడటం, వివక్ష నిర్మూలన కోసం సీఐడీ విభాగంలో 'స్వాభిమాన్‌ ట్రాన్స్‌ జెండర్‌ పర్సన్స్‌ ప్రొటెక్షన్‌ సెల్‌'ను ఇటీవల ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ జెండర్లు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు హెల్ప్‌లైన్‌ నంబర్‌ 1091ను ఈ విభాగం అందుబాటులోకి తెచ్చింది. ఈ కార్యక్రమంలో ఈ సెల్‌ నోడల్‌ అధికారి, ఎస్పీ(మహిళా భద్రత) కేజీవీ సరిత, సీఐడీ ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు, ట్రాన్స్‌జెండర్‌ పర్సన్స్‌ విభాగం డైరెక్టర్‌ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారుల కిడ్నాప్‌

వైజాగ్‌లో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని చిన్నారులను రక్షించిన పోలీసులు

మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన ఆటో డ్రైవర్‌

డ్రైవర్‌ సెల్‌ లొకేషన్‌ ఆధారంగా నిందితుడి కదలికలు గుర్తింపు



షేక్‌ రిజ్వానా(ఫైల్‌).



షేక్‌ ఆసియా(ఫైల్‌)

కోవెలకుంట్ల(నంద్యాల)/తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : ఇద్దరు పిల్లలను ఆటోడ్రైవర్‌ కిడ్నాప్‌ చేసి తీసుకెళుతుండగా పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. బుధవారం కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి అందించిన సమాచారం మేరకు.. పట్టణంలోని నాగులకట్ట సమీపంలో నివాసముంటున్న షేక్‌ మహమ్మద్, షమీవున్‌ దంపతులకు షేక్‌ రిజ్వానా, షేక్‌ ఆసియా సంతానం. పెద్ద కుమార్తె స్థానిక జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి, చిన్న కుమార్తె ఇదే పట్టణంలోని గాంధీ సెంటర్‌ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో పిల్లలు పట్టణంలోని సెయింట్‌ జోసఫ్స్‌ పాఠశాలలో కబడ్డీ నేర్చుకునేందుకు వెళుతున్నారు. కోవెలకుంట్లకు చెందిన ఇమాంఉసేన్‌ పిల్లలను ఆటోలో ఎక్కించుకుని రోజూ పాఠశాల వద్ద వదిలేవాడు. మంగళవారం ఉదయం పిల్లలను ఆటోలో పంపించి తల్లిదండ్రులు పనుల నిమిత్తం వెళ్లిపోయారు. అయితే అతను పిల్లలను స్కూల్‌ వద్ద దించకుండా మాయమాటలు చెప్పి ఆటోను నంద్యాల వైపు మళ్లించాడు. నంద్యాలలో దిగి పిల్లలతో సహా గుంటూరు రైలెక్కాడు. రాత్రి అయినా పిల్లలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది పట్టణంలోని పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఆటో డ్రైవర్‌ సెల్‌ఫోన్‌ లొకేషన్‌ ఆధారంగా వైజాగ్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని చిన్నారులను రక్షించారు. కోవెలకుంట్ల ఎస్‌ఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బృందాలు అక్కడకు చేరుకోగా రైల్వేపోలీసులు పిల్లలను వారికి అప్పగించారు. ఆటో డ్రైవర్‌ చిన్నారులను ఎత్తుకెళ్లి విక్రయించేందుకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. చిన్నారుల కిడ్నాప్‌ మిస్టరీని పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు.

తెల్లవారకనే తెల్లారిన బతుకులు

కూటికోసం కూలికెళుతున్న వారి బతుకులు తెల్లవారుజామునే తెల్లారి పోయాయి. సరదాగా మాట్లాడుకుంటూ వ్యవసాయ పనులకు ఆటోలో వెళుతున్న వారి మీదకు మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. ఎవరికీ ఏమీ అర్థంకాలేదు. అర్థమయ్యేసరికే శరీరాల్లోకి దూసుకెళ్లిన ఇనుప చువ్వలు.. చెల్లాచెదురుగా మృతదేహాలు. రహదారి రక్తసిక్తమైంది.

- లారీ ఆటోను ఢీకొని ఆరుగురి దుర్మరణం
- 8 మందికి గాయాలు.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం
- పల్నాడు జిల్లా పొందుగల వద్ద రహదారి రక్తసిక్తం
- మృతులంతా తెలంగాణకు చెందిన వారే



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో



మాలోతు కవిత



ఇస్లావత్‌ మంజుల



భూక్యా పద్మ



భూక్యా సోనీ



వర్తియా సక్రీ



ఇస్లావత్‌ పార్వతి

దాచేపల్లి: పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళుతున్న ఆటోను ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు దుర్మరణం పాలయ్యారు. ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం నరసాపురానికి చెందిన 13 మంది వ్యవసాయ కూలీలు మిర్చి పనుల నిమిత్తం ఆటోలో పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడుకు వస్తున్నారు. ఏపీ సరిహద్దు గ్రామమైన పొందుగల పాత పంచాయతీ కార్యాలయం వద్దకు ఉదయం 4.45 గంటలకు ఆటో చేరుకుంది. పిడుగురాళ్ల వైపు నుంచి హైదరాబాద్‌ వెళుతున్న తమిళనాడుకు చెందిన లారీ.. అక్కడ ఆగి ఉన్న ధాన్యం లారీని క్రాస్‌ చేస్తూ అతివేగంగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఆటోలో ఉన్న వ్యవసాయ కూలీలు మాలోతు కవిత (45), ఇస్లావత్‌ మంజుల (30), భూక్యా పద్మ (26), భూక్యా సోనీ(58), వర్తియా సక్రీ (35) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన ఇస్లావత్‌ పార్వతి (45) మిర్యాలగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆటో డ్రైవర్‌ మాలవత్‌ వాగ్యానాయక్, కూలీలు మాలవత్‌ దేవి, మాలవత్‌ సునీత, మాలవత్‌ భారతి, మాలవత్‌ అంబాలి, మాలవత్‌ పద్మ, మాలవత్‌ లాలి మిర్యాలగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా ఇస్లావత్‌ పార్థును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌ తరలించారు. వీరిలో మాలవత్‌ వాగ్యానాయక్, ఇస్లావత్‌ పార్థు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కావటంతో మృతుల శరీరాల్లోకి ఇనుప రాడ్లు, చువ్వలు దూసుకెళ్లాయి. ప్రమాదం జరిగిన వెంటనే చుట్టుపక్కల ఇళ్లల్లో ఉన్నవారు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. ఆటోలో ఇరుక్కుపోయిన సోనీ మృతదేహాన్ని అతికష్టం మీద బయటకు తీశారు. ప్రమాదస్థలాన్ని గురజాల డీఎస్పీ పల్లపు రాజు, సీఐ షేక్‌ బిలాలుద్దీన్‌ పరిశీలించారు. మృతదేహాలకు గురజాల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన లారీని తెలంగాణలోని నిజామాబాద్‌ వద్ద పోలీసులు పట్టుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

కమనీయం గంగమ్మ విశ్వరూప దర్శనం

- ఆలయంలో కిక్కిరిసిన భక్తులు
- ముగిసిన తిరుపతి గంగమ్మ జాతర మహోత్సవం



గంగమ్మ విశ్వరూప దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులు

తిరుపతి కల్చరల్‌: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జాతర చివరి రోజైన మంగళవారం అర్ధరాత్రి తర్వాత ప్రత్యేకంగా కొలువుతీరిన గంగమ్మ విశ్వరూప దర్శనంతో భక్తజనం పులకించారు. రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన చాటింపుతో ఆరంభమైన తిరుపతి గంగమ్మ జాతర ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో వారం రోజుల పాటు అంగరంగవైభవంగా సాగింది. జాతర చివరి రోజు గంగమ్మ విశ్వరూపాన్ని దర్శించుకునేందుకు తిరుపతితో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాది మంది తరలివచ్చారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అమ్మవారి విశ్వరూపాన్ని దర్శించుకున్నారు. రాత్రి పేరంటాల వేషధారుడు కైకాల కులస్థుడు నగర పురవీధుల్లో విహరిస్తూ భక్తుల పూజలందుకున్నారు. బుధవారం వేకువజామున 2.56 గంటలకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని చేరుకొని సంప్రదాయంలో భాగంగా గంగమ్మ విశ్వరూప ప్రతిమ చెంప నరకడంతో జాతర సమాప్తమైంది. అమ్మవారి విశ్వరూప అంతిమ ఘట్టాన్ని చూసేందుకు భక్తులు పోటెత్తారు. గంగమ్మ విశ్వరూప ప్రతిమ బంకమట్టి కోసం ఎగబడ్డారు. అనంతరం పేరంటాలు శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయానికి చేరుకొని అక్కడ కొలువైన పెద్ద గంగమ్మ విశ్వరూప ప్రతిమ చెంప నరకడంతో జాతర ఘట్టం దిగ్విజయంగా ముగిసింది.

- పాముకాటుకు గురై స్నేక్‌ క్యాచర్‌ మృతి చెందిన ఘటన నెల్లూరులో జరిగింది. నగరంలోని బీవీ నగర్‌కు చెందిన పి.పౌరుష్‌రెడ్డి (31) స్నేక్‌ క్యాచర్‌. ఈ నెల 16న వేదాయపాలెం జనశక్తినగర్‌లో పామును పట్టుకుని ప్రజలకు చూపిస్తుండగా అది పౌరుష్‌రెడ్డి చూపుడు వేలిపై కాటేసింది.

పారాయణాలతో ధార్మిక విలువల ఇనుమడింపు

కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మహాస్వామి



సందేశమిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మహాస్వామి

తిరుమల: రామాయణం, మహాభారతం లాంటి ఇతిహాసాల పారాయణం వల్ల సమాజంలో ధార్మిక విలువలు పెంపొందుతాయని, ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు చేపడుతున్న టీటీడీని అభినందిస్తున్నానని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఉద్ఘాటించారు. తిరుమల నాదనీరాజనం వేదికపై అయోధ్య కాండ పారాయణం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి మహాస్వామి మాట్లాడుతూ ఇతిహాసాలు మానవ జాతి ధర్మబద్ధమైన జీవితం గడపడానికి శాశ్వత మార్గదర్శకాలన్నారు. కోవిడ్‌ మహమ్మారి నుంచి మానవాళిని రక్షించాలని శ్రీవారిని ప్రార్థిస్తూ పారాయణ యజ్ఞం ప్రారంభించి మూడేళ్లుగా టీటీడీ విజయవంతంగా నిర్వహిస్తోందని కొనియాడారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ సుందరకాండ, బాలకాండను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత నాలుగు వేలకుపైగా శ్లోకాలు గల అయోధ్యకాండను ప్రారంభించామన్నారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి రాణి సదాశివమూర్తి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు కుప్పా విశ్వనాథ శర్మ, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్‌ కేఎస్‌ఎస్‌.అవధాని తదితరులు మాట్లాడారు.

'ప్రశస్త్త'తో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

- 'నిరామయ హెల్త్‌ ఇన్సూ్యరెన్స్‌' పాలసీతో మేలు
- సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దాదాపు 92 వేలమంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పాఠశాలల్లో నమోదయ్యారని, సర్వేచేస్తే ఆ సంఖ్య మరో 2 లక్షలకు చేరవచ్చని సమగ్రశిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు (ఎస్పీడీ) బి.శ్రీనివాసరావు చెప్పారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన 'ప్రశస్త్త' యాప్‌పై బుధవారం విజయవాడలో అవగాహన సదస్సు నిర్వహించారు. 26 జిల్లాల ఇన్‌క్లూజివ్‌ ఎడ్యుకేషన్‌ (ఐఈ) కో–ఆర్డినేటర్లు, జిల్లాకు ఒకరు చొప్పున స్పెషల్‌ ఎడ్యుకేటర్‌ (స్కూల్‌ అసిస్టెంట్‌) పాల్గొన్న ఈ సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు 21 వైకల్యాలను ప్రస్తావిస్తూ 'ప్రశస్త్త' యాప్‌ రూపొందించారని చెప్పారు. 'పార్ట్‌–ఎ'లో తరగతి ఉపాధ్యాయులు 63 ప్రశ్నల ద్వారా విద్యార్థుల ప్రవర్తన ఆధారంగా గుర్తించాలని, 'పార్ట్‌–బి'లో మరిన్ని భిన్న ప్రవర్తనలు గల విద్యార్థులను స్పెషల్‌ ఎడ్యుకేటర్లు గుర్తించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకుని సర్వే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేటప్పుడు పిల్లల మనోభావాలు దెబ్బతినకుండా శ్రద్ధచూపాలని కోరారు. మేధోపరమైన వైకల్యం, సెరిబ్రల్‌ పాల్సీ, ఆటిజం, మల్టిపుల్‌ డిజేబుల్‌ వైకల్యాలు గల పిల్లలకు 'నిరామయ హెల్త్‌ ఇన్సూ్యరెన్స్‌' పాలసీని కేంద్రప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని వివరించారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారు అర్హులని, జిల్లాల్లోని సమగ్రశిక్ష కార్యాలయాల్లో, మండలాల్లోని భవిత కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు విషయంలో సత్యసాయి, విజయనగరం, ఎన్టీఆర్‌ జిల్లాలు ముందంజలో ఉన్నాయని చెప్పారు. మిగతా జిల్లాల్లో కూడా త్వరితగతిన గుర్తించాలని ఆయన ఆదేశించారు. సహిత విద్య ఏడీ ఎస్‌.కె.అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను నిర్ధారించడంలో ఉపాధ్యాయులు కీలక బాధ్యత వహించాలని చెప్పారు.



మయన్మార్‌ బృందం బౌద్ధారామాల సందర్శన



బావి కొండను సందర్శించిన బృందం

కొమ్మాది (భీమిలి): ప్రపంచ వ్యాప్తంగా బుద్ధిజం ఏ విధంగా వ్యాప్తి చెందిందనే విషయాలను తెలుసుకునేందుకు మయన్మార్‌ మత వ్యవహారాలు, సాంస్కృతిక మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి బృందం పలు బౌద్ధారామాలను బుధవారం సందర్శించింది. విశాఖ బీచ్‌ రోడ్డు తిమ్మాపురంలోని బావి కొండ, మంగమారిపేటలో గల తొట్లకొండ, భీమిలిలోని పావురాల కొండను డిప్యూటీ డైరెక్టర్‌ జనరల్‌ న్యోమైంట్‌టున్, డైరెక్టర్‌ క్యామ్‌మియో, అసిస్టెంట్‌ డైరెక్టర్‌ మాస్‌థిట్‌నైన్, టున్‌టున్‌ఎయ్, ఫియోఫ్యాకెకో, మే మైట్‌నోకో పర్యటించారు. బుద్ధుని మూలాలను, నాటి జీవన విధానాలను తెలుసుకున్నారు. తొట్లకొండ పైనుంచి కనిపించే సీ వ్యూను చూసి మంత్రముగ్ధులయ్యారు. పురావస్తుశాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వెంకట్రావు, జిల్లా టూరిజం అధికారి గరికిన దాసు పాల్గొన్నారు.

ఆ మాటలేమయ్యాయి బాబూ!

- విభిన్న ప్రతిభావంతురాలికి ట్రైసైకిల్, రూ.లక్ష ఇస్తానన్న చంద్రబాబు
- రెండూ ఇవ్వకుండా ముఖం చాటేసిన వైనం
- మరో విద్యార్థిని చదువులకు సాయం చేస్తానని హామీ
- చంద్రబాబు తీరుపై దుమ్మెత్తిపోస్తున్న కంటెపూడి ఎస్సీ కాలనీ ప్రజలు



నేలటూరి నాగలక్ష్మి



తల్లిదండ్రులతో లావణ్య

సత్తెనపల్లి: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు ఓ విభిన్న ప్రతిభావంతురాలు ఇంటికి వెళ్లి మరీ ఇచ్చిన హామీని గాలికొదిలేశారు. ఆమె ఆశలను ఆవిరి చేశారు. ఏప్రిల్‌ 26న పల్నాడు జిల్లా సత్తెనపల్లి వచ్చిన చంద్రబాబు.. 27వ తేదీ సాయంత్రం గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గంలోని గుండ్లపాలెం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అక్కడ జనం లేరని తెలియడంతో సత్తెనపల్లి మండలం కంటెపూడి ఎస్సీ కాలనీలో మహిళల వద్ద కాన్వాయ్‌ ఆపి కాలనీలో ఉంటున్న విభిన్న ప్రతిభావంతురాలు నేలటూరి నాగలక్ష్మి వద్దకు వెళ్లారు. ఆమెను పలకరించి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీయగా.. తనకు వికలాంగుల పింఛన్, తల్లి మస్తానమ్మకు ఒంటరి మహిళల పింఛన్‌ ఇలా.. అన్ని పథకాలు వస్తున్నాయని చెప్పింది. తనకు మూడు చక్రాల సైకిల్‌ లేదని చెప్పగా.. టీడీపీ తరఫున ట్రై సైకిల్‌తోపాటు రూ.లక్ష నగదు ఇస్తానని చంద్రబాబు ఆమెకు హామీ ఇచ్చారు. అదివిన్న నాగలక్ష్మి పొంగిపోయింది. 23 రోజులు గడిచినా ఇంత వరకు సాయం, ట్రైసైకిల్‌ అతీగతీ లేదు.

మరో విద్యార్థిని పరిస్థితి కూడా ఇంతే..

ఇదే పర్యటనలో కంటెపూడికి చెందిన తాపీమేస్త్రి పుల్లారావు, రాజ్యలక్ష్మి రెండో కుమార్తె లావణ్యతో చంద్రబాబు మాట్లాడారు. ఎంతవరకు చదువుకున్నావని అడగ్గా.. పదో తరగతి పూర్తయిందని, పేదరికం కారణంగా ఉన్నత చదువులకు వెళ్లలేకపోయానని లావణ్య చెప్పింది. ఉన్నత చదువులకు అయ్యే ఖర్చు మొత్తం తాను భరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రెండు రోజుల తరువాత ఆ బాలికను టీడీపీ కార్యాలయానికి రావాలని స్థానిక నేతలు కబురు పంపారు. ఆమె తండ్రి పుల్లారావుకు ఫోన్‌ చేసి.. 'మీరు టీడీపీ కండువా కప్పుకోవాలి. పార్టీ కోసం మావైపు తిరగాలి. అప్పుడే చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరుస్తాం' అని స్థానిక నాయకులు చెప్పడంతో అవాక్కయ్యాడు. తాను ఏ పార్టీ కండువా కప్పుకోలేనని తేల్చి చెప్పాడు పుల్లారావు. దీంతో స్థానిక నాయకులు వారిద్దరినీ గాలికొదిలేశారు. ఈ విషయాలు తెలిసిన స్థానిక ఎస్సీ కాలనీ ప్రజలు 'చంద్రబాబు మారరు. టీడీపీ నేతల్లో మార్పు రాదు' అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు.

విజిట్‌ వీసాల దందా

ఫోర్జరీ పత్రాలతో అమెరికా, ఇజ్రాయిల్, యూకేలకు ప్రయాణాలు

- స్పాన్సర్‌ షిప్‌ లెటర్, ఉద్యోగ గుర్తింపు కార్డు, బ్యాంకు బ్యాలెన్స్‌ అన్నీ నకిలీవే..
- విదేశాలకు రవాణా చేస్తున్న ఓ ఇమిగ్రేషన్‌ కన్సల్టెన్సీ గుట్టు రట్టు
- నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు

సాక్షి, హైదరాబాద్‌: అమెరికా, యూకే, ఇజ్రాయిల్‌.. ఈ దేశాలను సందర్శించేందుకు వెళ్లాలంటే ఏం చేయాలి? ముందుగా విజిట్‌ వీసాల కోసం స్పాన్సర్‌ షిప్‌ లెటర్, ఉద్యోగ గుర్తింపు కార్డు, బ్యాంకు బ్యాలెన్స్‌ అన్నీ పక్కాగా ఉండాలి. కానీ.. ఇవేవీ లేకుండా అన్నీ ఉన్నట్టు ఫోర్జరీ పత్రాలు సృష్టించిన ఓ నకిలీ ఇమిగ్రేషన్‌ కన్సల్టెన్సీ ముఠా గుట్టును రాచకొండ పోలీసులు రట్టు చేశారు. బుధవారం మల్కాజిగిరి డీసీపీ జానకి స్పెషల్‌ ఆపరేషన్‌ టీం (ఎస్‌ఓటీ) ఎల్బీనగర్‌ డీసీపీ కె.మురళీధర్‌తో కలిసి వివరాలను వెల్లడించారు.

స్పాన్సర్‌షిప్‌ లెటర్లను సృష్టించి..

- విదేశాల్లో ఉండే ప్రవాస భారతీయులు ఎవరినైనా తమ వద్దకు రప్పించుకోవాలంటే స్పాన్సర్‌షిప్‌ లెటర్‌ను అందించాల్సి ఉంటుంది. ఫలానా వ్యక్తి తన కుటుంబ సభ్యులు, బంధువులు అని, వారి విదేశీ పర్యటన ఖర్చులను తానే భరిస్తానని, ఇందుకు అవసరమైన విజిటింగ్‌ వీసాను అందించాలని సంబంధిత లేఖ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెటర్, పాస్‌పోర్టులతో సంబంధిత అభ్యర్థి వీసా ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంటుంది. అయితే నకిలీ స్పాన్సర్‌షిప్‌ లెటర్లు సృష్టించడంలో సిద్ధహస్తుడైన గార్లపాటి వెంకటదుర్గా నాగేశ్వర సిద్ధార్థ అలియాస్‌ విల్సన్‌ చౌదరి సికింద్రాబాద్‌లో సెయింట్‌ ఆంథోని ఇమిగ్రేషన్‌ కన్సల్టెన్సీ కేంద్రంగా ఈ దందాకు తెరలేపాడు.
- నకిలీ స్పాన్సర్‌షిప్‌ లెటర్, వీసా ప్రాసెస్‌ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలు వసూలు చేసేవాడు. ఇక విదేశాలకు వెళ్లే వ్యక్తి తన బ్యాంకు ఖాతాలో బ్యాలెన్స్‌ను చూపించాల్సి ఉంటుంది. ఇందుకోసం విల్సన్‌ బోడుప్పల్‌కు చెందిన రుణదాత గౌతుకుల నాగరాజును పరిచయం చేసేవాడు. సదరు నాగరాజు నేరేడ్‌మెట్‌ క్రాస్‌ రోడ్‌లోని జాగృతి కో–ఆపరేటివ్‌ యూనియన్‌ బ్యాంక్‌లో ముందుగా అభ్యర్థికి అకౌంట్‌ తెరిపిస్తారు. వీసా ఇంటర్వ్యూ జరిగే రోజు అభ్యర్థి బ్యాంకు ఖాతాలో రూ.40–50 లక్షలు జమ చేస్తారు. ఇంటర్వ్యూ పూర్తయిన మరుసటి రోజే తిరిగి ఆ సొమ్మును సొంత ఖాతాలకు బదిలీ చేసుకుంటారు. అకౌంట్‌లో బ్యాలెన్స్‌ ఉంచినందుకు రోజుకు 1.5 శాతం వడ్డీ వసూలు చేసేవారు.

ఇలా బయటపడింది..

- ప్రభుత్వ ఉద్యోగి అయితే విదేశాలకు వెళ్లినా 6 నెలల్లోపు కచ్చితంగా తిరిగి వస్తాడనే నమ్మకం అధికారికి కలుగుతుందనేది నిందితుల ఎత్తుగడ. అందుకే ఇంటర్వ్యూ చేసే అధికారికి నమ్మకం కుదిరేందుకు నిందితులు జీహెచ్‌ఎంసీ, రెవిన్యూ, ఆరోగ్య, విద్య, నీటిపారుదల శాఖ వంటి 16 రాష్ట్ర ప్రభుత్వ విభాగాల నకిలీ ఉద్యోగ గుర్తింపు కార్డులను కూడా సృష్టించేవారు. నకిలీ స్పాన్సర్‌షిప్‌ లెటర్‌తో పాటు ఈ ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డులతో అభ్యర్థి వీసా ఇంటర్వ్యూకు హాజరవుతారు. ఈ క్రమంలో నిజామాబాద్‌కు చెందిన జక్కుల నాగేశ్వరరావు యూఎస్‌కు వెళ్లాలని నిర్ణయించుకొని విల్సన్‌ను సంప్రదించాడు. దీంతో అతను నాగేశ్వరరావు పేరు మీద నీటిపారుదల శాఖలో అకౌంట్‌ ఆఫీసర్‌గా నకిలీ గుర్తింపు కార్డు, నకిలీ స్పాన్సర్‌షిప్‌ లెటర్‌ను సృష్టించారు. వీటి సహాయంతో వీసా ఇంటర్వ్యూకు హాజరయ్యాడు.
- నాగేశ్వరరావు ఆహార్యం, భాష గమనించిన ఇమిగ్రేషన్‌ అధికారి ఇంటర్వ్యూలో ఫెయిల్‌ చేశాడు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్బీనగర్‌ ఎస్‌ఓటీ, నేరేడ్‌మెట్‌ పోలీసులు నాగేశ్వరరావు, విల్సన్‌ చౌదరి, నాగరాజుతో పాటు విల్సన్‌ చౌదరి వద్ద కమీషన్‌ ఏజెంట్‌గా పని చేస్తున్న ప్రభాకర్‌ను అరెస్టు చేశారు. వీరి బ్యాంకు ఖాతాల్లోని రూ.7 లక్షల నగదుతో పాటు 16 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు చెందిన గుర్తింపు కార్డులు, అయిదు పాస్‌పోర్టులు, 279 చెక్‌ బుక్‌లు, నకిలీ ఇన్విటేషన్‌ లెటర్లు, కంప్యూటర్, ల్యాప్‌టాప్, నాలుగు సెల్‌ఫోన్లు ఇతరత్రా సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా గత ఆరేళ్లుగా దందా సాగిస్తోందని పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు 250కి పైగా నకిలీ స్పాన్సర్‌షిప్‌ లెటర్లు సృష్టించారని, వీరిలో 50 నుంచి 60 మంది వరకు వీసా ఇంటర్వ్యూలకు హాజరైనట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

క్లుప్తంగా

ఖరీఫ్‌లో ఎరువుల రాయితీ రూ.1.08 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: 2023–24 ఖరీఫ్ (ఏప్రిల్–సెప్టెంబర్) సీజన్‌లో ఎరువులపై రూ.1.08 లక్షల కోట్ల రాయితీ ఇచ్చేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదముద్ర వేసింది. రిటైల్ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరగకుండా, అన్నదాతలపై ఆర్థిక భారం పడకుండా ఈ రాయితీ తోడ్పడుతుందని తెలియజేసింది. యూరియాపై రూ.70,000 కోట్లు, డీఏపీ, ఇతర ఎరువులపై రూ.38,000 కోట్ల సబ్సిడీ ఇవ్వనున్నట్లు కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వివరించారు. ఎరువుల గరిష్ట అమ్మకం ధర(ఎంఆర్‌పీ)లో మార్పేమీ ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఒక్కో సంచి యూరియా రూ.276, డీఏపీ రూ.1,350 ధర పలుకుతోంది.

సీసీఐ, ఈసీఏ ఒప్పందానికి ఓకే

కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), ఈజిప్షియన్ కాంపిటీషన్ అథారిటీ(ఈసీఏ); ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ), చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ద మాల్దీవ్స్ (సీఏ మాల్దీవ్స్) మధ్య అవగాహన ఒప్పందాలను కేబినెట్ ఆమోదించింది.

పాక్ డ్రోన్లలో 15 కిలోల డ్రగ్స్

జలంధర్: పాకిస్తాన్ సరిహద్దు వెంట భారత గగనతలంలోకి డ్రోన్ల ద్వారా వచ్చిన 15 కిలోలకు పైగా మాదకద్రవ్యాలను సైన్యం స్వాధీనం చేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటాక పంజాబ్‌లో అమృత్‌సర్ పరిధిలోని రామ్‌కోట్ గ్రామం వద్ద ఓ డ్రోన్ కిలోలకొద్దీ డ్రగ్స్ తెచ్చి పడేసింది. సైనికులు కాల్పులు జరపడంతో వెనక్కి వెళ్లిపోయింది. డ్రగ్స్ మూటలను పట్టుకెళ్లేందుకు వచ్చిన వారిపైకీ సైనికులు కాల్పులు జరిపారు. వారు పారిపోతూ కొన్ని ప్యాకెట్లు పడేసుకున్నారు. కఖర్ గ్రామంలోనూ ఒక డ్రోన్ సరిహద్దు దాటి వచ్చి డ్రగ్స్ ప్యాకెట్లను పడేసి వెళ్లింది.

ఇమ్రాన్ ఖాన్‌ను 31 దాకా అరెస్టు చేయొద్దు: హైకోర్టు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్(70)ను దేశంలో నమోదైన ఏ కేసులోనూ అరెస్టు చేయకుండా నిర్దేశించిన గడువును ఇస్లామాబాద్ హైకోర్టు ఈ నెల 31వ తేదీ దాకా పొడిగించింది. పాకిస్తాన్ ప్రభుత్వం తనను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ ఇమ్రాన్ ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మియాంగుల్ హసన్ ఔరంగజేబ్ బుధవారం విచారణ చేపట్టారు. ఇమ్రాన్‌ను పోలీసులు అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని ఆయన తరఫు న్యాయవాది కోరారు. ఇమ్రాన్ అరెస్టును నియంత్రిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వు గడువు పెంచాలన్నారు.



బుధవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీతో భేటీ అయిన సిద్ధరామయ్య



రాహుల్‌గాంధీని కలిసిన కర్ణాటక పీసీసీ చీఫ్ శివకుమార్

కొనసాగుతున్న కర్నాటకం

పట్టు వీడని సిద్ధూ, డీకే • తలపట్టుకుంటున్న అధిష్టానం • సిద్ధూను ఖరారు చేస్తూ తొలుత నిర్ణయం!

- మధ్యాహ్నం ఖర్గే-డీకే భేటీతో మారిన సీను
- మొదలైన ప్రమాణస్వీకార ఏర్పాట్లు బంద్
- రెండు మూడు రోజుల్లో నిర్ణయం: సుర్జేవాలా

న్యూఢిల్లీ: కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపిక వ్యవహారం కాంగ్రెస్ అధిష్టానానికి చుక్కలు చూపుతోంది. మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ ఎవరి పట్టు మీద వారే ఉండటంతో పీటముడి మరింత బిగుసుకుంటోంది. ఈ విషయమై హస్తినలో సోమ, మంగళవారాల్లో అధిష్టానం చర్చోపచర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. దాంతో బుధవారం నిర్ణయం తీసుకుంటామని ప్రకటించడం తెలిసిందే. కానీ ఇద్దరు నేతల్లో ఎవరూ వెనక్కు తగ్గేందుకు సిద్ధంగా లేకపోవడంతో చివరికి అధిష్టానం ఏమీ తేల్చలేకపోయింది. నిర్ణయానికి మరో రెండు మూడు రోజులు పట్టవచ్చని కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా మీడియాకు చెప్పారు. ఆలోపు కాంగ్రెస్ నేతలెవరూ దీనిపై తప్పుడు ప్రకటనలు చేయొద్దని ఆదేశించారు. లేదంటే క్రమశిక్షరాహిత్యంగా పరిగణించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ చేతిలో ఓటమిని జీర్ణించుకోలేని బీజేపీ సీఎం ఎంపికపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సీఎంను కూడా ఎన్నుకోలేకపోతున్నారన్న విమర్శలను తిప్పికొట్టారు. అస్సాం వంటి రాష్ట్రాల్లో సీఎం ఎంపికకు బీజేపీ ఎన్ని రోజులు తీసుకుందో అందరికీ తెలుసన్నారు. ఎవరిని సీఎం చేయాలో కూడా తేల్చుకోలేని అయోమయంలో కాంగ్రెస్ పెద్దలున్నారంటూ కర్ణాటక తాజా మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, ఇతర బీజేపీ నేతలు అంతకుముందు చురకలు వేశారు.

రోజంతా చర్చలే చర్చలు

బుధవారం ఉదయం రాహుల్‌గాంధీ తొలుత సిద్ధరామయ్య, తర్వాత డీకేతో సమావేశమయ్యారు. 10, జన్‌పథ్ నివాసంలో వారితో చెరో అర గంటకు పైగా చర్చలు జరిపారు. తర్వాత సిద్ధరామయ్యనే సీఎం చేయాలని అధిష్టానం నిర్ణయించినట్టు చెబుతున్నారు. ఈ మేరకు లేఖ కూడా సిద్ధమైనట్టు సమాచారం. బెంగళూరు కంఠీరవ స్టేడియంలో గురువారం మధ్యాహ్నం సిద్ధరామయ్య ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. సిద్ధరామయ్యే సీఎం అంటూ చానళ్లలో వార్తలు రావడంతో ఆయన సొంతూళ్లో, బెంగళూరులోని నివాసం వద్ద సంబరాలు మొదలయ్యాయి. దాంతో భగ్గుమన్న డీకే సరాసరి వెళ్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. అనంతరం బెంగళూరులో ప్రమాణోత్సవ ఏర్పాట్లు నిలిచిపోయాయి. నిర్ణయానికి మరో రెండు మూడు రోజులు పట్టొచ్చన్న ప్రకటన వెలువడింది. తర్వాత ప్రతిష్టంభనకు తెర దించే ప్రయత్నాలను అధిష్టానం ముమ్మరం చేసింది. వాటిలో భాగంగా ఆదివారం నాటి కర్ణాటక సీఎల్పీ భేటీకి అధిష్టానం పరిశీలకునిగా వెళ్లిన సుశీల్‌కుమార్ షిండేతో ఖర్గే తన నివాసంలో భేటీ అయ్యారు.

బుధవారం హస్తినలో చోటుచేసుకున్న కర్ణాటక రాజకీయ పరిణామాలు...

- ఉదయం 8.46: సీఎం రేసులో ముందున్న సిద్ధరామయ్య
- 11.30: సిద్ధరామయ్యతో రాహుల్ భేటీ
- మధ్యాహ్నం 12.20: డీకే శివకుమార్‌తో రాహుల్ సమావేశం
- 1.27: బెంగళూరు కంఠీరవ స్టేడియంలో ప్రమాణస్వీకార ఏర్పాట్లు షురూ
- 1.54: సిద్ధరామయ్యను సీఎంగా పేర్కొంటూ లేఖ ప్రతి కూడా సిద్ధం
- 2.14: కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో శివకుమార్ భేటీ
- 4.16: షేరింగ్ ఫార్ములాకు, డిప్యూటీ సీఎం పదవికి డీకే ససేమిరా
- సాయంత్రం 4.30: బెంగళూరులో నిలిచిపోయిన ప్రమాణస్వీకార ఏర్పాట్లు
- 5.25: ఎమ్మెల్యేలు, మద్దతుదారులతో ఢిల్లీలోని సోదరుడు సురేశ్ నివాసంలో డీకే మంతనాలు

• కర్ణాటక సీఎం పంచాయితీ... ఎందుకిలా..?

ఎస్.రాజమహేంద్రారెడ్డి

ఏ రాజకీయ పార్టీకైనా ఎన్నికల్లో గెలవడమే అతిపెద్ద సవాల్. ది గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌కు మాత్రం ఎన్నికల్లో నెగ్గడం దైవాధీనం, నెగ్గాక ముఖ్యమంత్రిని ఎంపిక చేయడమే అతిపెద్ద సవాల్. ప్రస్తుత కర్ణాటక సంక్షోభమే ఇందుకు ఉదాహరణ. ఐదేళ్ల పాలించిన బీజేపీని కాదని, కింగ్‌మేకర్ అనుకున్న జేడీ(ఎస్)కు అవకాశం లేకుండా చేసి, కర్ణాటక ఓటర్లు అందించిన ఘన విజయాన్ని సగర్వంగా భుజాలకెత్తుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఎంపికలో తడబాటుకు గురవుతోంది. ఎన్నో చేదు అనుభవాలు, మరెన్నో గుణపాఠాల నుంచి నేర్చుకున్నది ఏమీ లేదని ఆ పార్టీ మరోసారి రుజువు చేసింది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం నుంచి శాసనసభాపక్ష నాయకుడు సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌లను 'దోస్త్ మేరా దోస్త్' దాకా తీసుకొచ్చి ఎన్నికల ముందు హిట్ కొట్టిన కాంగ్రెస్ హైకమాండ్, సీఎం పదవి విషయానికొచ్చేసరికి ఇద్దరి మధ్య సఖ్యత కుదర్చడానికి మల్లగుల్లాలు పడుతోంది. ఎందుకిలా?

ఒకేమాట.. కలలో మాట

ఎన్నికల ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాటే గాంధీ(సోనియా, రాహుల్, ప్రియాంక)ల మాటగా చెల్లింది. దాంతో ఎందుకిలా అని అడిగేవాళ్లు గానీ, అలకపాన్పు ఎక్కే వాళ్లు గానీ ఎవరూ కనిపించలేదు. లేదా ఎవరూ అందుకు సాహసించలేదు. సిద్ధరామయ్య, శివకుమార్‌లు సైతం ఖర్గే మాట జవదాటకుండా పార్టీ విజయానికి కృషి చేశారు. గెలిచాక మళ్లీ షరా మామూలే! సిద్ధరామయ్య, శివకుమార్‌లు ఎవరి గూట్లోకి వారు వెళ్లిపోయి, సై అంటే సై అనే స్థాయిలో ఢీకొంటున్నారు. సీఎం రేసులోనూ అదే వైఖరి. ఎన్నికల ఫలితాలు వెలువడి నాలుగు రోజులైనా ఎటూ తేల్చుకోలేని స్థితిలో అధిష్టానం ఊగిసలాడుతోందంటే ఏమనుకోవాలి? పార్టీలోని పెద్దలు ఒకేమాట మీద నిలబడలేకపోవడం కారణం కాదా? రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు సిద్ధరామయ్య వైపు, మల్లికార్జున ఖర్గే శివకుమార్ వైపు మొగ్గు చూపుతున్నారని అభిజ్ఞ వర్గాల భోగట్టా. ఎన్నికల ముందు లాగా హైకమాండ్ ఒకేమాట మీద ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదు. సిద్ధరామయ్య, శివకుమార్‌లు మా అంటే కాసేపు అలకపాన్పు ఎక్కి, ఆ తర్వాత సర్దుకునేవారు.

అందుకే సీఎం పీఠంపై పీటముడి

గతంలో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సిద్ధరామయ్య అనుభవానికి పెద్దపీట వేయడంలో తప్పు లేదు గానీ, పార్టీ విజయం కోసం అహర్నిశలూ చెమటోడ్చడమే కాకుండా ఆర్థిక వనరులు సైతం సమకూర్చిన శివకుమార్‌ను ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకోమనడం అభిమానులకు రుచించలేదు. అందుకే ముఖ్యమంత్రి పీఠంపై పీటముడి పడింది. ఢిల్లీ వేదికగా ప్రత్యర్థులిద్దరూ బుధవారం మొత్తం లాబీయింగ్‌లో తలమునకలై ఉన్నారు. క్షణానికో సీన్ మారింది. సిద్ధరామయ్యే సీఎం అంటూ లేఖ సైతం సిద్ధమయ్యింది. శివకుమార్ ససేమిరా అనడంతో ఆ లేఖ బుట్టదాఖలయ్యింది. బెంగళూరు కంఠీరవ స్టేడియంలో గురువారం జరగాల్సిన ప్రమాణ స్వీకార ఏర్పాట్లను ప్రస్తుతానికి నిలిపేశారు. సీఎం పోస్టు కోసం కొట్లాట ఈ స్థాయికి చేరుకుందంటే ముగింపు ఎలా ఉంటుందో ఊహించడం కష్టం. అసలు హైకమాండ్ దాకా వెళ్లకుండా కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్పీ) సమావేశంలోనే సీఎం అభ్యర్థిని ఎన్నికొని ఉంటే ఎలాంటి వివాదానికి తావు ఉండేది కాదు. హైకమాండ్ చేతికి మట్టి అంటకుండా ఉండేది. అలా చేస్తే అది కాంగ్రెస్ సంస్కృతి ఎందుకవుతుంది? తెగేదాకా లాగి రెండు కుంపట్లు పెట్టుకుంటే ప్రతిపక్షం దాన్ని సొమ్ము చేసుకోవడం ఖాయం. అదే పరిస్థితి వస్తే ఈ ఇద్దరినీ కాదని మూడో వ్యక్తిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేయడం తప్ప కాంగ్రెస్‌కు మరో గత్యంతరం లేదు.



కాంగ్రెస్ నేర్చుకున్నదేమీ లేదు

రాజస్తాన్‌లో 2018లో అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్ మధ్య మొదలైన సీఎం పీఠం లొల్లి ఐదేళ్లయినా ఇంకా ఓ కొలిక్కిరాలేదు. ఈ అనుభవం నుంచి కాంగ్రెస్ నేర్చుకున్నదేమీ లేదు. పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని గెలిపించిన సచిన్ పైలట్‌ను పక్కనపెట్టి(కొన్ని రోజులు డిప్యూటీ సీఎం పదవి ఎరవేసి), అనుభవాన్ని సాకుగా చూపి గహ్లోత్‌ను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టారు. అప్పటినుంచి రాజస్తాన్ అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతూనే ఉంది. రాష్ట్రంలో ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే ఎన్నికల్లో గెలుస్తామన్న ఆశలు సన్నగిల్లాయి. ఇదంతా ఎందుకంటే.. డీకే శివకుమార్ మరో సచిన్ పైలట్ అయితే, కర్ణాటక మరో రాజస్తాన్ అవుతుందని రాజకీయ విశ్లేషకుల అంచనా.



కొత్త జాతి జీవి... మిజోరంకు ఎగిరొచ్చింది!

ఐజ్వాల్: అత్యల్పదూరం ఎగిరే బల్లి జాతి బుల్లి జీవిని శాస్త్రవేత్తలు భారత్‌లో తొలిసారిగా మిజోరంలో గుర్తించారు. చెట్లపై జీవించే దీనికి గెక్కో మిజోరమెన్సిస్ అని పేరు పెట్టారు. ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు ఒక్క ఉదుటున దూకడం దీని ప్రత్యేకత. 20 సెం.మీ. పొడవుండే ఈ జీవికి గెంతేందుకు అనువుగా తోక చివరి భాగం పైకి వంగి ఉంది. 'వీటి డీఎన్ఏ 21 శాతం వేరుగా ఉంది. ఇది నిజంగా కొత్త జాతి' అని మిజోరం వర్సిటీ, జర్మనీలోని మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయాలజీ పరిశోధకులు తెలిపారు. మిజోరం ప్రజలు వీటిని అత్యంత ఖరీదైనవిగా భావించి వేటాడుతున్నారట.



మధ్యప్రదేశ్‌లోని షాదోల్ జిల్లాలో అంబులెన్స్‌కు డబ్బుల్లేక కూతురి మృతదేహాన్ని 70 కి.మీ. దూరంలోని స్వగ్రామానికి వేరేవాళ్ల బైక్‌పై తీసుకెళ్తున్న ఓ పేద తండ్రి. విషయం తెలిసి కలెక్టర్ వెంటనే అంబులెన్స్ పంపి ఆర్థిక సాయం కూడా చేశారు.

కర్ణాటకలో అధికార పీఠం కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ హస్తిన వేదికగా హోరాహోరీ తలపడుతున్నారు. మధ్యేమార్గంగా చెరో రెండున్నరేళ్లు పదవిని పంచుకోవాలని అధిష్టానం ప్రతిపాదించినా సిద్ధరామయ్యకు తొలి చాన్సిచ్చేందుకు డీకే ససేమిరా అంటున్నారు. "అన్నదమ్ముల్లా సమానంగా పంచుకోవడానికి అదేమీ వారసత్వపు ఆస్తి కాదు! సీఎం పదవి. ప్రభుత్వ ఏర్పాటుతో ముడిపడ్డ అంశం. పంచుకునే సమస్యే లేదు" అని ఆయన కరాఖండిగా చెబుతున్నారు. డీకే అభ్యంతరాల వెనక సహేతుకమైన కారణాలు లేకపోలేదు. కర్ణాటకతో సహా పలు రాష్ట్రాల్లో ఇలాంటి ప్రయోగాలు పెద్దగా ఫలించిన దాఖలాలు లేవు!



షేరింగ్.. ఓ ఫ్లాప్ ఫార్ములా..!

- కాంగ్రెస్ పాలనలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో బెడిసికొట్టింది
- గద్దె దిగి సింగ్‌దేవ్‌కు చాన్సిచ్చేందుకు భగెల్ ససేమిరా
- కర్ణాటకలోనూ ఫలించని బీజేపీ-జేడీ(ఎస్) ప్రయోగం

ఛత్తీస్‌లో 'చెయ్యి'చ్చిన భగెల్

➤ ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలోనే ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో పార్టీలోనే ముఖ్య నేతల మధ్య పవర్ షేరింగ్ ఫార్ములా బెడిసికొట్టింది. అక్కడ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ సాధించింది. భూపేశ్ భగెల్ (62), త్రిభువనేశ్వర్ శరణ్ సింగ్‌దేవ్ (70) సీఎం పదవి కోసం పట్టుబట్టారు. దాంతో అధిష్టానం ఇప్పుడు సిద్ధూ–డీకే ద్వయానికి ప్రతిపాదించిన ఫార్ములానే అమలు చేసింది. చెరో రెండున్నరేళ్లు సీఎంగా ఉండేలా రాజీ ఫార్ములా కుదిర్చింది. సింగ్‌దేవ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో సరిపెట్టుకోగా తొలుత భగెల్ గద్దెనెక్కారు. తీరా 2021 జూలైలో రెండున్నరేళ్లు ముగిశాక తప్పుకుని సింగ్‌దేవ్‌కు చాన్సిచ్చేందుకు ససేమిరా అన్నారు. ఇప్పటికీ సీఎంగా కొనసాగుతున్నారు. అగ్ర నేత రాహుల్‌గాంధీ రాష్ట్రాన్ని సందర్శించి అభివృద్ధి పనులన్నీ కళ్లారా చూశాక తనను ఉంచాలో, దించాలో డిసైడ్ చేస్తారని చెబుతూ రెండేళ్లుగా కాలం వెళ్లదీస్తున్నారు. అధిష్టానం జోక్యం కోసం ఎదురు చూసి చిర్రెత్తుకొచ్చిన సింగ్‌దేవ్ ఇటీవలే మంత్రి పదవులకు రాజీనామా చేసినా లాభం లేకపోయింది. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో భగెల్‌ను మార్చే ఉద్దేశం కూడా హస్తిన పెద్దలకు లేనట్టే కన్పిస్తోంది!

కర్ణాటకలోనే ఫెయిలైంది'...

➤ కర్ణాటకలోనే దాదాపు 20 ఏళ్ల క్రితం బీజేపీ, జేడీ(ఎస్) మధ్య సీఎం పదవి పంపకం కథ ఇలాగే అడ్డం తిరిగింది. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజారిటీ రాలేదు. బీజేపీకి 79, కాంగ్రెస్‌కు 65, జేడీ(ఎస్)కు 58 సీట్లొచ్చాయి. కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. కానీ రెండేళ్లకే కాంగ్రెస్‌కు జేడీ(ఎస్) చెయ్యిచ్చింది. సంకీర్ణాన్ని కూలదోసి 2006 ఫిబ్రవరిలో బీజేపీతో జట్టు కట్టింది. చెరో 20 నెలలు సీఎం పదవిని పంచుకునేలా ఒప్పందం కుదిరింది. తొలి చాన్సు దక్కించుకున్న జేడీ(ఎస్) నేత కుమారస్వామి ఒప్పందం మేరకు 2007 అక్టోబర్‌లో గద్దె దిగేందుకు ససేమిరా అన్నారు. 4,5రోజుల హైడ్రామా తర్వాత ఆయన రాజీనామాతో రాష్ట్రం రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది. నెల తర్వాత జేడీ(ఎస్) బెట్టు సడలించడంతో బీజేపీ నేత యడియూరప్ప యడియూరప్ప సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ శాఖల పంపిణీలో విభేదాలు రావడంతో యడ్డీ సర్కారుకు మద్దతివ్వను పొమ్మన్నారు కుమారస్వామి! అలా బీజేపీ–జేడీ(ఎస్) సంకీర్ణం కథ పూర్తిగా పట్టాలెక్కకుండానే కంచికి చేరింది!

యూపీలోనూ అంతే

1996లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, బీఎస్పీ ముందస్తు పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లాయి. ఏ పార్టీకీ మెజారిటీ రాలేదు. మొత్తం 424 స్థానాలకు గాను 174 సీట్లతో బీజేపీ అతి పెద్ద పార్టీగా నిలవగా సమాజ్‌వాదీకి 110, బీఎస్పీకి 67, కాంగ్రెస్‌కు 33 స్థానాలు దక్కాయి. కొద్ది నెలల రాష్ట్రపతి పాలన అనంతరం కాంగ్రెస్‌కు బీఎస్పీ గుడ్‌బై చెప్పింది. ఆర్నెల్లకోసారి అధికారాన్ని మార్చుకునే ఒప్పందంతో బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1997 మార్చిలో మాయావతి సీఎం అయ్యారు. సెప్టెంబర్లో ఆమె గద్దె దిగి బీజేపీ నేత కల్యాణ్‌సింగ్ సీఎం అయ్యారు. నెల రోజులకే బీఎస్పీ మద్దతు ఉపసంహరించడంతో సంకీర్ణం కథ ముగిసింది. అంతకుముందు 1995లోనూ బీజేపీ–బీఎస్పీ సంకీర్ణ సర్కారు ఐదు నెలలకే కుప్పకూలింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆగస్టు 14లోగా దర్యాప్తు పూర్తి చేయండి

అదానీపై గ్రూప్ అక్రమాలపై సెబీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లో అవకతవకల ఆరోపణలపై దర్యాప్తును ఆగస్టు 14కల్లా పూర్తి చేయాలని సెబీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటిదాకా జరిగిన దర్యాప్తుపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. దర్యాప్తు డెడ్‌లైన్‌ను సెప్టెంబర్ నెలాఖరు దాకా పొడిగించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తికి అంగీకరించలేదు. దర్యాప్తులో ఇబ్బందులుంటే తెలియజేయాలని సూచించింది.

చైనా నౌక మునిగి 30 మంది గల్లంతు

బీజింగ్: 39 మందితో చేపల వేటకు బయలుదేరిన చైనా నౌక మంగళవారం తెల్లవారుజామున హిందూ మహాసముద్రంలో మునిగిపోయింది. వీరిలో 17 మంది చైనావాసులు, 17 మంది ఇండోనేషియా పౌరులు, ఐదుగురు ఫిలిప్పైన్స్ జాతీయులు ఉన్నారు. 9 మంది జాడ గుర్తించారు. మిగతా వారికోసం గాలింపు సాగుతోంది. ఆస్ట్రేలియా, శ్రీలంక, మాల్దీవులు, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్‌తోపాటు పలు దేశాల ప్రభుత్వ అధికారులతో చైనా విదేశాంగ శాఖ సంప్రదింపులు జరుపుతోంది. గాలింపు, సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలని కోరింది.

బైడెన్ గైర్హాజరుతో క్వాడ్ సదస్సు రద్దు

మెల్‌బోర్న్/వాషింగ్టన్: అమెరికా రుణపరిమితి పెంపు సమస్యను అత్యవసరంగా చక్కదిద్దాల్సిన నేపథ్యంలో 24వ తేదీన ఆస్ట్రేలియాలో జరగాల్సిన క్వాడ్ సదస్సుకు హాజరు కాలేనని అధ్యక్షుడు బైడెన్ తెలిపారు. దాంతో సదస్సు రద్దయింది. అందులో చర్చించదలచిన కీలకాంశాలను జపాన్‌లోని హిరోషిమాలో జరగబోయే జీ7 సదస్సు సందర్భంగా క్వాడ్ దేశాలు చర్చించే అవకాశముందని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ తెలిపారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా యథాతథంగా జరగనుంది. అల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలతో పాటువాణిజ్య సంబంధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మే 19– 21 మధ్య మోదీ జపాన్‌లో జీ7 సదస్సులో పాల్గొంటారు. 22న పపువా న్యూ గినియాలో ఇండో–పసిఫిక్ దీవుల సహకార సదస్సులో పాల్గొంటారు. 23న ఆస్ట్రేలియాలో భారతీయులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. జీ7 భేటీ మోదీ, జపాన్, ఆస్ట్రేలియా ప్రధానులతో బైడెన్ చర్చిస్తారని శ్వేతసౌధం ప్రకటించింది.

హ్యారీ దంపతుల్ని వేటాడిన కెమెరా కళ్లు!

న్యూయార్క్‌లో కొద్దిలో తప్పిన రోడ్డు ప్రమాదం



న్యూయార్క్: అమెరికాలో ఓ దాతృత్వ కార్యక్రమానికి వెళ్తున్న బ్రిటన్ రాచకుటుంబానికి చెందిన ప్రిన్స్ హ్యారీ, భార్య మెఘన్, అత్త డోరియా రాగ్లాండ్‌లను మీడియా ఫొటోగ్రాఫర్లు ఫొటోల కోసం వెంబడించారు. ఇది పాతికేళ్ల క్రితం హ్యారీ తల్లి ప్రిన్సెస్ డయానాను పారిస్‌లో కెమెరామెన్లు వాహనాల్లో వెంబడించడం అది విషాదాంతమవడాన్ని గుర్తుచేసింది. 'ఆరు వాహనాల్లో మీడియా వ్యక్తులు ఏకంగా రెండు గంటలపాటు హ్యారీ వాహనాన్ని వెంబడించారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో పలు వాహనాలు దాదాపు గుద్దుకున్నంత పని జరిగింది. ఈ ఘటనలో పలు వాహనాలు, పాదచారులు, ఇద్దరు న్యూయార్క్ పోలీసు అధికారులు చాలా ఇబ్బంది పడ్డారు' అని హ్యారీ అధికార ప్రతినిధి బుధవారం వెల్లడించారు. ఘటన తర్వాత పోలీస్ రక్షణలో వారు వెళ్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. అయితే అధికారికంగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని న్యూయార్క్ పోలీసు విభాగం ప్రకటించింది. లండన్‌లో బ్రిటన్ రాజుగా చార్లెస్ పట్టాభిషేకం తర్వాత దాదాపు నెలరోజుల తర్వాత తొలిసారిగా ఈ జంట మీడియా కంటపడటంతో మీడియా అత్యుత్సాహం చూపి ఉంటుందని వార్తలొచ్చాయి.


ఎవరెస్ట్‌నెక్కి రికార్డుకెక్కారు

27 సార్లు పర్వతారోహణ చేసిన నేపాల్ షెర్పా కమీ రిటా



కఠ్మాండూ: నేపాల్‌కు చెందిన ప్రఖ్యాత పర్వతారోహకుడు కమీ రీటా షెర్పా మరోమారు ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించి తన గత రికార్డును తానే చెరిపేసి కొత్త రికార్డ్‌ను లిఖించారు. 53 ఏళ్ల రీటా బుధవారం ఉదయం విజయవంతంగా 27వసారి ఎవరెస్ట్‌ను ఎక్కారని నేపాల్ పర్యాటక శాఖ ప్రకటించింది. దీంతో నూతన ప్రపంచ రికార్డు ఆవిష్కృతమైంది. గత ఏడాది రీటా 26వసారి ఎవరెస్ట్ పర్వతారోహణ విజయవంతంగా పూర్తిచేసి ప్రపంచ రికార్డును సృష్టించారు. ఆ రికార్డును మూడు రోజుల క్రితం మరో షెర్పా అయిన 46 ఏళ్ల పసంగ్ దవా సమం చేశారు. దీంతో రీటా బుధవారం మరోమారు పర్వతమెక్కి తన పేరిట రికార్డును లిఖించుకున్నారు. ఈయన 1994 మే 13న తొలిసారి ఈ పర్వతశిఖరాన్ని చేరారు. రీటా గతంలోనే ప్రపంచంలోని 8,000 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న పలు శిఖరాలను అధిరోహించారు. సీనియర్ మౌంటేన్ గైడ్‌గా పనిచేస్తున్నారు. బుధవారంనాటి పర్వతారోహణకు అయిన ఖర్చులను కఠ్మాండూకు చెందిన ఒక వాణిజ్య సాహసయాత్రల నిర్వహణ సంస్థ భరించింది. ఈ స్ప్రింగ్ సీజన్‌లో ఇప్పటిదాకా మొత్తంగా 478 మందికి ఎవరెస్ట్ ఎక్కేందుకు అనుమతులు వచ్చాయి.

వచ్చే ఐదేళ్లలో ఎండ ప్రచండం!



జెనీవా: వచ్చే అయిదేళ్ల పాటు ప్రపంచ దేశాల్లో ఎండలు దంచికొడతాయని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) హెచ్చరించింది. పరిమితికి మించి గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల, ఎల్‌నినో ప్రభావంతో అయిదేళ్ల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. 2015లో జరిగిన పారిస్ ఒప్పందంలో ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, దానిని అధిగమించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేసింది. 2015–2022 వరకు వరసగా ఎనిమిదేళ్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, వచ్చే ఐదేళ్లలో మరింత పెరిగిపోతాయని తెలిపింది. ''వచ్చే అయిదేళ్లలో ఏదో ఒక ఏడాది లేదంటే అయిదేళ్ల సగటు ఉష్ణోగ్రతలు పారిస్ ఒప్పందాన్ని అధిగమించేలా 1.5 డిగ్రీలు పెరిగిపోతాయి. అలా పెరగడానికి 98% అవకాశాలున్నాయి'' అని డబ్ల్యూఎంఓ చీఫ్ పెటరి టాలస్ చెప్పారు. ప్రపంచ దేశాలన్నీ పారిస్ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో పాటు ఎల్‌నినో పరిస్థితులతో ఈ ప్రమాదం ముంచుకొస్తోందని తెలిపారు. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం వల్ల ఆరోగ్యం, ఆహారం, నీటి పర్యవేక్షణ, పర్యావరణంపై ప్రభావం కనిపిస్తుందన్నారు.

రూ. 1000 కోట్లతో ఆగిన కంటైనర్

సాక్షి, చెన్నై: రిజర్వ్ బ్యాంక్ నుంచి విల్లుపురం వైపుగా రూ. 1000 కోట్ల నగదుతో వెళ్తున్న కంటైనర్ మార్గం మధ్యలో మరమ్మతులకు గురైంది. దీంతో ఆ వాహనానికి కట్టుదిట్టమైన భద్రతను కల్పించారు. వివరాలు.. చెన్నై రిజర్వు బ్యాంక్ నుంచి విల్లుపురం వైపుగా ఓ బ్యాంక్‌కు రూ. వెయ్యికోట్ల నగదును తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ నగదుతో రెండు కంటైనర్లు భారీ భద్రత నడుమ బుధవారం చెన్నై నుంచి బయలుదేరాయి. అయితే తాంబరం శానిటోరియం వద్ద ఓ వాహనం మరమ్మతుకు గురైంది. రోడ్డు మీద ఈ వాహనం హఠాత్తుగా ఆగడంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే ముందుగా వెళ్తు న్న మరో కంటైనర్‌ను కూడా ఆపివేశారు. కంటైన ర్ మరమ్మతుకు చాలా సమయం పట్టే అవకాశం ఉండడంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సిద్ధ వైద్య కళాశాలలోకి ఆ వాహనాలను తీసుకెళ్లారు. తాంబరం పోలీసులు వాటికి భద్రత కల్పిస్తున్నారు.

న్యూస్‌రీల్

సీఎస్ రేసులో శివదాస్ మీన



సాక్షి, చెన్నై : సీఎస్ పదవీ రేసులో తాజాగా సీనియర్ ఐఏఎస్ అధికారి శివదాస్ మీన పేరు తెర మీదకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇరై అన్బు మరి కొద్ది రోజుల్లో పదవీ విరమణ పొందనున్నారు. దీంతో ఆయన స్థానంలో కొత్త సీఎస్ నియామకం కోసం కసరత్తు మొదలైంది. రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్‌గా హన్స్‌రాజ్ వర్మ ఉన్నారు. ఆయన పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం అదనపు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తదుపరి స్థానంలో నగరాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి శివదాస్ మీన ఉన్నారు. అలాగే, రెవెన్యూ కమిషనర్ ఎస్‌కే ప్రభాకర్, అతుల్య మిశ్ర వంటి ఐఏఎస్‌లు కూడా సీనియర్లుగా ఉన్నారు. వీరి పేర్లతో కేంద్రానికి జాబితాను రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. వీరిలో ఒకరిని సీఎస్‌గా నియమించనున్నారు. ఇందులో శివదాస్ మీనకు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. దీంతో తదుపరి సీఎస్ ఆయనే అన్న చర్చ ఐఏఎస్ వర్గాల్లో సాగుతోంది. 1989వ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శివదాస్ మీన రాజస్థాన్‌కు చెందిన అధికారి. జైపూర్‌లో విద్యాభ్యాసం, జపాన్‌లో పరిశోధనలు చేశారు. శివదాస్ మీన గతంలో దివంగత సీఎం జయలలితకు కార్యదర్శిగా పనిచేశారు. ఆమె మరణం తదుపరి పరిణామాలతో ఆయన డిప్యుటేషన్‌పై కేంద్రం విధులకు వెళ్లారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎంగా స్టాలిన్ పగ్గాలు చేపట్టడంతో మళ్లీ రాష్ట్రానికి వచ్చారు.

పుదుచ్చేరి నుంచే మిథనాల్..

సాక్షి, చెన్నై: పుదుచ్చేరిలోని ఓ రసాయన పరిశ్రమ నుంచి సారా తయారీకి మిథనాల్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ పరిశ్రమ యజమాని ఏలుమలైను బుధవారం అరెస్టు చేశారు. వివరాలు.. కల్తీ సారా కారణంగా విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాల్లో చోటు చేసుకున్న మరణాల గురించి తెలిసిందే. ఈ కల్తీసారా పూర్తిగా మిథనాల్‌తో తయారు చేసినట్టు పరీక్షల్లో తేలింది. ఈ రసాయనం పుదుచ్చేరి విల్లియనూరులోని కరసురా ప్రాంతంలోని రసాయన పరిశ్రమ నుంచి సరఫరా చేసి ఉండడం వెలుగు చూసింది. దీంతో ఆపరిశ్రమ యజమాని ఏలుమైలైతో పాటు ఐదుగురిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ ఏలుమలై గతంలో డీఎంకేలో పనిచేసినట్లు విచారణలో తేలింది. ఈ పరిశ్రమకు మిథనాల్ చెన్నై నుంచి పంపిణీ చేస్తుండడంతో ఆ సంస్థ వివరాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. అలాగే చెంగల్పట్టు కల్తీ సారా మరణం కేసుకు సంబంధించి బీజేపీకి చెందిన స్థానిక నాయకుడు విజయకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇక్కడ అరెస్టయిన సారా వ్యాపారి అమావాస్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. తాను కూడా కల్తీ సారా తగినట్లు అతడు పేర్కొనడంతో ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా కల్తీ సారా మరణాలపై తనకు నివేదిక సమర్పించాలని పోలీసు అధికారులను గవర్నర్ ఆర్ ఎన్ రవి ఆదేశించారు.

హెలికాప్టర్ టూరిజానికి చెక్

సాక్షి, చెన్నై: నీలగిరుల్లో హెలికాప్టర్ టూరిజానికి హైకోర్టు చెక్ పెట్టింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం స్టే విధించింది. వివరాలు.. నీలగిరి జిల్లా ఊటీలో ప్రస్తుతం వేసవి ఉత్సవాలు మొదలయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా పర్యాటకులను ఆకర్షించే విధంగా హెలికాప్టర్ టూరిజం పేరిట ప్రత్యేక కార్యక్రమానికి చర్యలు తీసుకున్నారు. అయితే దీనిని వ్యతిరేకిస్తూ చెన్నైకు చెందిన ప్రొఫెసర్ మురగవేల్ హైకోర్టును ఆశ్రయించారు. హెలికాప్టర్ టూరిజం కారణంగా నీలగిరుల్లో ఉన్న ఏనుగులు వంటి అనేక వన్యప్రాణులకు హాని కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హఠాత్తుగా నీలగిరుల్లో హెలికాప్టర్లు చక్కర్లు కొట్టిన పక్షంలో ఆ జంతువులు భయాందోళనకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్ బుధవారం న్యాయమూర్తులు అనిత సుమంత్, నిర్మల్‌కుమార్ బెంచ్ ముందు విచారణకు వచ్చింది. హెలికాప్టర్ టూరిజం నీలగిరుల్లోని అటవీ ప్రాంతాల వైపుగా కాకుండా, కేవలం నగరంలో మాత్రమే నిర్వహించేందుకు పరిశీలన జరుపుతున్నట్లు ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. అయితే ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు చేయనందున హెలికాప్టర్ టూరిజానికి అనుమతించబోమని, ఇందుకు సంబంధించిన పనులపై స్టే విధిస్తున్నామని న్యాయమూర్తులు స్పష్టం చేశారు.

పౌష్టికాహార కేంద్రాల్లో స్వీట్ పొంగల్

- సాంఘిక సంక్షేమ శాఖ వెల్లడి

కొరుక్కుపేట: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి రోజైన జూన్ 3న రాష్ట్రంలోని పౌష్టికాహార, అంగన్‌వాడీ కేంద్రాల్లో తీపి పొంగల్‌ను వడ్డించనున్నట్లు సాంఘిక సంక్షేమ, మహిళా హక్కుల శాఖ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఆ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రుల జయంతి రోజున స్వీట్ పొంగల్ ఇస్తున్నట్లే, రానున్న కాలంలో కరుణానిధి జయంతికి కూడా స్వీట్ పొంగల్ అందజేస్తామని విద్యార్థులకు తెలియజేసింది. ఈ మేరకు జూన్ 3న తమిళనాడులోని అన్ని పౌష్టికాహార, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. రాష్ట్రంలో 43,094 పోషకాహార కేంద్రాల ద్వారా 44.72 లక్షల మంది విద్యార్థులు, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 54,439 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 14.40 లక్షల మంది వరకు పిల్లలు, బాలింతలు లబ్ధిపొందుతారని ఆ శాఖ వెల్లడించింది.

ఉదాసీనతను ఉపేక్షించం

"అక్రమార్కులపై ఉక్కుపాదం మోపండి.. తప్పుచేసే వారిని ఉపేక్షించకండి.. నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు''.. అంటూ సీఎం స్టాలిన్ పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కొత్త లక్ష్యాలను నిర్దేశించారు. హోం శాఖ పరిధిలోని అధికారుల పనితీరును మదింపు చేసేందుకు గాను.. ఇకపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించాలని ఆ శాఖ కార్యదర్శి అముదాను ముఖ్యమంత్రి ఆదేశించారు.

- పోలీసు బాసులకు ఇకపై అగ్ని పరీక్షే
- పనితీరుపై నెలవారీ సమీక్షలు
- కల్తీరాయుళ్ల భరతం పట్టేందుకు ప్రత్యేక బృందాలు
- సీఎం స్టాలిన్ కీలక ఆదేశాలు



ఉన్నతాధికారుల సమావేశంలో మట్లాడుతున్న సీఎం స్టాలిన్

సాక్షి,చెన్నై: మాదకద్రవ్యాల నియంత్రణ, కల్తీ సారా, కల్తీ మద్యం, పొగాకు ఉత్పత్తి, విక్రయదారుల భరతం పట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. సచివాలయంలో బుధవారం నిర్వహించిన పోలీసు ఉన్నతాధికారులు, హోంశాఖ కార్యదర్శుల సమావేశంలో ఈ మేరకు సీఎం స్టాలిన్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరై అన్బు, హోంశాఖ ప్రధాన కార్యదర్శి అముదా, డీజీపీ శైలేంద్రబాబు, మాదక ద్రవ్యాల నిరోధక విభాగం అదనపు డీజీపీ మహేశ్ కుమార్, చెన్నైపోలీసు కమిషనర్ శంకర్‌జివ్వాల్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ప్రధానంగా విల్లుపురం, చెంగల్పట్టు జిల్లాలో చోటు చేసుకున్న కల్తీ సారా మరణాలపై ఇందులో చర్చించారు.

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు 10581

రాష్ట్రస్థాయిలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదు కోసం 10581 టోల్ ఫ్రీ నంబరును ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రతిజిల్లాలో ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులు, ఎక్సైజ్, టాస్మాక్, రెవెన్యూ తదితర శాఖ అధికారుల సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడమే కాకుండా, వాట్సాప్ గ్రూపుల నంబర్లు ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లాల వారీగా జరిగే నేర సంబంధిత అన్ని వ్యవహారాలపై ప్రతినెలా సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. నెలలో మొదటి సోమవారం నివేదికను తన టేబుల్‌పై ఉంచాలని స్పష్టం చేశారు. నకిలీ మద్యం, మాదక ద్రవ్యాల గురించి, వాటి ప్రభావాలతో ఎదురయ్యే అనర్థాలను ప్రజలకు వివరించే విధంగా అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలని సీఎం సూచించారు. అలాగే, పాఠశాల, కళాశాల స్థాయిలోనూ చర్యలు చేపట్టాలన్నారు. మిథనాల్ వాడకం, విక్రయాలపై నిఘా మరింత పెంచాలన్నారు. రాష్ట్ర సరిహద్దులు, అటవీ ప్రాంతాలు, కుగ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరిచే అధికారులను సమస్యాత్మక ప్రాంతాల్లో విధుల్లో నియమించాలని పేర్కొన్నారు.

ఉపాధి కల్పనకు చర్యలు

కల్తీ మద్యం, కల్తీ సారా కట్టడే లక్ష్యంగా విస్తృత చర్యలు చేపట్టాలని సీఎం స్టాలిన్ అన్నారు. అలాగే వీటిని బయటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తూ పట్టుబడే వారు, మరలా అదే వృత్తిని కొనసాగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా సారా విక్రయాలు, తయారీపై దృష్టి సారించకుండా ప్రత్యామ్నాయ(ఉపాధి కల్పన) చర్యలు తీసుకోవాలని సూచించారు.

బ్రోచర్ ఆవిష్కరణ

వరల్డ్ గ్యాస్ట్రోలజీ ఆర్గనైజేషన్, తమిళనాడు, అపోలో హాస్పిటల్స్ నేతృత్వంలో కొలొరెక్టల్ కేన్సర్‌పై అవగాహన కార్యక్రమానికి బుధవారం సీఎం స్టాలిన్ శ్రీకారం చుట్టారు. నేటి ఆధునిక జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున కేన్సర్ వ్యాప్తి పెరుగుతోందని, దీనిని నివారించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి, అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, పొగాకు, మద్యం తదితర వాటికి దూరంగా ఉండటం, పండ్లు కూరగాయల వాడకాన్ని పెంచే విధంగా అవగాహన కలిగించారు. ఈ బ్రోచర్‌ను సీఎం స్టాలిన్ బుధవారం విడుదల చేశారు. అపోలో ఆసుపత్రి వైద్యులు ఆర్‌కే వెంకటాచలం, పళనిస్వామి, బ్రహ్మానాయగం, కార్తీక్ నటరాజన్ బ్రోచర్‌ను అందుకున్నారు.



కేన్సర్‌పై అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తూ..

ఉద్యోగులకు తీపి కబురు

- కరువుభత్యం 38 నుంచి 42 శాతానికి పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎం స్టాలిన్



సచివాలయం

సాక్షి, చెన్నై: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 4 శాతం డీఏ పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కారణంగా ఇకపై కరువుభత్యం 38 శాతం నుంచి 42 శాతంగా అమలు కానుంది. బుధవారం ఇందుకు సంబంధించిన ప్రకటనను సీఎం స్టాలిన్ విడుదల చేశారు. ఇందులో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే మహత్తర బాధ్యతల్లో అంకితమైన ప్రభుత్వ అధికారులు , ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్టు వివరించారు. కోవిడ్ రూపంలో ఎదురైన ఆర్థిక సంక్షోభం , అప్పుల భారం కారణంగా ఉపాధ్యాయులు, ఉద్యోగుల డిమాండ్లను దశల వారీగా నెరవేర్చాల్సిన పరిస్థితి నెలకొనట్లు పేర్కొన్నారు. పలు డిమాండ్లకు సంబంధించి ప్రభుత్వం హామీలు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అన్నింటినీ దశల వారీగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉద్యోగులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు డీఏను పెంచుతున్నామని ప్రకటించారు. 2023 ఏప్రిల్ నుంచి 38 శాతం ఉన్న డీఏను ప్రస్తుతం 42 శాతంగా నిర్ణయించామన్నారు. ప్రస్తుతం పెంచిన 4 శాతం డీఏ కారణంగా 16 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూర్చినట్లు వివరించారు. ఈ పెంపు కారణంగా ప్రభుత్వంపై ఏడాదికి రూ.2,366 కోట్లు అదనపు భారం పడుతుందని వెల్లడించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా, తమ డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరుబాటకు ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. అవసరం అయితే, సమ్మెకు దిగాలనే హెచ్చరిలక నేపథ్యంలో డీఏను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

టపాకాయలు కొనేందుకు వెళ్లి..

- బస్సును ఢీకొన్న కారు
- ఒకే గ్రామానికి చెందిన నలుగురి మృతి, ఒకరి పరిస్థితి విషమం
- గంగ జాతర రోజున వసూరులో విషాదం



కారులోని మృతదేహాలను బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది



రోడ్డుపై చెల్లాచెదరుగా పడి ఉన్న మృతదేహాలు

వేలూరు: గంగ జాతర సందర్భంగా టపాకాయలు కొనుగోలు చేసేందుకు కారులో వెళ్లిన ఒకే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వివరాలు.. తిరువణ్ణామలై జిల్లా పోలూరు సమీపంలోని వసూరు గ్రామానికి చెందిన వడివేలు(32), శంకర్(35), ఆనందన్(45), శివరామన్(32), ప్రకాష్(37) జాతరకు టపాకాయలు కొనేందుకు కారులో సేతుపట్టుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కారు దేవికాపురం వద్ద ఎదురుగా వస్తున్న ప్రభుత్వ బస్సును వీరి కారు అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జుగా అయ్యింది. కారులో ఉన్న వడివేలు, శంకర్, ఆనందన్, శివరామన్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ప్రకాష్‌ను తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సేత్తుపట్టు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని కారులో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం ఎస్పీ కార్తికేయన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రమాద స్థలాన్ని నేరుగా వెళ్లి విచారణ జరిపారు. సేత్తుపట్టు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా బుధవారం జాతర సందర్భంగా ఎంతో సంతోషంగా ఉన్న గ్రామస్తులకు ఒకే గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామంమొత్తం శోక సముద్రంలో మునిగిపోయింది.

యువకుడి అవయవదానం

- హెలికాప్టర్‌లో గుండెను చెన్నైకి తరలింపు



ప్రసాద్ (ఫైల్)

వేలూరు: వేలూరు ఓల్డ్‌టౌన్ ఉత్తరమాడ వీధికి చెందిన శంకర్ కుమారుడు ప్రసాద్(31) భవన నిర్మాణ కార్మికుడు. ఇతను ఈనెల 14న రోడ్డుప్రమాదానికి గురవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతనికి మంగళవారం రాత్రి బ్రెయిన్‌డెడ్ అయ్యింది. దీంతో అతని అవయవాలను దానం చేసేందుకు భార్య కన్నగి ముందుకొచ్చారు. ప్రసాద్ గుండెను చెన్నై అపోలో ఆస్పత్రికి, కిడ్నీ ఎంజీఎం ఆస్పత్రికి దానంగా అందజేశారు. యువకుడి గుండెను అంబులెన్స్ ద్వారా కాట్పాడిలోని వీఐటీ యూనివర్సిటీ ఆవరణలోకి తీసుకెళ్లి అక్కడ సిద్ధంగా ఉంచిన హెలికాప్టర్‌లో చెన్నైకి తరలించారు. 22 నిమిషాల్లో గుండె చెన్నై అపోలో ఆస్పత్రికి చేరకుండని, మిగిలిని అవయవాలు ఆయా ఆస్పత్రులకు అంబులెన్స్ ద్వారా తరలించినట్లు ఆస్పత్రి నిర్వాహకులు వెల్లడించారు.

పేద విద్యార్థినికి చేయూత

సాక్షి, చెన్నై : చెన్నై కార్పొరేషన్ పాఠశాలలో చదువుకుని ప్లస్–2లో అత్యధిక మార్కులు సాధించిన ఓ విద్యార్థినికి ఎతిరాజ్ కళాశాలలో ఉచితంగా సీటు దక్కింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో చెన్నై కార్పొరేషన్ పాఠశాల విద్యార్థిని గాయత్రి 592 మార్కులు సాధించారు. పెరంబూరుకు చెందిన ఈ విద్యార్థిని తల్లిదండ్రులు రోజు వారీ కూలీలు. దీంతో తన ఉన్నత విద్యా చదువులకు సాయం చేయాలని ఆ విద్యార్థిని చేసుకున్న విజ్ఞప్తికి చెన్నై ఎతిరాజ్ మహిళా కళాశాల యాజమాన్యం స్పందించింది. తమ ట్రస్ట్ ద్వారా ఆవిద్యార్థినికి బీకాం (జనరల్) కోర్సు సీటును ఉచితంగా అందజేసింది. ఆ విద్యార్థినిని ఉన్నత విద్యకు సంబంధించిన ఖర్చుల ఫీజు తమ ట్రస్ట్ ద్వారా అందజేస్తామని ఆ కళాశాల యాజమాన్యం ప్రకటించింది. బుధవారం ధ్రువీకరణ పత్రాన్ని అందజేసింది.

మదురైలో మహానాడు



సమావేశంలో పళనిస్వామి తదితరులు

- అన్నాడీఎంకే కార్యదర్శుల భేటీలో నిర్ణయం

సాక్షి, చెన్నై: మదురై వేదికగా భారీ మహానాడు నిర్వహణకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడపాడి కె. పళనిస్వామి సిద్ధమయ్యారు. వివరాలు.. అన్నాడీఎంకే జిల్లాల కార్యదర్శుల సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశం నిమిత్తం పార్టీ కార్యాలయానికి వచ్చిన ప్రధాన కార్యదర్శి పళనిస్వామి అన్నాడీఎంకే వర్గాలు బ్రహ్మరథం పట్టే విధంగా ఆహ్వానం పలికారు. ప్రధాన కార్యదర్శిగా పళని స్వామి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా జిల్లాల కార్యదర్శుల సమావేశం జరగడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ పరంగా కీలక నిర్ణయాలు, బలోపేతం దిశగా కార్యక్రమాలు విస్తృతం చేయడానికి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో ఇదివరకు సభ్యులుగా ఉన్న వారి గుర్తింపు కార్డుల రెన్యువల్ చేయడం, కొత్త సభ్యులకు కార్డుల మంజూరు దిశగా చర్యలు చేపట్టారు. అలాగే మదురై వేదికగా భారీ మహానాడుకు సిద్ధమయ్యారు. అన్నాడీఎంకే బలాన్ని చాటే విధంగా దక్షిణ తమిళనాడులో ప్రధాన కేంద్రంగా ఉన్న మదురై వేదికగా ఈమహానాడు నిర్వహణకు నిర్ణయించారు. ఆగస్టు 20వ తేదీన మహానాడు జరుగుతుందని ప్రకటించారు. నేతలందరూ సమష్టిగా ముందుకెళ్లడమే కాకుండా, పార్టీని బలోపేతం చేసే విధంగా కార్యక్రమాలు జిల్లాల్లో చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే పళని స్వామి జిల్లాల్లో పర్యటించేందుకు తగ్గ రూట్ మ్యాప్ సిద్ధం కాబోతోంది. ముందుగా మహానాడు విజయవంతం, ఆ తదుపరి జిల్లాల పర్యటనలో పళనిస్వామి కార్యక్రమాలు షెడ్యూల్ విడుదలకు నిర్ణయించారు. సమావేశంలో పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, సీనియర్ నేతలు కేపీ మునుస్వామి, ఎస్పీ వేలుమణి, దిండుగల్ శ్రీనివాసన్‌తో పాటు అన్ని జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

16 జిల్లాలకు కొత్త కలెక్టర్లు



కొత్తగా నియమితులైన కలెక్టర్లు

- భారీగా ఐఏఎస్‌ల బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 16 జిల్లాలకు కొత్త వారిని కలెక్టర్లుగా నియమించారు. వీరంతా ఇది వరకు వివిధ హోదాలలో పనిచేసిన ఐఏఎస్ అధికారులు. అలాగే జిల్లాల్లో కలెక్టర్లుగా ఉన్న వారిని ఆయా విభాగాలకు స్థాన చలనం కల్పించారు. ఈ మేరకు బుధవారం సీఎస్ ఇరై అన్బు ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడో వసంతంలోకి అడుగు పెట్టగానే, మంత్రి వర్గంలో మార్పులు చేసిన విషయం తెలిసిందే. వెను వెంటనే రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోని అదనపు, ప్రధాన కార్యదర్శుల శాఖలలో మార్పులు చేసింది. ప్రస్తుతం భారీగా 48 మంది ఐఏఎస్‌లను బదిలీ చేయడం గమనార్హం. ఇందులో 16 మందిని కొత్తగా వివిధ జిల్లాల కలెక్టర్లుగా నియమించారు.

స్థాన చలనం..

నాగపట్నం కలెక్టర్‌గా ఉన్న ఎ.అరుణ్ తంగరాజ్ కడలూరు జిల్లాకు బదిలీ చేశారు. అర్బన్ హౌసింగ్ విభాగం కార్యదర్శి జె.అన్ని మేరీ స్వర్ణ అరియలూరు జిల్లా కలెక్టర్‌గా నియమించారు. కృష్ణగిరి కలెక్టర్ దీపక్ జాకబ్‌ను తంజావూరు కలెక్టర్‌గా, పాల వినియోగదారుల ఫెడరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎం.సరయూను కృష్ణగిరి జిల్లా కలెక్టర్‌గా స్థాన చలనం కల్పించారు. చెన్నై వాణిజ్య పన్నుల విభాగం జాయింట్ కమిషనర్ ఐఎస్ మెర్సీ రమ్యాను పుదుకోట్టై కలెక్టర్‌గా, తమిళనాడు ఆరోగ్య పథకం డైరెక్టర్ ఎస్.ఉమను నామక్కల్ జిల్లా కలెక్టర్‌గా, భూ, సర్వే విభాగం అదనపు డైరెక్టర్ కలైసెల్వి మోహన్‌ను కాంచీపురం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. తమిళనాడు ఫైబర్ నెట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.కె. కమల్ కిషోర్‌ను చెంగల్పట్టు కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడున్న కలెక్టర్ ఎ.ఆర్.రాహుల్‌నాథ్‌ను తూత్తుకుడి కలెక్టర్‌గా స్థానచలనం కల్పించారు. చెన్నై వాణిజ్య పన్నుల విభాగం జాయింట్ డైరెక్టర్ ఎం.ఎస్.సంగీత ను మదురై కలెక్టర్‌గా, ప్రభుత్వ గైడ్ లైన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశా అజిత్‌ను శివగంగై కలెక్టర్‌గా , మున్సిపల్ అడ్మినిస్టేషన్ జాయింట్ కమిషనర్ బి.విష్ణు చంద్రన్‌ను రామనాథపురం కలెక్టర్‌గా నియమించారు. రామనాథపురం కలెక్టర్‌గా ఉన్న జాన్‌టామ్ వర్గీస్‌ను నాగపట్నానికి బదిలీ చేశారు. సేలం కార్పొరేషన్ కమిషనర్ టి.క్రీస్తురాజ్‌ను తిరుపూర్ కలెక్టర్‌గా, చెన్నై మెట్రో వాటర్ బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజగోపాల్ సుంకరను ఈరోడ్ కలెక్టర్‌గా, సేలం ఎస్‌ఏజీఓ ఎండీ ఎస్.పూంగోదైను దిండుగల్ కలెక్టర్‌గా నియమించారు.

జిల్లాల నుంచి విభాగాలకు..

శివగంగై జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన పి. మధుసూదన్‌రెడ్డిని సర్వే అండ్ సెటిల్ మెంట్ విభాగం డైరెక్టర్‌గా బదిలీ చేశారు. తిరుప్పూర్ కలెక్టర్‌గా పనిచేసిన ఎస్. వినీత్‌ను ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమ విభాగం డైరెక్టర్‌గా, తూత్తుకుడి కలెక్టర్‌గా పనిచేసిన కె. సెంథిల్ రాజ్‌ను కో– ఆపరేటివ్‌సొసైటీ రిజిస్టార్‌గా, తంజావూరు కలెక్టర్ దినేష్ పొన్‌రాజ్‌ను రిజిస్ట్రేషన్ విభాగం ఐజీగా , ఈరోడ్ కలెక్టర్‌గా పనిచేసిన కృష్ణన్ ఉన్ని ఆర్థిక విభాగం జాయింట్ డైరెక్టర్‌గా, అరియలూరు కలెక్టర్ రమణ సరస్వతిని ఈ గవర్నెన్స్ జాయింట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, కడలూరు కలెక్టర్ బాల సుబ్రమణియన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శిగా, కాంచీపురం జిల్లా కలెక్టర్ ఎం. ఆర్తీని సర్వశిక్ష అభయాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, నామక్కల్ జిల్లా కలెక్టర్ శ్రేయా పీ సింగ్‌ను వ్యవసాయ విభాగం అదనపు డైరెక్టర్‌గా, దిండుగల్ కలెక్టర్ ఎస్. విశాకన్‌ను మార్కెటింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, మదురై కలెక్టర్ అనీష్ శేఖర్‌ను డిస్పోసల్ ఎల్రక్టానిక్ కార్పొరేషన్ ఎండీగా, పుదుకోట్టై కలెక్టర్ కవిత రామును సీఎండీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మెట్రోలో వాట్సాప్‌తో టికెట్ పొందే అవకాశం



వాట్సాప్ ద్వారా టికెట్‌ను పొందుతున్న ప్రయాణికులు

కొరుక్కుపేట: మెట్రో రైలు ప్రయాణికులకు శుభవార్త. లైన్‌లో నిలబడే పనిలేకుండా వాట్సాప్ ద్వారా టిక్కెట్లు పొందే సదుపాయం మెట్రో రైలు యాజమాన్యం అందుబాటులోకి తీసుకొచ్చింది. వివరాలు.. చెన్నై తిరుమంగళం మెట్రో స్టేషన్‌లో వాట్సాప్ ద్వారా మెట్రో రైలు టిక్కెట్లను పొందే సౌకర్యాన్ని చెన్నై మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్లు రాజేష్ చతుర్వేది, అర్జునన్ బుధవారం ప్రారంభించారు. వాట్సాప్‌లో ప్రయాణికుల కోసం క్యూఆర్ కోడ్, మెట్రో యుటిలిటీ కార్డ్, సింగరాచ్ చెన్నై స్మార్ట్‌కార్డ్ పొందే సదుపాయాన్ని మెట్రో రైల్ తీసుకుని వచ్చింది .మెట్రో స్టేషన్లలో వాట్సాప్ యాప్ క్యూఆర్ లైన్లను స్కాన్ చేయడం ద్వారా , లేక 83000 86000 నంబరుకు వాట్సాప్ చేసి టిక్కెట్లు పొందే సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చారు . ప్రయాణికులు ఆ వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే, మెట్రో రైల్ అడ్మినిస్ట్రేషన్ తరపున టిక్కెట్‌ను బుక్ చేసుకోమని లింక్ వస్తుంది తద్వారా ఎక్కడ నుంచి ఎక్కడి వరకు, ఎంత మొత్తం చెల్లించాలి అందులో వివరాలు అందిస్తారు. యూపీఐ ద్వారా డబ్బులు చెల్లించగానే మొబైల్‌కు స్కాన్ కోడ్ వస్తుంది. అది డిజిటల్ టిక్కెట్‌గా పనిచేస్తుందని అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

ఉరి వేసుకుని కౌన్సిలర్ ఆత్మహత్య

అన్నానగర్: చానార్‌పట్టి సమీపంలో మంగళవారం సాయంత్రం అన్నాడీఎంకే యూనియన్ కౌన్సిలర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. దిండుక్కల్ జిల్లా చానర్ పట్టి సమీపం బాలకొండన్‌పట్టి గ్రామానికి చెందిన పాండియన్. ఇతని భార్య దీప (33). వీరికి ముగ్గురు కుమార్తెలు. దీప చానార్ పట్టి పంచాయతీ యూనియన్ అన్నాడీఎంకే కౌన్సిలర్‌గా ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపానికి గురై మంగళవారం సాయంత్రం దీప ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న చానార్‌పట్టి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దిండుక్కల్ ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నేతలు

తిరుత్తణి: డీఎంకే ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీరకుప్పంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు పంచాయతీ సర్పంచ్ విజయ చీరలు పంపిణీ చేశారు. డీఎంకే తిరుత్తణి తూర్పు మండలం బీరకుప్పం గ్రామంలో ద్రవిడ మోడల్ ప్రభుత్వంలో రెండేళ్లలో ప్రజలకు చేపట్టిన పథకాలు, నిధులకు సంబంధించి యువజన విభాగ ఆధ్వర్యంలో చేపట్టిన గ్రామ సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి ఆర్తిరవి పాల్గొని ప్రసంగించారు. అనంతరం పంచాయతీ ఉపాధ్యక్షురాలు విజయ వందమంది మహిళలకు ఉచితంగా చీరలు అందజేశారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

12 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అన్నానగర్: రామనాథపురం జిల్లా ముదుకులత్తూరు సమీపంలోని మెలకవనూరు బస్టాప్ వద్ద పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం లారీలో అక్రమంగా తరలిస్తున్న 12 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మణికంఠన్ (38), తవమురుగన్ (30) సహా ముగ్గురిని ఇటీవల అరెస్టు చేశారు. ఈ క్రమంలో అజ్ఞాతంలో ఉన్న ప్రధాన నిందితుడు కల్లైజర్ (43)ను నెల్లై ప్రాంతంలో బుధవారం అరెస్టు చేశారు.

పథకాల అమల్లో నిర్లక్ష్యం వద్దు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రి దురైమురుగన్

• మంత్రి దురైమురుగన్

వేలూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడంలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదని మంత్రి దురైమురుగన్ అన్నారు. వేలూరు జిల్లా కాట్పాడిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో డీఎంకే ప్రభుత్వం రెండు సంవత్సరాల విజయాల సావనీర్‌ను విడుదల చేయడంతో పాటు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పంపిణీ, ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమం కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోందని వాటిని అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వేలూరు జిల్లాలో ఇరవన్‌గాడు, కవసంబట్టు వంటి ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెలాఖరులో సీఎం స్టాలిన్ వేలూరులో కరుణానిధి శతజయంతి వేడుకల్లో పాల్గొని పలు కోట్ల రూపాయలు విలువ చేసే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేయనున్నామని తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేశారు. ఎంపీ కదిర్‌ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, అములు విజయన్, జెడ్పీ చైర్మన్ బాబు, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, కాట్పాడి యూనియన్ చైర్మన్ వేల్‌మురుగన్ పాల్గొన్నారు.

డీఎంకేతోనే మహిళా సాధికారత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: డీఎంకే ప్రభుత్వంతోనే మహిళాసాధికారత సాధ్యమని ఎమ్మెల్యే చంద్రన్ పేర్కొన్నారు. డీఎంకే ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ద్రవిడ మోడల్ ప్రభుత్వంలో అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే విధంగా తిరువళ్లూరు వెస్ట్ జిల్లాలో యువజన విభాగం ద్వారా 70 వీధి ప్రచారాలకు ఏర్పాట్లు చేశారు. తిరుత్తణి వెస్ట్ మండల యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బుచ్చిరెడ్డిపల్లె, మద్దూరు, తెక్కళూరు, ఇస్లాంనగర్, కృష్ణసముద్రం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మండల కార్యదర్శి కృష్ణన్, యువజన విభాగం మండల ఉప కన్వీనర్ ఎస్.కోదండన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార సభలో జిల్లాకార్యదర్శి, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, పార్టీ వక్త మురసొలిమూర్తి పాల్గొని ద్రవిడ మోడల్ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్ అగుడుజాడల్లో సీఎం స్టాలిన్ సైతం మహిళలకు ప్రాముఖ్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ఉప కన్వీనర్ డి.సుకుమార్, మండల నిర్వాహకులు, గ్రామీణులు, మహిళలు పాల్గొన్నారు.

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



విజయం సాధించిన యువకులతో కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: వికలాంగులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణించే సత్తా వుందని కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీష్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు వికలాంగులు నేపాల్‌లో జరిగిన ప్రపంచ పారా వాలీబాల్ క్రీడల్లో పాల్గొని బంగారు పతకం సాధించారు. నేపాల్‌లో సాధించిన బంగారు పతకంతో పాటు సర్టిఫికెట్‌లను కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు చూపించి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా విజేతలను మీడియాకు పరిచయం చేసిన తరువాత కలెక్టర్ ప్రసంగించారు. తిరువళ్లూరు జిల్లాలో క్రీడల్లో ఆసక్తి వున్న వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నామన్నారు. విదేశాలకు వెళ్లే వారికి అవసరమైన స్పాన్సర్‌ను కూడా అందిస్తూ ఊతమిస్తున్నట్లు తెలిపారు. వికలాంగుల్లో వున్న ప్రతిభను గుర్తించి వారు రాణించేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి క్యాంపును సద్వినియోగం చేసుకుని రాణించాలని కోరారు.

పేదలకు మజ్జిగ పంపిణీ

కొరుక్కుపేట: వేసవి కాలాన్ని పురస్కరించుకుని చెన్నై షావుకారుపేటలో వివిధ వ్యాపారాలు చేస్తున్న 16మంది తెలుగువారు కలిసి పేదలకు, కార్మికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వారానికి రెండు మార్లు బుధవారం, శనివారాల్లో మజ్జిగ, తాగునీటిని అందిస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఇందులోభాగంగా బుధవారం మధ్యాహ్నం స్థానిక షావుకారుపేటలోని మోడల్ లాడ్జీ ప్రాంగణం వద్ద 500మందికి పైగా ప్రజలకు, కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

లంచం కేసులో పంచాయతీ చైర్మన్, డ్రైవర్ అరెస్ట్

అన్నానగర్: శివగంగై సమీపంలో ఇంటి పన్ను రశీదు కోసం రూ.13 వేలు లంచం తీసుకున్న పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడిని, డ్రైవర్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం సాయంత్రం అరెస్టు చేశారు. వివరాలు.. కల్లాల్ పంచాయతీ కీళకోట్టై గ్రామానికి చెందిన బాలాజీ. తన తండ్రి మణిముత్తుకి చెందిన ఇల్లు, స్థలం తన పేరుపై మార్చుకున్నాడు. దీంతో తన పేరు మీద ఇంటి పన్ను రశీదు ఇవ్వాలని కల్లాల్ పంచాయతీ కౌన్సిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. బాలాజీ పేరుతో ఇంటి పన్ను రసీదు ఇచ్చేందుకు కల్లాల్ పంచాయతీ పెద్ద నాచియప్పన్ (55) రూ.13 వేలు లంచం అడిగినట్లు సమాచారం. డబ్బులు ఇవ్వడానికి ఇష్టపడని బాలాజీ శివగంగైలోని ఏసీబీ ఫిర్యాదు చేశాడు. వారి సూచనలతో బాలాజీ లంచం సొమ్ము ఇస్తుండగా.. తీసుకున్న అధికారులు నాచియప్పన్, అతడి డ్రైవర్ శంకర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ శస్త్ర చికిత్స విజయవంతం



మీడియాతో మాట్లాడుతున్న వైద్య బృందం

సాక్షి చెన్నై: చెన్నైలోని ఎంజీఎం కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని వైద్యుల బృందం 55 ఏళ్ల వ్యక్తికి అరుదైన బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్సను విజయవంతం చేశారు. దీంతో రోగికి పునర్జన్మ ప్రసాదించారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంజీఎం హెల్త్‌కేర్ సీఈఓ హరీష్ మణియన్, ఆంకాలజీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రాజా, హెమటో ఆంకాలజీ (బీఎంటీ) అసోసియేట్ కన్సల్‌టెంట్ డాక్టర్ ఎం. గోపీనాథన్ ఈ శస్త్ర చికిత్స వివరాలను తెలియజేశారు. హరీష్ మణియన్ మాట్లాడుతూ ఎంజీఎం కేన్సర్ సెంటర్ వైద్యులు డాక్టర్ ఎం. గోపీనాథన్ నేతృత్వంలోని నిపుణుల బృందం రిలాప్స్‌డ్ మల్టిపుల్ మైలోమాతో బాధపడుతున్న 55 ఏళ్ల రోగికి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ (బీఎంటీ) విజయవంతంగా నిర్వహించారన్నారు. ఈ రుగ్మత ప్లాస్మా కణాలను ప్రభావితం చేసే ఒకరమైన రక్త కేన్సర్‌గా పేర్కొన్నారు. కిమోథెరపీ చేయించుకుంటున్న ఈ రోగికి సాహసోపేతంగా వైద్యులు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతం చేశారని తెలిపారు. డాక్టర్ గోపీనాథన్ మాట్లాడుతూ బోన్ మ్యారో అనేది ఎముకల లోపల కనిపించే మృదువైన, మెత్తటి కణజాలం అని తెలిపారు. మైలోమా అనే వ్యాధితో బాధపడుతూ తమ ఆస్పత్రిలో చేరిన రోగికి మెడ ఎముక ఫ్రాక్చర్, మూత్రపిండాల పనితీరు తగ్గడం, దంతక్షయం వంటి అనేక సమస్యలు ఉన్నాయని వివరించారు. అన్ని రకాల చికిత్సను అందజేసి 14 రోజులు పాటు ఐసోలేషన్‌లో ఉంచామన్నారు. అదే సమయంలో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌ను చేపట్టామన్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

రూ.1.40 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం



యూనియన్ సమితి సమావేశం



సమావేశంలో పాల్గొన్న యూనియన్ కౌన్సిలర్లు

–పళ్లిపట్టు యూనియన్ సమితి సమావేశం

పళ్లిపట్టు: పళ్లిపట్టు యూనియన్‌లో రూ.1.40 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలుగా యూనియన్ సమితి సమావేశంలో ఆమోదం తెలిపారు. పళ్లిపట్టు యూనియన్ సమితి మందిరంలో చైర్‌పర్సన్ ఝాన్సీరాణి అధ్యక్షతన సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. బీడీఓ శాంతి, వైస్ చైర్మన్ భారతి సమక్షంలో నిర్వహించిన సమావేశంలో సమితి సభ్యులతో పాటు బీడీఓ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా చైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన తీర్మానాలకు సంబంధించి చర్చ జరిపారు. 15న ఫైనాన్స్ కమిషన్ నిధుల నుంచి రూ.75 లక్షలతో పాటు యూనియన్ జనరల్ నిధుల నుంచి రూ.65 లక్షలు, మొత్తం రూ. 1.40 కోట్ల వ్యయంతో 33 గ్రామ పంచాయతీల్లో తాగునీరు, రోడ్లు, మురుగునీటి కాలువలు, పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు, విద్యుద్దీపాలు సహా కనీస సదుపాయాలు కల్పించేందుకు సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే చైర్‌పర్సన్‌కు కొత్తగా జీపు కొనుగోలు చేసేందుకు జనరల్ నిధుల నుంచి రూ.12.78 లక్షలు కేటాయిస్తూ తీర్మానం ఆమోదించారు. కార్యక్రమంలో డిప్యూటీ బీడీఓ (నిర్వహణ) సెల్వం, యూనియన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోలీవుడ్ టాక్స్

శింబు చిత్ర యూనిట్‌కు దీపిక షాక్



దీపికాపడుకొనే

తమిళసినిమా: బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికాపడుకొనే. ఈమె ఇటీవల షారూఖ్‌ఖాన్‌తో జత కట్టిన పఠాన్ చిత్రంలో మోతాదుకు మించిన అందాలను ఆరబోసి కుర్రకారు మతులను పోగొట్టింది. ఈ సంచలన నటి ఇంతకుముందు కోలీవుడ్‌లో రజనీకాంత్‌కు జంటగా కోచ్చడయాన్ చిత్రంలో నటించిన విషయం తెలిసిందే. తాజాగా నటుడు శింబుకు జంటగా నటింపజేసే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. శింబు నటించిన తాజా చిత్రం పత్తుతల ఇటీవల తెరపైకి వచ్చి ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. కాగా ఆయన తన 48వ చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారు. విశేషం ఏమిటంటే ఈ చిత్రాన్ని నటుడు కమలహసన్ తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్‌నేషనల్ పతాకంపై నిర్మించనున్నారు. దీనికి కన్నుమ్ కన్నుమ్ కొల్లైయడిత్తాల్ చిత్రం ఫేమ్ దేసింగ్ పెరియసామి దర్శకత్వం వహించనున్నారు. దీన్ని పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇందులో కథానాయకిగా దీపికాపడుకొనేను ఎంపిక చేయాలని భావించినట్లు ప్రచారం జరిగింది. అందులో భాగంగా శింబు చిత్ర యూనిట్ ఆమెను సంప్రదించగా కథ నచ్చిందని, తాను నటించడానికి సిద్ధం అని చెప్పిందట. అయితే తన పారితోషికం మాత్రం రూ.30 కోట్లు డిమాండ్ చేసినట్లు సమాచారం. అంతే కాకుండా తాను షూటింగ్‌కు వస్తే ఫైవ్‌స్టార్ హోటల్లో బసచేస్తానని, ఆ హోటల్లో తాను బస చేసే అంతస్తు మొత్తం తనకే కేటాయించాలని కండిషన్ పెట్టి చిత్ర యూనిట్‌కు షాక్ ఇచ్చినట్లు సమాచారం. దీపికాపడుకొనే డిమాండ్ చేసిన పారితోషికం నయనతార పారితోషికం కంటే 3 రెట్లు ఎక్కువ కావడంతో ఇప్పుడు మరో హీరోయిన్‌ను ఎంపిక చేయాలనే ఆలోచనలో శింబు చిత్ర వర్గాలు ఉన్నట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే ఇందులో నిజమెంత తెలియాల్సి ఉందన్నది గమనార్హం.

పోర్ తొళిల్ ఫస్ట్‌లుక్ విడుదల



పోర్ తొళిల్ చిత్ర ఫస్ట్‌లుక్

తమిళసినిమా: నటుడు అశోక్‌కుమర్, శరత్‌కుమార్ హీరోలుగా నటిస్తున్న పోర్ తొళిల్ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్ర వర్గాలు బుధ వారం విడుదల చేశారు. ఈ 4 ఎక్స్‌పెరిమెంటల్, ఎప్రియస్ స్టూడియో సంస్థలతో కలిసి అప్లాస్ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం పోర్ తొళిల్. ఈ చిత్రం ద్వారా విఘ్నేశ్‌రాజా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నటి నిఖిలా విమల్ నాయకిగా నటిస్తున్న ఈ చిత్రం గురించి దర్శకుడు తెలుపుతూ వరుసగా జరుగుతున్న హత్యలతో హంతకులను పట్టుకోవడానికి ఒక ప్రత్యేక యువ పోలీస్ అధికారిని నియమిస్తారని, ఆయన ఒక సీనియర్ పోలీస్ అధికారితో కలిసి ఇన్వెస్టిగేషన్ జరిపి ఎలా పట్టుకున్నారు అన్నదే చిత్ర కథ అని చెప్పారు. యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ ఇతివృత్తంతో చిత్రం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుందని తెలిపారు. చిత్రం ప్రేక్షకులకు కచ్చితంగా వినూత్న అనుభూతిని కలిగిస్తుందనే అభిప్రాయాన్ని దర్శకుడు వ్యక్తం చేశారు.



నటి కాజల్ అగర్వాల్

విమర్శకులకు నా సమాధానం అదే..!

తమిళసినిమా: ఇతర హీరోయిన్లకు నటి కాజల్ అగర్వాల్‌కు కాస్త వ్యత్యాసం ఉంది. నటనను విపరీతంగా ప్రేమించే నటి ఈ బ్యూటీ. బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు ఆ తరువాత కోలీవుడ్‌కు పరిచయం అయిన కాజల్ ఈ మూడు భాషల్లోనూ నటిగా తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకుంది. ముఖ్యంగా తెలుగు, తమిళం భాషల్లో స్టార్ హీరోలతో జత కట్టి స్టార్‌డమ్‌ను తెచ్చుకుంది. అయితే అగ్రనటిగా రాణిస్తున్న సమయంలోనే ఎలాంటి హంగామా లేకుండా తను ప్రేమించిన వ్యక్తి గౌతమ్ కిచ్లును పెళ్లి చేసుకుని ఒక బిడ్డకు తల్లి కూడా అయ్యింది. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో కమలహాసన్‌తో కలిసి ఇండియన్– 2 చిత్రంలో నటిస్తోంది. అదే విధంగా తెలుగులో బాలకృష్ణ సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో తనపై వచ్చిన విమర్శలకు స్పందించిన కాజల్ అగర్వాల్ ఒక భేటీలో పేర్కొంటూ తాను కడుపుతో ఉన్నప్పుడు చాలా లావు అయ్యానంటూ కొందరు విమర్శించారని వాటిని తాను పట్టించుకోలేదని పేర్కొంది. అలాగే బిడ్డకు జన్మనిచ్చిన కొద్ది రోజులకే నటించడానికి సిద్ధం కావడంపై కూడా ఇష్టారాజ్యంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేసింది. తన కొడుకును ఉన్నతంగా తీర్చిదిద్ది గొప్ప తల్లిగా నిలిచి ఇలాంటి వారికి తగిన సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

సందేశాత్మక చిత్రంగా పోర్కుడి

తమిళసినిమా: 11 విలేజర్స్ ఫిలిం ప్రొడక్షన్ అధినేతలు ఆర్. త్యాగు, రోల్స్‌టన్ కరుప్పుసామి, శరవణన్ కరుప్పుసామి, యాదవ్ ఫిలిం ప్రొడక్షన్ అధినేత ఎస్ఎస్.నందకుమార్ కలిసి నిర్మిస్తున్న చిత్రం పోర్కుడి. ఆరుబాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఆర్ఎస్.కార్తీక్, ఆరాధ్య హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. షూటింగ్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ సహజత్వానికి దగ్గరగా నేటివిటీతో కూడిన కథా చిత్రాలను తమిళ ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారన్నారు. అలాంటి కథా చిత్రంగా పోర్కుడి ఉంటుందన్నారు. ఈ చిత్ర లోకేషన్ కోసం చాలా గాలించి చివరికి 2వేల కిలోమీటర్ల విశాలమైన ప్రాంతాన్ని ఎంపిక చేసి షూటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంతకుముందు ఎవరూ ఆ ప్రాంతంలో షూటింగ్ చేయలేదన్నారు. కారణం ఆ గ్రామ ప్రజలు చిత్రాల షూటింగ్‌కు అంగీకరించకపోవడమేనన్నారు. అలాంటిది తాము వారిని సమ్మతింపజేసి షూటింగ్ నిర్వహించినట్లు చెప్పారు. అయినప్పటికీ చాలా సమస్యలను ఎదురొడ్డి చిత్ర షూటింగ్‌ను నిర్వహించినట్లు చెప్పారు. చిత్రంలో నటీనటులందరూ చాలా బాగా నటించారన్నారు. ఇది ఏ మతాన్ని కించపరిచే విధంగా ఉండదని, మానవత్వాన్ని ఆవిష్కరించే మంచి సందేశంతో కూడిన కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. దీనికి రమేష్ ఏలుమలై ఛాయాగ్రహణం, సెంతమిళ్ సంగీతాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. చిత్ర విడుదల హక్కులను బాక్స్ కంపెనీ సంస్థ అధినేత విలియం అలెగ్జాండర్ పొందారని, త్వరలోనే చిత్ర విడుదల తేదీని వెల్లడించనున్నట్లు చెప్పారు.



ప్రతిభావంతులైన నటీనటుల ఎంపిక

తమిళసినిమా: మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్‌పీ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థల అధినేతలు యువరాజ్ గణేశన్, మహేశ్ రాజ్ పాసిలియన్, నజరేత్ పాసిలియన్ కలిసి నిర్మించిన చిత్రం గుడ్‌నైట్. నవ దర్శకుడు వినాయక్ చంద్రశేఖరన్ తెరకెక్కించిన ఈ చిత్రంలో నటడు మణికందన్, మీతా రఘునాథ, రమేష్ తిలక్, దర్శకుడు బాలాజీ శక్తివేల్, భగవతి పెరుమాళ్ ప్రధాన పాత్రలు పోషించారు. దీనికి శ్యాన్ రోల్డన్ సంగీతాన్ని, జయంత్ సేతుమాదవన్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం గత శుక్రవారం విడుదలై ప్రేక్షకుల ఆదరణతో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మంగళవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో థ్యాంక్స్ గివింగ్ మీట్‌ను నిర్వహించారు. దర్శకుడు బాలాజీ శక్తివేల్ మాట్లాడుతూ స్క్రిప్ట్‌లో రాసుకున్న సన్నివేశాలను వెండితెరపై భాషను, సంగీతాన్ని పర్ఫెక్ట్‌గా ఆవిష్కరించడం అంత సులభం కాదన్నారు. అలాంటిది దర్శకుడు వినాయగన్ చంద్రశేఖరన్ చాలా చక్కగా తెరకెక్కించడంలో సక్సెస్ అయ్యారన్నారు. ప్రతి కథా పాత్రకు కరెక్ట్‌గా నప్పే, ప్రతిభావంతులైన నటీనటులను ఎంపిక చేసుకోవడంలోనూ విజయం సాధించారని అన్నారు. గుడ్‌నైట్ అనే అంశాన్ని ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించగలమని చెప్పిన దర్శకుడిని నమ్మిన నిర్మాతలను అభినందిస్తున్నానని అన్నారు. చిత్ర దర్శకుడు వినాయగన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ నూతన దర్శకుడి చిత్రానికి పలు ఆటంకాలు, సమస్యలు ఎదురవుతాయని అంటారని, అయితే తనకు మాత్రం ఎలాంటి సమస్యలు ఎదురు కాలేదని, తాను అనుకున్నది అనుకున్నట్లు తెరకెక్కించడానికి పూర్తి స్వేచ్ఛను ఈ చిత్ర నిర్మాతలు కల్పించారని తెలిపారు.



గుడ్‌నైట్ చిత్ర యూనిట్

క్లుప్తంగా

ఏనుగు దాడిలో పరిశోధక విద్యార్థి దుర్మరణం

తిరువొత్తియూరు: అడవి ఏనుగు దాడిలో ఓ పరిశోధక విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ ఘటన కోవై సమీపంలో ఆనైకట్టి ప్రాంతంలో చోటుచేసుకుంది. రాజస్థాన్ రాష్ట్రం సవయంతోపురుకు చెందిన విశాల్ శ్రీమల్ (23). ఇతను కోవై అటవీప్రాంతం ఆనైకట్టులో వున్న సలీం అలీ పక్షుల పరిశోధక కేంద్రంలో పరిశోధక విద్యార్థి. ఇతను సంఘటన జరిగిన రోజున ఆ ప్రాంతంలో విధుల్లో ఉండగా అటవిఏనుగు దాడి చేసింది. దాడిలో తీవ్రంగా గాయపడిన అతనిని కోవై ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

విషవాయువు సోకి కార్మికుడు మృతి

అన్నానగర్: విషవాయువు సోకి కార్మికుడు మృతిచెందాడు. రాణిపేట సిప్‌కాట్ లెదర్ శుద్ధికర్మాగారంలో బుధవారం ఉదయం వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా విషవాయువు సోకి ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. రాణిపేట్టై సిప్‌కాట్‌లోని లెదర్ పరిశ్రమలో చాలా మంది పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం నలుగురు కార్మికులు పరిశ్రమలోని వ్యర్థ నీటి వాటర్ ట్యాంక్‌లో దిగి శుభ్రం చేస్తున్నారు. ఆ సమయంలో వేలూరులోని సతువ్పరి ప్రాంతానికి చెందిన తమిళ్ సెల్వన్ విషవాయువు సోకి ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు అస్వస్థతకు గురై ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సిప్‌కాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీకై సెక్యూరిటీ గార్డు..

అన్నానగర్: చెన్నై సమీపంలోని ఓ ఇంట్లో వంటగ్యాస్ సిలిండర్ లీకై మంటలు ఏర్పడిన ప్రమాదంలో ఓ సెక్యూరిటీగార్డు మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఇంటి సమీపంలో ఉన్న ఆటోతో పాటు పలు గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. చెన్నై సమీపంలోని ఆవడి తమిళనాడు హౌసింగ్ ప్లాట్ బోర్డు ఫ్లాట్ ప్రాంతానికి చెందిన గోపాల్ (68). అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ. ఇతను అదే ప్రాంతంలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గోపాల్ మంగళవారం సాయంత్రం వంట చేస్తుండగా గ్యాస్ లీకై సిలిండర్ పేలి గోపాల్‌కు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో సమీపంలో పార్క్ చేసిన ఆటో కూడా మంటల్లో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గోపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఆవడి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన గోపాల్‌ను చెన్నైలోని కీల్పాకం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆవడి పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు..

అన్నానగర్: తిరుత్తరపూండి సమీపంలో మంగళవారం రాత్రి ట్రాక్టర్, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. వివరాలు.. తిరువారూరు జిల్లా తిరుతురపూండి సమీపంలోని వరంబియం నడుతేరుకు చెందిన వసంత్ (21). ఇతని స్నేహితులు అదే పట్టణం కీళతేరుకు చెందిన దినేష్ కుమార్ (21), పరమేశ్వరన్ (21), పల్లంగోల్‌లోని కీళతేరుకు చెందిన అమూల్‌రాజ్ తిరుపూర్‌లోని బనియన్ కంపెనీలో పనిచేస్తున్నారు. నలుగురూ సెలవుల కోసం ఇటీవల తిరుపూర్ నుంచి స్వగ్రామానికి వచ్చారు. మంగళవారం రాత్రి ఆ నలుగురు తిరుత్తరపూండి నుంచి ఒకే బైక్‌లో పల్లంగోవిల్ వైపు బయలుదేరారు. పల్లంగోవిల్ సమీపంలోకి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో వసంత్, దినేష్ కుమార్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన పరమేశ్వరన్ తిరుతురపుండి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అమూల్‌రాజ్ సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ప్రమాదంపై తిరుతురపుండి డీఎస్పీ సోమసుందరం ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోవడంతో క్యూలైన్ కృష్ణ తేజ గెస్ట్ హౌస్ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 77,436 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,980 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ కానుకల రూపంలో రూ.3.77 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

రోడ్డుప్రమాదంలో ఎస్ఐ మృతి

అన్నానగర్: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూసి వస్తూ గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ ఎస్ఐ మృతిచెందాడు. కడలూరు జిల్లా మంజ కొల్లై ప్రాంతానికి చెందిన వెంకటేషన్ (46)ఙ ఇతను టీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ. చెన్నైలోని ఆలందూరులో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో కుటుంబంతో ఉంటున్నాడు. ఇతని భార్య పద్మ(40). వీరికి ధర్మ (17), హరీష్ (7) ఇద్దరు కుమారులు. వెంకటేషన్ తల్లి అనారోగ్యంతో ఉండడంతో వెంకటేషన్ కడలూరుకు వెళ్లి తల్లిని చూసి బైకుపై చెన్నై బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున చెంగల్పట్టు బైపాస్ రోడ్డు వద్ద వెళుతుండగా గుర్తుతెలియని వాహనం బైకును ఢీకొంది. వెంకటేషన్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ధన్వంతరి పీఠానికి విగ్రహాలు



విగ్రహాలకు పూజలు చేస్తున్న పీఠాధిపతి మురళీధర స్వామిజీ

వేలూరు: రాణిపేట జిల్లా వాలాజ సమీపంలోని ధన్వంతరి ఆరోగ్యపీఠానికి బుధవారం ఉదయం తాయ్ ముకాంబికై, వీరభద్రుడి విగ్రహాలు వచ్చి చేరాయి. పీఠంలో ఇప్పటికే 90 సన్నిధులను ప్రతిష్ఠించి పీఠాధిపతి డాక్టర్ మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు లోకక్షేమం కోరుతూ ప్రతిరోజూ మహాయాగ పూజలు చేస్తున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం మరో రెండు సన్నిధులను ప్రతిష్ఠించేందుకు శిల్పి లోకనాతన్ రూపొందించిన ఐదు అడుగుల ముకాంబిగై, వీరభద్రుడి రాతి విగ్రహాలను తయారు చేశారు. ఈ విగ్రహాలు ఉదయం 10 గంటలకు పీఠానికి చేరాయి. దీంతో స్వామి వారి విగ్రహాలకు పీఠాధిపతి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి పుష్పాలంకరణలు చేసి దీపారాధన పూజలు చేశారు. అనంతరం ధన్వంతరి మహాహోమం, 108 కలశ తిరుమంజనం చేశారు. దీపారాధన పూజల్లో పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ ఎం బాలం ఆర్ సెల్వం పాల్గొన్నారు. అనంతరం ధన్వంతరి పెరుమాళ్‌ను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయంలో పూర్ణ కుంభస్వాగతం పలికారు. ఈ విగ్రహాలను జూన్ 9న పీఠంలో ప్రతిష్ఠించనున్నట్లు పీఠాధిపతి తెలిపారు. వాలాజ కౌన్సిలర్ మురళి, ఉప సర్పంచ్ మీనా పాల్గొన్నారు.

హత్య కేసులో దంపతుల అరెస్ట్

అన్నానగర్: తేని సమీపంలో కూతురిని ప్రేమించిన ప్లస్‌టూ విద్యార్థిని హత్య చేసిన దంపతులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తేని సమీపంలోని వీరూచిన్నమ్మాల్‌పురానికి చెందిన శరవణన్. ఇతని కుమారుడు కమలేశ్వరన్ (17). ఇటీవల జరిగిన ప్లస్‌టూ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. గత 14వ తేదీ రాత్రి ఇంటికి కొద్ది దూరంలోనే కమలేశ్వరన్ గొంతుకోసిన స్థితిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఫిర్యాదు మేరకు పళనిశెట్టిపట్టి పోలీసులు విచారణ చేస్తూ వచ్చారు. ఇందులో కమలేశ్వరన్ అనే విద్యార్థి 2021లో పళని చెట్టిపట్టికి చెందిన ఓ బాలిక ప్రేమించుకుంటూ వచ్చారు. విషయం తెలిసి బాలిక తల్లిదండ్రులు కమలేశ్వరన్‌ను మందలించారు. అయినా కమలేశ్వరన్, బాలిక కలుస్తూనే ఉండడంతో కోపోద్రిక్తులైన బాలిక తల్లిదండ్రులు కమలేశ్వరన్‌ను గొంతు కోసి హత్య చేసినట్లు తెలిసింది. పళనిశెట్టిపట్టి పోలీసులు దంపతులను అరెస్ట్ చేసి విచారన చేస్తున్నారు.

పాతకక్షలతో రౌడీపై నాటుబాంబుతో దాడి

తిరువొత్తియూరు: పాతకక్షలతో విరుగంబాక్కంలో ఓ రౌడీపై నాటుబాంబులతో నలుగురు దుండగులు దాడి చేశారు. చెన్నై మేట్టుకుప్పం పెరియార్ నగర్, కామరాజ వీధికి చెందిన దీనా అలియాస్ గోపాల కృష్ణన్ (22) కార్పెంటర్. ఇతనిపై పలు కేసులున్నాయి. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో ఇతను విరుగంబాక్కం ఏరిక్కరై వీధి వద్ద ఉన్న పంక్చర్ దుకాణం ముందు నిలబడి నీళ్లు తాగుతున్న సమయంలో అక్కడికి బైకులో వచ్చిన నలుగురు వ్యక్తులు గోపాలకృష్ణన్‌పై నాటుబాంబు వేశారు. అదృష్టవశాత్తు దీనా తప్పించుకున్నాడు. ప్రజలు దుండగులను అడ్డుకోవడంతో వారు పారిపోయారు. దీనిపై దీనా విరుగంబాక్కం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ థామ్సన్ సేవియర్ నేతృత్వంలో పోలీసులు బృందాన్ని ఏర్పాటు చేసి సీసీటీవీ కెమెరాల ఆధారంగా విచారణ చేస్తున్నారు. నాటుబాంబుతో దాడి చేసిన వారు ఆల్వార్ తిరునగర్ ప్రాంతాన్ని చెందిన సంజయ్ (19), చిన్నతంబి (21), ఈశ్వరన్న (21), అరుణ్ (18) అని విచారణలో తెలిసింది. నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రైతు హత్య కేసులో 9 మంది నిందితుల అరెస్ట్



అరెస్టయిన కన్నన్ బంధువులు

అన్నానగర్: చానార్ పట్టి సమీపంలో రైతు హత్య కేసులో నిందితులైన 9 మంది బంధువులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలు.. దిండుక్కల్ జిల్లా చానార్‌పట్టి సమీపంలోని సకిలియాం కొడాయికి చెందిన కన్నన్ (55) రైతు. ఇతను గత 14వ తేదీన ఆ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అతని శరీరంపై ఉన్న గాయాలుండడంతో విచారణ చేపట్టారు. ఇందులో ఆస్తి గొడవల కారణంగా కన్నన్‌ను బంధువులే హత్య చేసినట్లు తేలింది. కన్నన్ అక్క అళగి (58), ఆమె భర్త చిన్నకలై (60), వారి కుమారుడు అళగరస్వామి (38), కన్నన్ తమ్ముడు మురుగన్ (48), అతని భార్య వల్లియమ్మాళ్ (38), కుమారులు సతీష్‌కుమార్ (25), గుణ (19), కన్నన్ మరో సోదరి నాచమ్మాళ్ (60), ఈమె కుమారుడు వెలిదిస్వామి (35) ఆస్తులకు సంబంధించి చర్చిస్తుండగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వారు కన్నన్‌ను రాయితో కొట్టడంతో అతడు చనిపోయాడు. దీంతో వారు తోటలో చెట్టుకు ఉరివేసి.. ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఈమేరకు బుధవారం నిందితులందరినీ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

తిరువొత్తియూరు: చెన్నై తిరువొత్తియూరులో సముద్రంలో స్నానానికి దిగి గల్లంతైన విద్యార్థి మృతదేహం ఒడ్డుకు చేరింది. చెన్నై తిరువొత్తియూరుకు చెందిన హరీష్ (16) ప్రైవేట్ పాఠశాలలో పది చదువుతున్నాడు. ఇతని అన్న చంద్రు (20) కళాశాలలో చదువుతున్నాడు. వీరి స్నేహితుడు అదే ప్రాంతానికి చెందిన కళాశాల విద్యార్థి శ్రీకాంత్ (19). ఈ ముగ్గురు మంగళవారం సాయంత్రం తాంగల్ ప్రాంతంలో సముద్రంలో స్నానానికి దిగారు. ఆ సమయంలో ముగ్గురు సముద్రంలో గల్లంతయ్యారు. గమనించిన జాలర్లు హరీష్, శ్రీకాంత్ ఇద్దరినీ సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. తీవ్ర అస్వస్థతకు గురైన వారిని స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఇద్దరు మృతిచెందినట్టు తెలిపారు. ఈ క్రమంలో సముద్రంలో గల్లంతైన మరో విద్యార్థి చంద్రు కోసం అగ్నిమాపక సిబ్బంది గాలించినీ ఆచూకీ తెలియరాలేదు. ఈ క్రమంలో చెన్నై తిరువొత్తియూరు కుప్పం వద్ద బుధవారం ఉదయం చంద్రు మృతదేహం ఒడ్డుకు చేరింది. మృతదేహాన్ని పోలీసులు శవ పరీక్ష కోసం స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



ఎండ తీవ్రతతో బోసిపోయిన కుశస్థలి నది వంతెన

తిరుత్తణిలో భగభగలు

తిరుత్తణి: వేసవి ఎండల తీవ్రం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో జనం విలవిలలాడుతున్నారు. ఇళ్ల నుంచి వెలుపలికి వచ్చేందుకు సైతం ఆందోళన చెందుతున్నారు. దీంతో ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. రాష్ట్రంలో వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతంగా గతకొద్ది సంవత్సరాలుగా తిరుత్తణి రికార్డులెక్కుతోంది. ప్రధానంగా తిరుత్తణిలోని కొండలు, చెట్లు నరికివేతకు గురికావడంతో ఉష్ణోగ్రత శాతం విపరీతంగా పెరుగుతోంది. ఈ క్రమంలో వేసవి ఎండల తీవ్రత గత కొద్ది రోజులుగా వంద డిగ్రీలకు పైబడి నిప్పుల వర్షంతో పగటిపూట ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో రాత్రి సమయాల్లో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రద్దీగా వుండే మార్కెట్లు, రోడ్లు సైతం ఉదయం పది గంటలకే బోసిపోతున్నాయి. ప్రజలు ఎండల తీవ్రత నుంచి కాస్తా ఉపవమనం పొందేందుకు పండ్ల జూసులు తాగేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు.

కుశస్థలిలో మునిగి పశువుల కాపరి మృతి



పూంగావనం (ఫైల్)

తిరువళ్లూరు: కుశస్థలిని దాటే క్రమంలో నీటిలో మునిగి ఓ పశువుల కాపరి మృతి చెందిన ఘటన పత్రపెరంబదూరులో విషాదం నింపింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పత్రపెరంబదూరు గ్రామానికి చెందిన పాడిరైతు పూంగావనం (61). ఇతను మంగళవారం ఉదయం పశువులను మేపడానికి పత్రపెరంబదూరులోని కుశస్థలి నదీ పరివాహక ప్రాంతానికి వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే సాయంత్రం ఇంటి వద్దకు పశువులు వచ్చినా పూంగావనం రాకపోవడంతో రాత్రంతా గాలించారు. అయినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పూండి రిజర్వాయర్‌కు సమీపంలో ఓ మృతదేహం తేలియాడుతున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో మృతదేహం పూంగవనంది తేలింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాటిల్‌తో పొడిచి యువకుడు హత్య

తిరువొత్తియూరు: వేడచందూర్ సమీపంలో బాటిల్‌తో పొడిచి ఓ యువకుడిని హత్య చేసిన పెయింటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దిండుగల్ జిల్లా దేవనాయక్ పట్టికి చెందిన ఉషారాణి (37). ఈమె గోవాలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో నర్సు. ఈమె భర్త మృతి చెందాడు. ఈ క్రమంలో అదే ఆస్పత్రిలో క్యాంటిన్లో పనిచేస్తున్న కడలూరుకు చెందిన గణేశమూర్తి (23)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరిద్దరు మదురైకి వెళ్లి నివాసం ఉంటున్నారు ఈ క్రమంలో గణేష్‌మూర్తికి మద్యానికి బానిసై ఉషారాణిని వేధించేవాడు. దీంతో ఉషారాణి పుట్టినిల్లు దేవనాయకన్‌పట్టికి వెళ్లింది. అక్కడ విడాకులు తీసుకుని ఉన్న తన చెల్లెలు జ్యోతిలక్ష్మి (29) ప్రియుడు కాళిదాసు (29)కి జరిగిన విషయం చెప్పింది. దీంతో సోమవారం ఉషారాణిని కాళిదాసు దేవ నాయక్కన్‌పట్టికి వచ్చి తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. సరిగ్గా అదే సమయంలో గణేష్ మూర్తి కూడా అక్కడికి రావడంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన కాళిదాసు బాటిల్ పగులగొట్టి గణేష్‌మూర్తిపై దాడి చేసి పారిపోయాడు. గణేష్ మూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు పారిపోయిన కాళిదాసుని మంగళవారం మధ్యాహ్నం విట్టాల్ నాయకన్ బస్టాండ్‌లో అరెస్టు చేశారు.

భార్య విడిపోవడంతో భర్త బలవన్మరణం

అన్నానగర్: మారండఅల్లి సమీపంలో భార్య విడిపోవడంతో మనస్తాపం చెందిన భర్త బుధవారం ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ధర్మపురి జిల్లా మారండఅల్లి సమీపంలోని బెల్లంబట్టి గ్రామానికి చెందిన మణికంఠన్ (26) లారీ డ్రైవర్. ఇతని భార్య కవిప్రియ. వీరికి మూడేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో కవిప్రియ పిల్లలను తీసుకుని నార్తంపట్టిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో కాపురానికి రావాలని మణికంఠన్ భార్యను పిలిచాడు. కవిప్రియ నిరాకరించడంతో మనస్తాపానికి గురైన మణికంఠన్ బుధవారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మారండఅల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకోడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి తిరుపతిలో ట్రాఫిక్ మళ్లింపు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంలో శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా గురువారం నుంచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయని, ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ నుంచి రిలయన్స్ వైపు వచ్చే మార్గంలో నిర్మాణం సాగుతోందన్నారు. ఈ మేరకు వాహనాల రాకపోకలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

- శ్రీకాళహస్తి వైపు నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు రేణిగుంట రమణ విలాస్ కూడలి, కరకంబాడి రైల్వే అండర్ బ్రిడ్జ్ ద్వారా మంగళం మీదుగా గెస్ట్ లైన్ హోటల్ వద్ద చింతల చేను రోడ్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్‌కు రావాలి.
- చెన్నై నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు గాజులమండ్యం జంక్షన్ వద్ద నుంచి రమణ విలాస్ కూడలి, కరకంబాడి రైల్వే అండర్ బ్రిడ్జ్ ద్వారా మంగళం మీదుగా గెస్ట్ లైన్ హోటల్ వద్ద చింతల చేను రోడ్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలి.
- తిరుచానూరు వైపు నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు మామిడికాయల మార్కెట్ వై జంక్షన్ నుంచి లక్ష్మీపురం జంక్షన్, రామానుజ సర్కిల్ వద్ద కుడివైపుగా వెళ్లి హీరో హోండా షోరూమ్ ఎదురుగా ఉన్న రైల్వే గేట్ దాటుకుని చింతల చేను రోడ్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలి..
- ఆర్టీసీ బస్టాండ్ నుంచి శ్రీకాళహస్తి, చెన్నై వెళ్లే వాహనాలు లీలామహల్ జంక్షన్ మీదుగా కరకంబాడి అండర్ బ్రిడ్జ్ వద్ద ఎడమ వైపు రైల్వే గేట్ మీదుగా అనుమతిస్తారు.

ఊటీలో కర్ణాటక పార్కుకు జరిమానా

కొరుక్కుపేట: నిషేధిత ప్లాస్టిక్ వాడకంతో ఊటీలో ఉన్న కర్ణాటక పార్కుకు జరిమానా విధించారు. పర్యావరణ పరిరక్షణ కోసం నీలగిరి జిల్లాలో 20 ఏళ్ల క్రితమే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించారు. ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా 2019 నుంచి ఇతర జిల్లాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధం ఉండడంతో వాటి వినియోగం పూర్తిగా ఆగిపోయింది. ఈ పరిస్థితుల్లో ఊటీలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు వాడే వారిపై మున్సిపల్ పాలక వర్గం జరిమానా విధిస్తోంది. ఇదిలా ఉండగా, ఊటీకి సమీపంలోని తిటుక్కల్ జిల్లాలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన పార్క్ ఆవరణలో భారీ సంఖ్యలో నిషేధిత ప్లాస్టిక్ బాటిళ్లు, పేపర్ కప్పుల అధికంగా ఉన్నాయి. దీంతో ఊటీ మున్సిపాలిటీ సిబ్బంది అక్కడకి చేరుకుని మంగళవారం రూ.10 వేల జరిమానా విధించారు.

రెండవ రోజూ ఆందోళన

కొరుక్కుపేట: చెన్నై కొడుంగైయూర్, ఎంకేబీ నగర్, పులియంతోపు, అంబూత్తూరు సహా పలుచోట్ల గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పలుచోట్ల ప్రజలు రోడ్డెక్కారు. ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అళగిరిసామి వీధి, కాకంజి నగర్, సెంబియం పోలీస్‌స్టేషన్ పరిధిలో, తిరువికానగర్, పెరియార్ నగర్, పన్నీర్ సెల్వం వీధులకు చెందిన వారు మంగళవారం రాత్రి 10 గంటల నుంచి మాధవరం హైవే ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేశారు. తిరువికానగర్, సెంబియం పోలీసులు సంఘటన ప్రాంతాలకు వెళ్లి ఆందోళనకారులతో చర్చలు జరిపి విరమింపజేశారు. అదేవిధంగా పీవీ కాలనీ 5వ వీధి నుంచి 18వ వీధి వరకు, భారతి నగర్ 1వ వీధి నుంచి 5వ వీధి వరకు విద్యుత్ లేకపోవడంతో గత రాత్రి 10 గంటల నుంచి ఎరుక్కంచెరి హైవేపై విద్యుత్ బోర్డు కార్యాలయం ఎదుట బాధితులు నిరసన తెలిపి రాకపోకలకు అంతరాయం కలిగించారు. కొడంగైయూర్ సీఐ శరవణన్ నేతృత్వంలో పోలీసులు వెళ్లి విద్యుత్ బోర్డు ఉద్యోగులను పిలిపించి సమస్యను పరిష్కరించేందుకు చర్చలు జరిపారు. తిరువిక్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శక్తివేల్ నగర్ 1వ వీధి నుంచి 5వ వీధి వరకు గత రాత్రి 11 గంటల నుంచి కరెంటు లేకపోవడంతో 30 మందికి పైగా పెరియార్ నగర్ విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడించి, పేపర్ మిల్స్ రోడ్డు ప్రాంతంలో రాస్తారోకో నిర్వహించారు. రెండు రోజులు కరెంట్ కోత నేపథ్యంలో రెండవ రోజుకూడా పలు ప్రాంతాల్లో సమ్మెను కొనసాగించారు.

150 గ్రాముల బంగారం చోరీ

అన్నానగర్: కోయంబత్తూరులోని ఓ వ్యాపారి ఇంట్లో బుధవారం రూ.12.5 లక్షల విలువైన 150 గ్రాముల బంగారు కడ్డీలు చోరీకి గురయ్యాయి. చోరీ చేసిన పనిమనిషిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోయంబత్తూరులోని ఆర్ఎస్ పురం సిరియన్ చర్చ్ రోడ్‌కు చెందిన పాన్‌మురుగన్ (46) వ్యాపారి. ఇతను ఓ పని విషయంగా ఊరెళ్లి బుధవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పుడు అతని ఇంటి బీరువాలో ఉంచిన రూ.12.5 లక్షల విలువైన 150 గ్రాముల బంగారు కడ్డీలు మాయమయ్యాయి. దీంతో షాక్ తిన్న అతను అనుమానంతో ఇంటి పనిమనిషిపై ఆర్ఎస్ పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు, వేలిముద్రల నిపుణులు సంఘటన జరిగిన ఇంటికి వెళ్లి సోదాలు నిర్వహించారు. అక్కడున్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. విచారణలో బంగారు కడ్డీలను పనిమనిషి ఒండిపుత్తూరు కామచ్చిపురం ముత్తుసామి చెట్టి వీధికి చెందిన శరవణన్ భార్య జ్యోతి (47) చోరీ చేసినట్లు తెలిసింది. పోలీసులు మహిళను అరెస్టు చేసి 93 గ్రాముల బంగారు కడ్డీని స్వాధీనం చేసుకున్నారు.

అవార్డు ప్రదానం



సీమాట్స్ ఇంజినీరింగ్‌కు ఐఈటీ – యూకే అక్రిడిటేషన్ సర్టిఫికెట్ అవార్డు దక్కింది. అకడమిక్ అనుబంధ హోదాను పునరుద్ధరించే విధంగా అందజేసిన ఈ అవార్డును బుధవారం యూకేకు చెందిన డేనియల్ కాంటీ చేతుల మీదుగా సీమాట్స్ డైరెక్టర్ డాక్టర్ రమ్య దీపక్ అందుకున్నారు.

–సాక్షి, చెన్నై

తల్లిదండ్రులు మరణించారనే ఆవేదనతో..

- విద్యార్థి ఆత్మహత్య

అన్నానగర్: పట్టుకోట్టై సమీపంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. తంజావూరు జిల్లా వేపన్‌కాడు గ్రామానికి చెందిన పాండియన్ రైతు. అనారోగ్య కారణాలతో అతను, అతని భార్య ఇటీవల మరణించారు. వీరి కుమారులు వీర అరసన్ (26), కేశవరామన్ (24) అదే పట్టణంలోని మేనమామ ఇంట్లో ఉంటున్నారు. వీర అరసన్ దిండుక్కల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. తల్లిదండ్రుల మృతితో తీవ్ర మనస్తాపానికి గురైన వీర అరసన్ బుధవారం చెదపురుగుల మందు (విషం) తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని స్థానికులు తంజావూరు మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం వీర అరసన్ మృతి చెందాడు. పట్టుకోట్టై తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య



ఇళవరసి(ఫైల్)

వేలూరు: భర్త మృతిచెందిన చెరువులోనే దూకి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని పిల్లయార్ ఆలయ చెరువు మునప్రాంతానికి చెందిన రంజిత్‌కుమార్(34) లారీ బాడి బిల్డర్. ఇతని భార్య ఇళవరసి(31). వీరికి ధనుష్(11), శివకార్తిక్(9) ఉన్నారు. రంజిత్‌కుమార్ ఈనెల 14న స్నేహితులతో కలిసి కాట్పాడి సమీపంలోని చెరువులో స్నానానికి వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. భర్త మృతి చెందడంతో మనోవేదనతో బాధపడుతూ ఉండేది. మంగళవారం రాత్రి ఇళవరసి ఇంటిలో అందరూ భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి నిద్ర లేచిన ఇళవరసి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం భర్త మృతిచెందిన చెరువులో ఇళవరసి శవంగా తేలింది. స్థానికులు కాట్పాడి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి విచారణ చేపట్టారు. భర్త మృతిచెందిన మనోవేదనతో భర్త మృతి చెందిన చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. అమ్మ, నాన్న ఇద్దరూ ఒకే వారంలో మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగలడంతో బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

నీట్ విద్యార్థి..

అన్నానగర్: నాట్రంపల్లి సమీపంలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుపత్తూరు జిల్లా నాట్రంపల్లి పక్కన వెల్లనూర్‌కు చెందిన సెంథిల్‌కుమార్. ఇతని కుమారు డు పరమేశ్వరన్(17). ఇటీవల విడుదలైన ప్లస్‌టూ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గత వారం నీట్ పరీక్ష రాశాడు. అయితే నీట్ పరీక్షలో తక్కువ మార్కులు వస్తాయని పరీక్షరాసిన రోజు నుంచి తల్లిదండ్రులకు, స్నేహితులకు చెపుతూనే వచ్చాడు. ఈ స్థితిలో బుధవారం పరమేశ్వరన్ ఇంటి మిద్దెపైన గదిలోకి వెళ్లాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు పైకి వెళ్లి చూడగా పరమేశ్వరన్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండడం చూసి షాక్‌కు గురయ్యారు. ఇరుగుపొరుగు సాయంతో విద్యార్థిని కిందికి దించి నాట్రంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరమేశ్వరన్ అప్పటికే మృతిచెందినట్లు వారు తెలిపారు. నాట్రంపల్లి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్కులు తగ్గాయని..



అనిత (ఫైల్)

తిరువళ్లూరు: ప్లస్‌టూ పరీక్షల్లో మార్కులు తగ్గడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరువళ్లూరు జిల్లా పుట్లూరులో చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లా పుట్లూరు రామాపురం ప్రాంతానికి చెందిన రమేష్. ఇతను కాకలూరు సిప్‌కాట్‌లోని పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇతడి కుమార్తె, అనిత(17) తిరువళ్లూరులోని ప్రైవేట్ పాఠశాలలో ప్లస్‌టూ చదివింది. ప్లస్‌టూ ఫలితాలు గతవారం విడుదలయ్యాయి. కాగా అనిత 600 మార్కులకుగాను 435 మార్కులు సాధించింది. పదిలో మంచి మార్కులు సాధించిన అనిత, ప్లస్‌టూలో బాగా చదివినా ఆశించిన మార్కులు రాకపోవడంతో మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న అనిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికొచ్చిన అనిత తల్లిదండ్రులు తమ కుమార్తె శవంగా వేలాడుతూ వుండడాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ ఉద్యోగినంటూ కారు చోరీ

తిరువొత్తియూరు: మెరీనా సముద్రతీరానికి వచ్చిన ఉపాధ్యాయిని వద్ద కార్పొరేషన్ పార్కింగ్ ఉద్యోగినంటూ తాళం తీసుకొని కారును చోరీ చేసిన గుర్తుతెలియని వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. కన్యాకుమారికి చెందిన సుమిత్ర ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఈనెల 15 తేదీన క్రితం ఈమె చెన్నై సమీపంలోని రెడ్‌హిల్స్ ప్రాంతంలో ఉన్న బంధువుల ఇంటికి తన కారులో వచ్చారు. తరువాత బంధువుతో కలిసి మెరీనా సముద్ర తీరానికి వెళ్లారు. వేసవి సెలవుల కారణంగా సాధారణం కన్నా అక్కడ ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు ఉన్నారు. సర్వీస్ రోడ్డు పూర్తిగా ఆ పర్యాటకు వాహనాలతో నిండిపోయింది. దీంతో ఉపాధ్యాయిని సుమిత్ర తన కారును నిలిపేందుకు యత్నిస్తుండగా.. అక్కడికి వచ్చి న ఓ యువకుడు తాను చెన్నై కార్పొరేషన్ పార్కింగ్ ఉద్యోగినంటూ తాళం తీసుకుని కారుతో ఉడాయించాడు. దీంతో ఆమె అన్నా సమాధి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరిట రూ.4.50 లక్షల మోసం

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లాలో ఉద్యోగం పేరిట ఓ యువకుడు నుంచి రూ.4.5 లక్షలు తీసుకుని పారిపోయిన మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. ఈరోడ్డు జిల్లా అప్పకూడల్ ప్రాంతానికి చెందిన పూవలగన్ (37) ఎంఏ గ్రాడ్యుయేట్. ఇతడు చేనేత పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇతను మంగళవారం ఈరోడ్డు ఎస్పీ కార్యాలయంలో ఓ ఫిర్యాదు చేశాడు. అందులో ప్రభుత్వ ఉద్యోగం పేరుతో అన్బానందన్ అతని భార్య కోకిల బాల్ తన వద్ద నుంచి రూ. 4.5 లక్షలు నగదు తీసుకొని మోసం చేసినట్లు పేర్కొన్నాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిర్రున మీటర్లు



గుబులు పుట్టిస్తోన్న ఎండ వేడి / ఆగకుండా తిరుగుతున్న ఏసీలు..ఫ్యాన్లు / గతేడాదితో పోల్చితే భారీగా వినియోగం / బిల్లులు పెరుగుతున్నా లెక్క చేయని జనం / విద్యుత్ వాడకంలో కాకినాడ జిల్లా ప్రథమం

సాక్షిప్రతినిధి,కాకినాడ: వేసవి ప్రభావం విద్యుత్ వినియోగంపై పడుతోంది. ప్రతి ఇంటా విద్యుత్ మీటర్ గిర్రున తిరుగుతోంది. నెల బిల్లులు రెట్టింపు అవుతున్నాయి. అయినా జనం ఎడాపెడా కరెంటు వాడుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈనెలలో వాడకం బాగా పెరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గృహ విద్యుత్ వినియోగం 50శాతం పైనే ఉందని ఏపీఈపీడీసీఎల్ వర్గాలు లెక్కలేస్తున్నాయి. గడచిన రెండు వారాలుగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఫలితంగా ఏసీల వినియోగం పెరిగింది.ప్రస్తుతం రోజూ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యుత్ లేకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, రాత్రి 8 నుంచి తెల్లవారేవరకు ఏసీలు వాడుతున్నారు. గడచిన ఏప్రిల్‌లో మధ్యాహ్నం ఒక గంట, రాత్రి రెండు, మూడు గంటలు మాత్రమే ఏసీలు, ఫ్యాన్‌లు వినియోగించే వారు. ఇప్పుడు ఏసీలతో పాటు ఫ్యాన్‌ల వినియోగం కూడా మూడొంతులు పెరిగిపోయింది. మార్చి, ఏప్రిల్‌తో పోలిస్తే మే వచ్చేసరికి ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. వారం రోజులుగా మరింత తీవ్రంగా ఉంటున్నాయి. అందుకు తగ్గట్టుగానే విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోతోంది.

ఈనెల గుండె గు'భిల్లు'

ఉదాహరణకు రెండు ఫ్యాన్‌లు, ఒక ఏసీ, మూడు ట్యూబులైట్‌లు ఉన్న ఒక ఎగువ మధ్యతరగతి కుటుంబ విద్యుత్ వినియోగం ఏప్రిల్‌లో సగటున 185 యూనిట్లు నమోదైంది. అంటే రూ.800 బిల్లు చెల్లించాల్సి వచ్చింది. ఈ నెలలో అదే తరహా కుటుంబ బిల్లు చూస్తే 300 యూనిట్లు దాటిపోయింది. అంటే రూ.1500 చెల్లించాలి. ఇలా ప్రతి కుటుంబంలో స్థాయిని బట్టి వినియోగం పెరిగింది. గతేడాది మేతో పోలిస్తే ఈ ఏడాది వినియోగంలో భారీగా పెరిగింది. గతేడాది మే 10న 11.575 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను వాడారు. తాజాగా ఈ నెల 10న సుమారు ఐదారు మిలియన్ యూనిట్లు అదనంగా వాడారని తేలింది. ఇలా ఈ నెలలో 10 నుంచి 16 వరకు పరిశీలిస్తే గతేడాది కంటే ఐదారు మిలియన్ యూనిట్లు అదనంగా వాడినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉమ్మడి తూర్పు(నిడదవోలు సబ్ డివిజన్ మినహా)లో..

మొత్తం విద్యుత్ కనెక్షన్లు:	19,000
గృహ విద్యుత్ కనెక్షన్లు:	16,23,138
వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు:	52,000
ఆక్వా చెరువులకు కనెక్షన్లు:	11,000

గృహవినియోగం 50శాతం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జిల్లా విద్యుత్ వాడకంలో (జగ్గంపేట విద్యుత్ డివిజన్‌తో కలిపి) 45శాతంతో మొదటి స్థానంలో ఉంది. కాకినాడ నగరంతో పాటు మెట్ట ప్రాంత మండలాల్లో అత్యధికంగా కరెంటు వాడుతున్నారు. రామచంద్రాపురం డివిజన్‌తో కలిపి ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 30 శాతంతో రెండో స్థానం, 20శాతంతో రాజమహేంద్రవరం (నిడదవోలు సబ్ డివిజన్ మినహా) మూడో స్థానంలో ఉన్నాయి. రంపచోడవరం విద్యుత్ సబ్‌డివిజన్‌లో మిగిలిన ఐదు శాతం వినియోగం నమోదైంది. గృహవిద్యుత్ వినియోగం 50శాతం పైనే ఉంది. వేసవికి ముందు రోజుకు 16 మిలియన్ యూనిట్లు ఉంటే ప్రస్తుతం 17 నుంచి 20 మిలియన్ యూనిట్లు వాడుతున్నారు. ఈ నెల 13న 20.08 మిలియన్ యూనిట్లు క్రాస్ చేసింది.

నిరంతరాయంగా సరఫరా

విద్యుత్ వినియోగం పెరిగినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా ఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిరంతరం విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నారు. గతంలో ప్రతి వేసవిలోనూ విద్యుత్‌కోతలతో ప్రజలు నరకం చూసే వారు. ప్రస్తుతం పెరుగుతోన్న వినియోగానికి తగ్గట్టు ఉత్పత్తికి ఢోకా లేకపోవడంతో కోతల ఊసే లేదు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తుతుంటే డివిజన్ స్థాయిలో అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందిస్తున్నారు. విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు

రోజువారీ విద్యుత్ మొత్తం వినియోగం (మిలియన్ యూనిట్లు)

తేదీ	వినియోగం	తేదీ	వినియోగం
10.05.2022	11.575	10.05.2023	18.840
11.05.2022	11.485	11.05.2023	18.925
12.05.2022	14.010	12.05.2023	19.186
13.05.2022	15.014	13.05.2023	20.082
14.05.2022	16.567	14.05.2023	19.917
15.05.2022	16.783	15.05.2023	20.620
16.05.2022	17.316	16.05.2023	20.615

ఈనెలలో రోజువారీ వినియోగం(మిలియన్ యూనిట్లు)

తేదీ	మొత్తం	గృహ వినియోగం
09.05.2023	18.71	7.48
10.05.2023	18.84	7.54
11.05.2023	18.93	7.57
12.05.2023	19.19	7.67
13.05.2023	20.08	8.03
14.05.2023	19.92	7.97



డిమాండ్‌కు దగ్గట్టుగా ఉత్పత్తి

వేసవి దృష్ట్యా వినియోగం పెరిగినప్పటికీ సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి ఉంది. గతంలో మాదిరిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోతలు ఎక్కడా విధించడంలేదు. అత్యవసర మరమ్మతులు, లైన్‌లలో నిర్వహణాలోపాలు తలెత్తినప్పుడు అంతరాయం ఏర్పడుతోంది. 24 గంటలు విద్యుత్ సరఫరాకుఎక్కడా ఇబ్బంది లేదు. భవిష్యత్ అవసరాలకు పూర్తిగా విద్యుత్ అందుబాటులో ఉంది.

– పి.వి.ఎస్.మూర్తి, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

మెచ్చేలా.. ముచ్చటగా..



- ఆకట్టుకునే ధాన్యం కుచ్చులు
- వీటి అలంకరణతో ఇళ్లకు, ఆలయాలకు సరికొత్త శోభ
- కుచ్చుల తోరణాలతో గడపలకు మరింత అందం
- రబీ కోతల వేళ.. ఊపందుకున్న తయారీ

సాక్షి, అమలాపురం: పంటభూమిలో ఆరుగాలం చెమట చిందించి, పండించే ధాన్యాన్ని రైతు ఎంతో అపురూపంగా భావిస్తాడు. రెక్కల కష్టంతో దక్కిన ఫలితంలో కొంత భాగాన్ని దేవునికి పరమ భక్తితో నివేదిస్తాడు. తన కుటుంబ జీవనానికి ఊతంగా నిలిచి.. సిరులు కురిపించే వరి కంకులతో ఇళ్లను ముచ్చటగా.. చూసిన వారు మెచ్చేలా.. ముస్తాబు చేసుకుని మురిసిపోతాడు. వరి కంకులను అందంగా అల్లి తయారు చేసే ధాన్యం కుచ్చులను వీధిలో వేలాడదీసే వారు కొందరైతే... తోరణాలుగా చేసి సింహద్వారానికి అలంకరించే వారు మరికొందరు. దేవాలయాల్లో సైతం ఇలా కుచ్చులు కట్టడం, ఆలయ సింహద్వారాలకు తోరణాలు పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. ఏటా సంక్రాంతి సమయంలో పచ్చని కోనసీమలో జరిగే తీర్థాలకు భక్తుల భుజస్కంధాలపై వెళ్లే ప్రభలకు సైతం ధాన్యం కుచ్చులు తగిలించి, తాము పండిచిన ధాన్యాన్ని దైవానికి నైవేద్యంగా సమర్పిస్తూంటారు. ప్రకృతి ప్రేమికులు సైతం ధాన్యం కుచ్చులను వీధుల్లో ఉంచి, పక్షులకు ఆహారంగా అందిస్తూంటారు.

పక్షులకు ఆహారంగా..

పక్షులకు ఆహారంగా అందించేందుకు సైతం పలువురు ధాన్యం కుచ్చులను ఇళ్లు, ఆలయాలు, పంట పొలాల వద్ద ఉండే రైతుల ఇళ్ల (మకాం) వద్ద విరివిరిగా ఏర్పాటు చేస్తున్నారు. కొందరు ప్రకృతి ప్రేమికులు పక్షుల సందడి అధికంగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఉంచుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన పెనుమాక మహాలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆయన ఆరు దశాబ్దాల పాటు పక్షులకు ఆహారంగా ధాన్యం కుచ్చులను అందుబాటులో ఉంచారు. ఊళ్లోని ఆలయాలకు, చెట్లకు, నాలుగు రోడ్ల కూడళ్లలోని స్తంభాలకు, ఎత్తయిన భవనాలకు కుచ్చులు కట్టి, పక్షులకు ఆహారంగా అందించేవారు. 'ఊపిరి ఉన్నంత వరకూ కుచ్చులు కట్టి, పక్షులకు ఆహారం అందిస్తాను' అని ఆయన తరచూ అనే వారు. ఆ మాటను అక్షరాల నిజం చేశారు.



అమ్మకానికి సిద్ధం చేసిన వరి కంకుల తోరణాలు, ధాన్యం కుచ్చులు

చేయి తిరిగిన వారే చేయగలరు

రబీ వరి కోతలు జోరుగా సాగుతున్న ప్రస్తుత తరుణంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వరి కుచ్చులు తయారు చేస్తూ పలువురు బిజీ అయిపోయారు. వీటిని తయారు చేయడం అంత సులువేమీ కాదు. గతంలో వీటిని తయారు చేయడానికి ప్రత్యేకంగా కొందరు ఉండేవారు. ఆ తరం దాదాపు తగ్గిపోవడంతో కొన్నాళ్లు కంకుల కుచ్చులు కూడా కనుమరుగయ్యాయి. కానీ ఇప్పుడు తిరిగి ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. దీంతో పలువురు పెద్ద తరం వారి వద్ద నేర్చుకుని వరి కుచ్చులు, తోరణాల తయారీ విరివిగా చేపడుతూ ఉపాధిగా పొందుతున్నారు. కోత కోసిన తరువాత ధాన్యం పరకలను ప్లాస్టిక్ తాడు లేదా పురికొసకు ఒకదాని తరువాత ఒకటిగా వేలాడదీస్తూ కడతారు. తరువాత అన్నిటినీ కలిపి గుండ్రంగా చుట్టడం ద్వారా ధాన్యం కుచ్చు తయారు చేస్తారు. ఇది పూర్తయిన తరువాత గడ్డి చూరులు లేదా పురికొసను తాడుగా తయారు చేసి ధాన్యం కుచ్చులను ముస్తాబు చేస్తారు. ప్రస్తుతం వరి కుచ్చులను ఇంటి ముందు పెట్టాలనే ఆకాంక్ష ప్రతి ఒక్కరికీ విపరీతంగా పెరిగింది. పల్లెల కంటే పట్టణ వాసులే ధాన్య కుచ్చులపై ఆసక్తి చూపుతూండటం విశేషం. పలు ప్రాంతాల్లో ధాన్యం కుచ్చులు, తోరణాలు తయారు చేసి రోజుకు రూ.500 నుంచి రూ.1,000 వరకూ ఆదాయం పొందుతున్నారు. కొంతమంది వీటిని ప్రత్యేకంగా తయారు చేయించుకుని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు తీసుకు వెళ్తున్నారు.



ఇంటి గుమ్మానికి అలంకరించిన వరి కంకుల తోరణాలు

కుచ్చులతో ఉపాధి



అంబాజీపేట మండలం జి.అగ్రహారానికి చెందిన ఆకుమర్తి వేమ సుందరరావు ధాన్యం కుచ్చులు, పండ్లకు బుట్టలు కట్టి ఉపాధి పొందుతున్నారు. అంతకు ముందు దినసరి కూలీగా ఉండే సుందరరావు ఓ ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నారు. తరువాత ఇంటి వద్దనే ఉంటూ ఈ పని చేస్తున్నారు. 'వరి పనలు తెచ్చి చాలా మంది నా వద్ద కుచ్చులు తయారు చేయించుకుంటారు. సైజును బట్టి రూ.150 నుంచి రూ.500 వరకూ ఇస్తుంటారు' అని సుందరరావు చెప్పారు.



ఇంటి వద్ద అలంకరించిన ధాన్యం కుచ్చులు

పచ్చని కానుక

రామకృష్ణ రిటైర్డ్ బ్యాంకు అధికారి. కుమార్తెకు వివాహం కుదిరింది. రెండు రోజుల్లో నిశ్చితార్థం. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. అతిథులకు, వియ్యాల వారికి రిటర్న్ గిఫ్ట్ కొత్తగా ఏదైనా ఇవ్వాలని ఆయన ఆలోచన. రోజూ సాయంత్రం వాకింగ్‌లో కలిసే మిత్రుడిని సలహా అడిగారు. ఆకర్షణీయమైన మొక్కలను ఇద్దామని సూచించారు. అది రామకృష్ణకు నచ్చింది. వెంటనే కడియపులంక నుంచి తెప్పించి, వాటినే బహూకరించారు.

(రాజమహేంద్రవరం డెస్క్)

- నాటుకుంటున్న మొక్కల బహుమతుల కల్చర్
- బొకే..దండలకు బదులుగా వీటికి స్థానం
- కడియపులంక నర్సరీల్లో భారీఎత్తున విక్రయాలు
- పర్యావరణ ప్రేమికుల కొత్త ట్రెండ్ ఇది..



రామకృష్ణ ఒక్కరే కాదు. ఇటీవల కాలంలో చాలామంది పర్యావరణ హితం కోరుతూ బహుమతుల జాబితాలో మొక్కలను చేరుస్తున్నారు. జీవం ఉన్న బుల్లి మొక్కలను బహుమతిగా ఇస్తూ ప్రకృతిపై ప్రేమను చాటుకుంటున్నారు. పూలదండలు, పుష్పగుచ్ఛాల స్థానాన్ని క్రమంగా ఇప్పుడు ఇలాంటి గిఫ్ట్ ప్లాంట్స్ ఆక్రమిస్తున్నాయి. పెద్ద నాయకులు పర్యటనకు వచ్చినా, ఓ ఉద్యోగి రిటైరైనా శాలువా, మెమెంటోలతో పాటు గిఫ్ట్ ప్లాంట్లు కూడా తప్పనిసరి అయ్యాయి. కాన్వెంట్లో విద్యార్థి పుట్టిన రోజు నాడు క్లాస్ టీచర్లకు తల్లిదండ్రులు మొక్కలనే పిల్లలతో గిఫ్ట్‌గా ఇప్పిస్తున్నారు. అదొక్కటే కాదు పచ్చదనాన్ని ఇష్టపడే ఏ ఇంటి హాల్లో టీపాయ్‌పైన చూసినా ఒకటో, రెండో గిఫ్ట్ ప్లాంట్స్ కనిపిస్తాయి. మొక్కలు ఆక్సిజన్‌ను రిలీజ్ చేస్తాయని, ఎయిర్ ప్యూరిఫయర్‌గా ఉపయోగపడతాయని ఇలా చేస్తున్నారు.

ఇదో పెద్ద పరిశ్రమ

గిఫ్ట్ ప్లాంట్స్ ..ఇప్పుడో పెద్ద పరిశ్రమ. దీనికి కేరాఫ్ రాష్ట్రంలోనే అతి పెద్ద హోల్‌సేల్ మార్కెట్ కడియం, కడియపులంక. 15 ఏళ్ల క్రితం గిఫ్ట్ ప్లాంట్స్ విక్రయాలు మొదలయ్యాయి. స్వల్పకాలంలోనే నర్సరీ రంగంలో ఓ ప్రత్యేక విభాగంగా ఇవి రూపుదిద్దుకున్నాయి. ప్రస్తుతం వాటి టర్నోవర్ రూ.కోట్లలోకి చేరుకుంది. జామియా కులకస్, పొట్టి రకానికి చెందిన స్నేక్, రంగురంగుల అగ్లోనిమాలు, మెరంటా, సింగోనియం, నక్కలెన్స్ వంటి మొక్కలు గిఫ్ట్ ప్లాంట్స్‌గా ఆదరణ పొందాయి. పీస్ లిల్లీ, ఆంథూరియం, కలించీ, ఆర్చిడ్స్ వంటివి పూలతో కూడి న గిఫ్ట్ ప్లాంట్స్. వాటిలో ఆక్సిజన్ ప్లాంట్‌గా పిలిచే జామియా కులకస్ ఎక్కువగా అమ్ముడయ్యే గిఫ్ట్‌ప్లాంట్. వీటిని పూణె, బెంగళూరుల నుంచే గాకుండా థాయ్‌లాండ్, చైనా వంటి ఇతర దేశాల నుంచి ఇక్కడ నర్సరీల యజమానులు దిగుమతి చేసుకుంటున్నారు. గిఫ్ట్‌ప్లాంట్స్ చిన్నవి, సున్నితమైనవి కావడంతో ఎండవానల నుంచి రక్షణకు పాలీహౌస్‌లలో విక్రయానికి ఉంచుతారు. వాటి కోసం పెద్దపెద్ద నర్సరీల యాజమానులు రూ.లక్షలు ఖర్చు చేసి పాలీహౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారు. కడియపులంక ప్రాంతంలో 40 వరకూ పాలీహౌస్‌లు ఉన్నాయి. ఇక్కడి నుంచి విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, అమలాపురం, ఏలూరు, గుంటూరు, నెల్లూరు వంటి నగరాలకు సరఫరా అవుతుంటాయి. ఒక్కోగిఫ్ట్ ప్లాంట్ రకాన్ని బట్టి ఇంచుమించు రూ.250 నుంచి రూ.1000 వరకూ రేటు పలుకుతోంది.

వెలెన్షియాలు..

సాధారణంగా 4, 5, 6 అంగుళాల సాధారణ కుండీల్లో గిఫ్ట్ ప్లాంట్స్ అందుబాటులో ఉంటాయి. మట్టికి బదులు పోషకాలు ఎక్కువగా ఉండే పాట్ మిక్స్ వాడుతుంటారు. మొక్కలతో కూడిన ఆ కుండీలను అంతకంటే అర అంగుళం ఎక్కువ సైజులో వివిధ రంగుల్లో, ఆకర్షణీయంగా ఉండే మరో కుండీలో ఉంచుతారు. దానిని వ్యవహారికంగా అవుటర్ పాట్ అంటారు. అసలు పేరు వెలెన్షియా.ప్లాస్టిక్ కుండీలు, గార్డెన్ ఉపకరణాలు తయారు చేసే పెద్దపెద్ద కంపెనీలే వివిధ రూపాల్లో, డిజైన్లలో ఆకట్టుకునేలా ఈ వెలెన్షియాలను తయారు చేస్తున్నాయి. వీటి అవుట్‌లెట్‌లు కడియపులంక ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయి.

న్యూ ఇయర్ వేడుకల్లో కీలకం

నూతన సంవత్సర వేడుకలకు ఆత్మీయులకు గిఫ్ట్ ప్లాంట్స్‌ను బహుమతిగా ఇవ్వడం ఇప్పటి ట్రెండ్. కడియం,కడియపులంకల్లో ఏడాది పొడవునా సాగే విక్రయాయి ఒక ఎత్తయితే, న్యూ ఇయర్ పేరుతో జరిగే గిఫ్ట్ ప్లాంట్స్ విక్రయాలు మరో ఎత్తు. ఈ క్రమంలో డిసెంబర్ మూడో వారం నుంచి కడియం, కడియపులంకలలోని ప్రధాన నర్సరీల యజమానులు ఏటా సరికొత్త రకాల గిఫ్ట్ ప్లాంట్స్‌ను దిగుమతి చేసుకుంటారు. డిసెంబర్ కావడంతో వాటిలో వివిధ రకాల స్వదేశీ, విదేశీ రకాల పూలమొక్కలు కూడా ఉంటాయి. డిసెంబర్ ఆఖరి వారంలోనే రూ.కోట్లలో గిఫ్ట్ ప్లాంట్స్ విక్రయాలు జరుగుతాయి.



పాలీహౌస్‌లో విక్రయానికి గిఫ్ట్ ప్లాంట్స్



ఆక్సిజన్ ప్లాంట్‌గా పిలిచే జామియా కులకస్



రంగురంగుల వెలెన్షియాలు

గిఫ్ట్ ప్లాంట్‌తో స్వాగతం



రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో సందర్శనకు తరచూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు. వారికి గతంలో పుష్పగుచ్ఛాలను ఇచ్చి స్వాగతం పలికేవారం. వాటికి బదులు కొంతకాలంగా గిఫ్ట్ ప్లాంట్స్ ఇచ్చి ఆహ్వానిస్తున్నాం. పుష్పగుచ్ఛాలు రెండు రోజులకే వాడిపోతాయి. గిఫ్ట్ ప్లాంట్స్ ఎక్కువ కాల ఉంటాయి. ఆక్సిజన్‌ను ఇస్తాయి. పర్యావరణ రక్షణకు మేం కూడా ఎంతో కొంత మేలు చేసినట్లు ఉంటుంది.

– **వీఎస్ఎల్ రావు**, ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్, రాజమహేంద్రవరం డిపో

12 ఏళ్లుగా విక్రయిస్తున్నాం



కడియపులంకలో 12 ఏళ్లుగా గార్డెన్ ఉపకరణాలు విక్రయిస్తున్నాం. ప్రారంభంతో పోలిస్తే ఇప్పుడు వెలెన్షియాల విక్రయాలు బాగా పెరిగాయి. అన్ని సైజుల్లో, రంగుల్లో మా వద్ద అందుబాటులో ఉంటాయి. వివిధ నగరాలు, పట్టణాల నుంచి వచ్చి కొనుగోలు చేసి తీసుకు వెళుతుంటారు.

– **రాజ్‌కుమార్ పాండే**, మేనేజర్, హర్షదీప్, గార్డెన్ ఉపకరణాల అవుట్‌లెట్, కడియపులంక

సబ్సిడీపై పాట్ మిక్స్ ఇవ్వాలి



రాష్ట్రంలోనే అతిపెద్ద గిఫ్ట్ ప్లాంట్ మార్కెట్‌గా కడియం, కడియపు ఎదిగాయి. గిఫ్ట్‌ప్లాంట్స్ ఆక్సిజన్‌ను ఇవ్వడమే కాదు, ఎయిర్ ప్యూరిఫయర్స్ కూడా. వాటిని విక్రయించే నర్సరీలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అవసరం. ప్రధానంగా ఉద్యాన శాఖ ద్వారా మట్టికి బదులుగా గిఫ్ట్ ప్లాంట్‌కు వినియోగించే పాట్ మిక్స్‌ను రాయితీపై ఇచ్చి ప్రోత్సహించాలి.

– **మల్లు పోలరాజు**, శివాంజనేయ నర్సరీ అధినేత, కడియపులంక



ధ్వని పుట్టింది... రాగం ఆవిర్భవించింది.
మాట పుట్టింది... పాట రూపుదిద్దుకుంది.
ఆది సంస్కృతి... ఆదిరాగాన్ని ఆవిష్కరించింది.
ఆ రాగాల పరిరక్షణకు అంకితమైన గాయని
లక్ష్మీబాయ్.

మా పాట అడవి దాటింది

ఆదివాసీ గాయని లక్ష్మీబాయ్

హైదరాబాద్‌లో గవర్నర్ బంగళా. ఈ ఏడాది మార్చిలో మహిళాదినోత్సం వేడుకలకు సిద్ధమైంది. తమ తమ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళలు పురస్కారాలందుకుంటున్నారు. వారిలో ఓ మహిళ పెందూరు లక్ష్మీబాయ్. ఆదిలాబాద్ నుంచి వచ్చిన ఆదివాసీ గాయని ఆమె. గవర్నర్ చేతుల మీదుగా సన్మానం చేయించుకున్న సంతోషం ఆమె ముఖంలో ప్రతిఫలిస్తోంది. ఈ గౌరవాన్ని అందుకున్న లక్ష్మీబాయ్ తన జీవితాన్ని ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకే అంకితం చేసింది. ఆమె సాక్షితో పంచుకున్న వివరాలివి.

''మాది ఆదిలాబాద్ జిల్లా గుడి హత్నూర్ మండలం, తోషం గ్రామం. మా తెగ పేరు తోటీ. సిటీల వాళ్లు టాటూ అని ఇప్పుడు ఫ్యాషన్‌గా వేసుకుంటున్నారు చూశారా... అదే... పచ్చబొట్టు. ఆ పచ్చబొట్టు వేయడం మా వృత్తి. అడవుల్లో మూలికలు, వేళ్లను సేకరించి పసరు తయారు చేసుకుంటాం. మా సంస్కృతి, జీవనం గోండ్ రాజులతోపాటుగా ఉండేది. గోండ్ రాజుల దగ్గర కళాకారులం. కిక్రీ అనే వాయిద్యంతో పాటల రూపంలో మహాభారతం, రామాయణం, రాజుల కథలను చెబుతాం. రేలా పాటలైతే వందల్లో ఉంటాయి. అవన్నీ మాకు నోటికి వస్తాయి. పుస్తకం చూడాల్సిన అవసరం లేదు. మా పేర్లు కూడా రామాయణ, మహాభారతాలు, గొప్ప రాజుల చరిత్ర కథల్లో ఉండే పేర్లే ఉంటాయి.

■ పాటని వదలం

అన్నం దొరకకున్నా సరే పాటను మాత్రం వదలం. మా పుట్టిల్లు మంచిర్యాల జిల్లా, జన్నారం మండలం, పుట్టిగూడ. మా చిన్నప్పుడు తినడానికి కూడా ఇప్పుడున్నంత వెసులుబాటు ఉండేది కాదు. గోండ్ రాజుల ఇంట్లో పండగ, శుభం... అశుభం... ఏదో ఒక సందర్భంలో వాళ్లు జొన్నలు పెడితే అదే సంతోషం. మిగిలిన రోజుల్లో అడవి తల్లే ఆధారం. అలాంటి గడ్డు రోజుల్లో కూడా మేము మా సంస్కృతిని వదల్లేదు. కిక్రీ వాయిద్యాలను మూలన పెట్టలేదు. సంస్కృతిని, కళను అంతరించి పోనివ్వకూడదని మాకు మేము ఒట్టు పెట్టుకుంటాం. మా వంశాల్లో తరతరాల సంపద మా నోటిపాట, మాట. చిన్నప్పటి నుంచి ఎన్నో ఏళ్లపాటు నేర్చుకుంటూ, మర్చిపోకుండా సాధన చేస్తూనే ఉంటాం. అప్పట్లో మా పాట అడవిలోనే ఉండేది. ఇప్పుడు సర్కారు శ్రద్ధ పెట్టడంతో మా కళ అందరికీ తెలుస్తోంది. ఆకాశవాణిలోనూ మా పాటలు వచ్చాయి.



గవర్నర్ తమిళిసై నుంచి పురస్కారం అందుకుంటున్న లక్ష్మీ బాయ్

■ పురస్కారం మా కళకే!

నా భర్త తుకారామ్ కిక్రీ వాద్యకారుడు. నేను రేల పాటలు పాడుతాను. ఆయన, నేను పాటలు పాడుతూ ఊళ్లు తిరిగాం. ఢిల్లీలో 2006లో రిపబ్లిక్ దినోత్సవాలకు వెళ్లి మా కళలను ప్రదర్శించాం. రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ గారి చేతుల మీదుగా సన్మానం అందుకున్నాం. ఈ ఏడు హైదరాబాద్‌లో గవర్నర్ చేతుల మీద సన్మానం, మధ్యలో ఆదిలాబాద్ జిల్లాలో అనేక కార్యక్రమాల్లో మా పాటలు, దండలు, శాలువాలతో గౌరవించారు. అంతపెద్ద వాళ్లు మాకు దణ్ణం పెడుతుంటారు. ఆ దణ్ణం మాక్కాదు, మా ఆకలి తీరుస్తూ, మమ్మల్ని కడుపులో పెట్టుకుని కాపాడే మా అడవి తల్లికి. అక్షరం రాని మా నాలుక మీద పెద్ద పెద్ద గ్రంథాలను పలికిస్తున్న మా కులదైవానికే. మేము ఏటా జనవరిలో ఒకసారి, ఈ నెలలో (మే నెల) ఒకసారి మా ఉత్సవాలు చేసుకుంటాం. మా పాటలన్నీ మా నాలుక మీద నాట్యం చేస్తున్నాయి.

■ నగరానికి చేరిన 'ఆది' పాట

ఐఏఎస్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ ఈ కళను మా దగ్గరే ఆగి పోనివ్వకుండా అందరికీ తెలియ చేయాలని సంక్షేమ హాస్టల్‌లో చదువు కుంటున్న ఆడపిల్లలకు నేర్పించమన్నారు. ఆమె మాట మీద రెండు నెలలు అక్కడే ఉండి నేర్పించాను. నాకు రాయడం రాదు, వందల పాటలు పాడతాను. మా చిన్నప్పుడు బడుల్లేవు. ఇప్పుడు మా ఆదివాసీలు పిల్లలందరినీ చదివించారు. మేము మా నలుగురు పిల్లలనూ చదివించాం. రాయడం వచ్చినోళ్లు ఈ పాటలను రాస్తే ఎప్పటికీ ఉంటాయి. ఇప్పటోళ్లు మేము పాడుతుంటే పాటలు రికార్డ్ చేసి యూ ట్యూబులో పెడుతున్నారు. మా పాట నగరాలకు చేరుతోంది. నగరాల వాళ్లు ఈ పాటలను టీవీల్లో పాడుతున్నారు. వాటిని చూసినప్పుడు మాకు ఖుషీగా ఉంటుంది. నా కంఠంలో ప్రాణం ఉన్నంత కాలం పాట ఆపను. నా భర్తతో కలిసి ఎన్నెన్ని పాటలు పాడానో... ఇప్పుడు నాతో ఉన్నది ఆయనతో పాడిన పాటలే'' అని తాను ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అంకితమైన వైనాన్ని వివరించారు పెందూరు లక్ష్మీబాయ్.

– వాకా మంజులారెడ్డి

సైబర్ టాక్

ఇంటర్నేషనల్ కాల్స్ వస్తున్నాయా?!



ఇటీవల ఇండోనేషియా (+62), వియత్నాం (+84), మలేషియా (+60), కెన్యా (+254), ఇథియోపియా (+251).. మొదలైన దేశాల నుంచి వచ్చే ఇంటర్నేషనల్ ఫోన్‌కాల్స్‌ను తమకు తెలియకుండా అప్రయత్నంగా.. అనుకోకుండా రిసీవ్ చేసుకుంటూ ఆర్థిక మోసాల బారిన పడుతున్నారు చాలా మంది. ఈ సైబర్‌నేరగాళ్ల నుంచి జాగ్రత్తపడటమే కాదు మన తోటి వారికీ అవగాహన కలిగించడం అవసరం.

•••

ఆఫీసుకువెళ్లే హడావిడిలో ఫోన్ మోగితే లిఫ్ట్ చేసింది గీత. ఒక లార్జ్ గ్రూప్ ద్వారా ఆన్‌లైన్ ఆదాయ వనరులను పరిచయం చేయబోతున్నామని, అందుకు సంబంధించిన వివరాలను ఫోన్‌కి పంపుతున్నామని చెప్పారు కాలర్. అందుకు ఎన్ని లెవల్స్ ఉంటాయో, ఎలా పాల్గొనవచ్చో కూడా చెప్పిన విధానం గీతకు బాగా నచ్చింది. ముందు ఫ్రీ టాస్క్‌లో పాల్గొని, అంతా నచ్చితే కొనసాగించమని, అందుకు సంబంధించిన వివరాల మెసేజ్‌ను పంపుతామని, చెక్ చేసుకోమని, గ్యారంటీ ప్రాఫిట్ అని చెప్పడంతో గీతకు ఆనందమేసింది. ఆఫీసుకు వెళ్లాక ఫోన్‌కి వచ్చిన వాట్సప్ మెసేజ్ చూసింది. గ్రూప్‌లో జాయినవమని వచ్చిన మెసేజ్ అది. ఆ గ్రూప్‌లో జాయిన్ అయింది. చాలా మంది ఉన్న ఆ గ్రూప్‌లో పెద్ద పెద్ద వాళ్లు ఉన్నారని అర్థమైంది. ఆ గ్రూప్‌లో చూపించిన విధంగా తన అకౌంట్‌కి లాగిన్ అయి, ఫ్రీ టాస్క్‌లో చేరితే వెంటనే తన అకౌంట్‌లోకి రూ.500 వచ్చాయి. ఆనందపడుతూ వాళ్లు చెప్పిన టాస్క్‌ని పూర్తి చేస్తే, మరో రూ.1000 జమ అయ్యాయి. వాటిని విత్ డ్రా చేసుకున్నాక, పెయిడ్ టాస్క్‌కు వెళ్లి లక్ష రూపాయలు పోగొట్టుకున్నాక కానీ, అర్థం కాలేదు గీతకు తను మోసపోయానని. విదేశీ మోసగాళ్లు వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట కూడా ఇలాంటి మోసాలకు పాల్పడుతుంటారు.

ఫేక్ లైక్స్..

డీపీ లు మొత్తం ఇండియన్ అమ్మాయిల ఫొటోలు ఉంటాయి. కానీ, ఫేక్ ప్రొఫైల్స్ ఉంటాయి. మనవాళ్లే కదా అని జాయిన్ అవుతాం. వాయిస్ కూడా మన ఇండియన్ స్టైల్‌లోనే ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్ లైక్స్, యూ ట్యూబ్ వ్యూస్...పెంచడం కోసం ఒక టాస్క్ ఉంటుంది. ముందు ఫ్రీ టాస్క్‌ల పేరుతో ఆకట్టుకుంటారు. మనకు ఎప్పుడైతే డబ్బులు వస్తాయో అప్పుడు ఆ గేమ్ పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిజమైన ప్లేయర్లతో పాటు స్కామర్లు కూడా ఉంటారు. రూ. 500 వచ్చాయని, రూ.1000 వచ్చాయని స్క్రీన్ షాట్స్ షేర్ చేస్తుంటారు. కొంత టైమ్ అయ్యాక ఫ్రీ టాస్క్ పూర్తయిందని, పెయిడ్ టాస్క్ ఉందని చెబుతారు. వీటిలో మళ్లీ రకరకాల గ్రూప్స్‌లో మనల్ని యాడ్ చేస్తారు. రూ.1000 పెడితే 1300 ఇస్తాడు. వెంటనే 300 రావడంతో ఆశ పెరుగుతుంది. 5000 పెడితే మరో 2000 అదనంగా వస్తాయని చూపుతారు. ప్రతీ టాస్క్ పై ఒత్తిడితో కూడా ప్రైజర్ ఉంటుంది.రూ. 7000 మన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసేలోపు టైమ్ లాప్స్ అయిపోయిందని చెబుతారు. దీనిని డ్రా చేయాలంటే రూ. 10000 పెట్టమంటారు. ఇవన్నీ మల్టిపుల్ అకౌంట్స్ , ఇండియన్ అడ్రస్ ఉన్న ప్రైవేట్ బ్యాంకుల ఖాతాలు చూపుతారు. మనం నిజమే కదా అని నమ్మి వాళ్ల ట్రాప్‌లో పడతాం. అప్పుడు మెల్ల మెల్లగా రూ.50 నుంచి మొదలుపెట్టి పది లక్షల వరకు రూట్ మార్చుతుంటారు. ఇరవై రోజుల క్రితం 20 లక్షలు వరకు జరిగిన మోసం నిన్న 60 లక్షల రూపాయలతో సైబర్ క్రైమ్‌లో కేస్ నమోదైంది.


ప్రతీకాత్మక చిత్రం

మోసపోతే..

- 1930కి కాల్ చేయాలి.
- హెల్ప్‌లైన్ వాళ్లు మోసపోయిన ఆధారాల డాక్యుమెంట్స్ ఇవ్వమంటారు.
- మోసగాళ్లు మల్టిపుల్ అకౌంట్స్‌ను ఉపయోగిస్తుంటారు. మన ద్వారా వాటికి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయిస్తారు. వాటి ఆధారంగా ఆయా రోజుల్లో మన ఖాతాలో నుంచి ఎవరెవరికి డబ్బులు వెళ్లాయో, మన ఖాతాకు ఎవరి ద్వారా డబ్బు వచ్చిందో చూసి ఆ అకౌంట్స్ అన్నింటినీ ఫ్రీజ్ చేస్తారు. అప్పుడు కేస్ ఫైల్ చేసి, ఇన్వెస్టిగేషన్ చేస్తారు. పూర్తి ఇన్వెస్టిగేషన్ చేసి, మన డబ్బులు మనకు వచ్చేలా చేస్తారు.

స్పామ్ కాల్స్‌కి ఆన్సర్ చేయద్దు

- తెలియని ఇంటర్నేషనల్ ఫోన్ కాల్స్‌ని నమ్మద్దు. ఈ కాల్స్ వచ్చినప్పుడు అపనమ్మకంగానే కాదు అప్రమత్తంగానూ ఉండడటం అవసరం.
- కాలర్ ఐడెంటిటీనీ వెరిఫై చేసుకోవాలి.
- ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్ వంటి వ్యక్తిగత వివరాలను కాలర్స్‌కి ఇవ్వద్దు.
- స్పామ్ కాల్స్‌ని రిసీవ్ చేసుకోవద్దు. అలాంటి వాటిని ట్రూ కాలర్‌లో చెక్ చేసుకోండి.
- వాట్సప్, టెలిగ్రామ్, ట్రూ కాలర్‌లో అనుమానించదగిన ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు ఆ యాప్స్‌కి రిపోర్ట్ చేయడం మర్చిపోవద్దు. ఒక సింగిల్ స్టెప్ ద్వారా యూజర్ రిపోర్ట్ చేయచ్చు.
- ఏ కాలర్ కూడా మనల్ని డబ్బు కట్టమని అడగరు. ఇలాంటప్పుడు గ్రూప్‌లో నుంచి ఎగ్జిట్ అవడం లేదా హ్యాంగప్ చేయాలి.
- ఏం చేస్తారో చూద్దాం అనుకొని గ్రూప్‌లో కొందరు ఎగ్జిట్ అవక అలాగే ఉండిపోతారు. అలాంటివాళ్లే ఎక్కువ ఇన్వెస్ట్ చేసి మోసపోతారు. గ్రూప్‌లో అలాగే ఉండి మిగతా మెంబర్లు 'మాకు డబ్బులు వచ్చాయి' అని షేర్ చేసే, స్క్రీన్ షాట్‌లకు పడిపోవద్దు.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

రూట్స్

హలో... నేను ఆర్‌జే కేరాబాయిని


పొలం పనుల్లో కేరాబాయి

కరువు ప్రభావంతో మహారాష్ట్రలోని మహాస్వాద్ గ్రామంలో ప్రజలు వలస బాట పట్టారు. అయితే కేరాబాయి మాత్రం ఊరు విడవలేదు. తన దగ్గర ఉన్న బంగారాన్ని కుదవబెట్టి కుటుంబాన్ని, పశువులను రక్షించుకుంది. అయితే ఆమె దగ్గర ఉన్న అసలుసిసలు బంగారం జానపదం.

72 సంవత్సరాల కేరాబాయి ఫేమస్ రేడియో జాకీగా పేరు తెచ్చుకుంది. ఆమె జీవితంపై 'వాటర్ ఫర్ గోల్డ్'అనే డాక్యుమెంటరీ వచ్చింది.

కేరాబాయికి పాటతో విడదీయలేని బంధం. తల్లి పాడే పాట వింటూనే నిద్రపోయేది. తల్లి పాట వింటూనే మేల్కొనేది. పొలం పనుల్లో పాటను తన వెంట తెచ్చుకునేది. చిన్న వయసులోనే తన కంటే వయసు చాలా ఎక్కువగా ఉన్న వ్యక్తితో వివాహం అయింది. భర్త తనను తరచుగా హింసించేవాడు. కడుపు నిండా అన్నం తినని రోజులు ఎన్నో ఉన్నాయి.

భర్త పెట్టే హింసను తట్టుకోలేక ఏడ్చినప్పుడు... తన కన్నీటిని తుడిచింది పాట.

ఆకలితో నిద్రలేని రాత్రులు గడుపుతున్నప్పుడు... తనకు ఓదార్పు ఇచ్చింది పాట.

ఒకరోజు...

మన్‌దేశీ అనే కమ్యూనిటీ రేడియో కార్యక్రమం విన్నది కేరాబాయి. ఆ సమయంలో తనకు కూడా పాడాలనిపించింది. ఆ రేడియో స్టేషన్ కార్యాలయాన్ని వెదుక్కుంటూ వెళ్లింది. సిబ్బందికి తన పాటలు వినిపించింది. వారికి ఆ పాటలు తెగ నచ్చేశాయి. అలా రేడియోలో పాడే అవకాశం వచ్చింది.

వారానికి నాలుగు రోజులు పాడిన సందర్భాలతో పాటు రోజూ పాడిన సందర్భాలు



ఎన్నో ఉన్నాయి. ఒకప్పుడు తన ఇంటికి, పొలానికే పరిమితమైన ఆమె పాట 'మన్ దేశీ' రేడియో వల్ల ఊరూరా చేరింది. కేరాబాయికి ఎంతో మంది అభిమానులు ఏర్పడ్డారు.

మొదట్లో భజనలు, జానపదాలకే పరిమితమైన కేరాబాయి ఆ తరువాత పర్యావరణం నుంచి సామాజిక స్పృహ వరకు ఎన్నో విషయాలపై దృష్టి పెట్టింది. ఆమె పాటలు నిరాశతో దిక్కుతోచని రైతులకు ధైర్యాన్ని ఇచ్చాయి. రేడియో జాకీగా కేరాబాయి పొందిన గుర్తింపు అమితాబ్ బచ్చన్ పాపులర్ టెలివిజన్ ప్రోగ్రాం 'కౌన్ బనేగా కరోడ్‌పతి' వరకు తీసుకువెళ్లింది. ఆమె గురించి పరిచయ వాక్యాలు ఇలా ఉంటాయి...

'మామూలుగా రేడియో జాకీ అనగానే స్టైలీష్‌గా... ఇంగ్లీష్ ధారళంగా మాట్లాడే రూపం కనుల ముందు ప్రత్యక్షమౌతుంది. కేరాబాయి వారికి భిన్నంగా కనిపించవచ్చు. ఆమె అందరిలాగా బడిలో చదువుకోకపోవచ్చుగానీ ఈ ప్రపంచమే ఆమె పెద్ద బడి. ప్రకృతి నుంచి అనుభవాల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకుంది. పేదరికం నేపథ్యం నుంచి వచ్చిన కేరాబాయి ఆత్మవిశ్వాసం అనే అపురూపశక్తితో ముందుకు వెళ్లి విజయాన్ని సాధించింది'

వందల మంది ప్రేక్షకుల మధ్య పాడుతున్నప్పుడు, మీడియా ఇంటర్వ్యూలలో తల్లికి తోడుగా ఉంటాడు సంతోష్ సర్గర్. 'ఆమె కొడుకుగా పుట్టినందుకు గర్విస్తున్నాను. అమ్మ పాట వింటూనే పెరిగాను. ఆమెకు పాటలే ప్రపంచం. పాటలే బలం. పాటలే పండగ' అంటున్నాడు గ్రామసేవక్‌గా పనిచేసే సంతోష్.

పాటలు పాడడమే కాదు ఆశువుగా కవిత్వం కూడా చెబుతుంది కేరాబాయి.

మచ్చుకు ఒకటి...

'నా దగ్గర సంపద లేదని ఎవరన్నారు?
నేను మహా సంపన్నురాలిని.
మా ఇంట్లోకి రోజూ సూర్యకాంతి వస్తుంది.
ఇంతకు మించిన సంపద ఉంటుందా?
రాత్రులలో మా ఇంటి పెరట్లో ఎటూచూసినా వెన్నెల కాంతి పొంగి పొర్లుతుంది.
ఇంతకుమించిన సంపద ఉంటుందా!'

కేరాబాయి హృదయం కథానిలయం కూడా. అక్కడ ఎన్నో నిజజీవిత కథలు ఉంటాయి. సందర్భాన్ని బట్టి వాటి గురించి ఆసక్తిగా చెబుతుంది.

'నేను పాడిన పాటలను పుస్తకంగా... సీడీలుగా తీసుకురావాలని ఉంది. దీంతోపాటు ఈ తరానికి ఆనాటి విలువైన పాటలు నేర్పిస్తాను' అంటుంది 72 సంవత్సరాల కేరాబాయి.

వాటర్ ఫర్ గోల్డ్

యూఎస్ ఇంటర్నేషనల్ బ్రాడ్‌కాస్టర్ వాయిస్ ఆఫ్ అమెరికా (వివోఎస్) తన వీక్లీ డాక్యుమెంటరీ సిరీస్ '52 డాక్యుమెంటరీ' కోసం కేరాబాయి జీవితాన్ని కళ్లకు కట్టే 'వాటర్ ఫర్ గోల్డ్' అనే డాక్యుమెంటరీని తీసుకువచ్చింది. ఈ డాక్యుమెంటరీలో: ఇంటిపనులు చేస్తున్న, పొలం పనులు చేస్తున్న, ఎర్రటి ఎండలో పశుగ్రాసం మోసుకువెళుతున్న, అందంగా నుదుటికి తిలకం దిద్దుకుంటున్న కేరాబాయి కనిపిస్తుంది. సీన్ కట్ చేస్తే... అందమైన రేడియో స్టేషన్‌లో మైక్ ముందు కనిపిస్తుంది. 'నమస్కారం, నేను ఆర్‌జే కేరాబాయిని మాట్లాడుతున్నాను. నేనొక రైతుని. మీ కోసం ఒక పాట పాడుతాను' అని గొంతు సవరిస్తుంది.

'మేఘాల్లారా రేపు మా ఊరికి రావడం మరవద్దు.
మీతో పాటు వానమ్మను తీసుకురావడం అసలే మరవద్దు' అంటూ ఊరూరూ ప్రతిధ్వనించేలా, పరవశించేలా పాట అందుకుంటుంది కేరాబాయి.

కరెంట్ టాపిక్

కుటుంబాన్ని కాపాడుకోలేమా?

అపనమ్మకం, ఆర్థిక కష్టాలు.. వ్యసనాలు, పొసగని అంచనాలు కమ్యూనికేషన్ గ్యాప్, అవాంఛిత సంబంధాలు... భార్యాభర్తల మధ్య తగాదాలకు కారణాలై పెను పరిణామాలకు దారి తీస్తున్నాయి. భార్య మీద కోపం, భర్త మీద అసహనం పిల్లల మీద, పరస్పరం పగ తీర్చుకునేలా చేస్తున్నాయి. క్షణికోద్రేకం జీవితాలను నాశనం చేస్తున్నది. కుటుంబాన్ని కాపాడుకోలేమా? కనీసం తక్కువ నష్టంతో సమస్యలను సరిచేసుకోలేమా? ఇవాళ నివురుగప్పిన నిప్పులా ఉన్న అన్ని కుటుంబాలు వేసుకోవాల్సిన ప్రశ్నలు ఇవి.



సులభంగా బతకడం అత్యంత జటిలం అవుతున్న కాలం ఇది. భార్య, భర్త, ఇద్దరు పిల్లలు కలిసి బతకడం ఎందుకు జటిలం అవుతుంది? భార్య గృహిణిగా లేదా ఉద్యోగిగా ఉండొచ్చు. భర్త ఏదో ఒక సంపాదనపరుడై ఉండొచ్చు. పిల్లలు చదువుకుంటూ ఉండొచ్చు. ఇల్లు గడవడానికి, పిల్లల్ని చదివించడానికి, అవసరాలకు తగిన సంపాదన ఉంటే సులభంగా, సంతోషంగా జీవించడం సాధ్యం అవుతుందా? ఎందుకు అశాంతి వస్తున్నది. భార్య లేదా భర్త ఎందుకు తీవ్రమైన నిర్ణయాలను తీసుకుంటున్నారు? ఎందుకు క్షణికోద్రేకంలో పిచ్చి పనులు చేస్తున్నారు. ఎందుకు ఏదైనా తీవ్ర చర్య చూపితే తప్ప భార్యకో, భర్తకో బుద్ధిరాదని అనుకుంటున్నారు. వారి మనసుల్లో ఇంత కల్లోలం రేగుతుంటే రక్త సంబంధీకులు, స్నేహితులు, ఇరుగు పొరుగు అను సమాజం ఏం చేస్తోంది? ఇదంతా ఏమిటి? ఇంత రుగ్మతలోకి కుటుంబాలు వెళుతుంటే సమాజం కూడా రుగ్మతలోకి వెళుతున్నట్టేనని ఎందుకు అందరం జాగ్రతం కావడం లేదు. ఇవి ప్రతి ఒక్కరూ వేసుకోవాల్సిన ప్రశ్న.

సహనా వవతు

మన సంస్కృతిలో 'సహనా వవతు' అనే భావన అవసరం పెద్దలు ఎప్పుడో చెప్పారు. 'కలిసి ముందుకు సాగడం' దీని అర్థం. పెళ్లి చేసుకోవాలనుకుంటున్న వధువు లేదా వరుడు రేపు ఏర్పరచుకోబోయే కుటుంబానికి సంబంధించి ముఖ్యంగా వంటబట్టించుకోవాల్సిన సూత్రం ఈ సహనా వవతు. ఇంతవరకూ నేను ఒక్కడిని ఇకపై కలిసి జీవించాలి అని అర్థం చేసుకుంటే, కలిసి జీవించడం అంటేనే సర్దుబాటు అనుకుంటే చాలా సమస్యలు రావు. భార్య/భర్త పూర్తిగా నచ్చేలా లేకపోయినా, పిల్లల ప్రవర్తన పూర్తిగా లోబడి ఉండకపోయినా, ఇంట్లో రకరకాల అభిప్రాయ భేదాలు వస్తూ ఉన్నా అవన్నీ సర్దుబాటు చేసుకునేలా కుటుంబ సభ్యుల మధ్య అవగాహన ఉండాలి. తెగేదాకా లాగని మనస్తత్వం పాదు చేసుకోవాలి. లేకపోతే అశాంతి... ఆందోళన.

ఏడు కారణాలు

భార్యాభర్తల మధ్య గొడవలకు, ఘర్షణకు, వాగ్వివాదాలకు ప్రధానంగా 7 కారణాలు కనిపిస్తాయి.

1 మానసిక దూరం: భార్యాభర్తల మధ్య మానసిక దూరం పెరిగిపోతే ఒక చూరు కింద వారు ఎన్నేళ్లు జీవించినా వారు సన్నిహితులు కారు. నిజమైన సంతోషం పొందలేరు. తమ మధ్య మానసిక దూరం పెరిగిందని భార్యాభర్తలకు తెలిసినా దానిని నివారించడానికి ప్రయత్నించరు. ఫలితం.. ఏదో ఒక పెను ఘటన.

2 పెంపకం కొట్లాట: పిల్లల విషయంలో నిరంతర తగువు. ఒకరు వెనకేసుకు రావడం ఒకరు కఠినం గా ఉండటం... చదువు, స్కూళ్ల విషయం లో రభస... తిండి గురించి మరో తగవు... మార్కులు, హోమ్ వర్క్‌లు... కొద్దిసేపు కూచుని ఓర్పుగా మాట్లాడుకుంటే ఎవరైనా ఎక్స్‌పర్ట్ సలహాకు తల వొగ్గితే ఈ సమస్య ఉండదు. కాని వినరు.

3 కమ్యూనికేషన్ లోపం: ఏదీ చెప్పరు. చెప్పుకోరు. చెప్పాలని గుర్తించరు. అతని ఖర్చు ఆమెకు తెలియదు. ఆమె కొనుక్కోవాలనుకుంటున్న వస్తువు ను అతను కొనివ్వడు. బంధువులు, స్నేహితులు వారి రాకపోకల గురించి, వాళ్ల ఇళ్లకు వెళ్లడం గురించి మాట్లాడుకోరు. వీలు కాదు, వీలవుతుంది, వెళ్లాలి, వెళ్లక్కర్లేదు.. ఇవి ఉమ్మడి అంగీకారంతో జరగాల్సిన నిర్ణయాలు. అలా లేనప్పుడే ఆగ్రహం, పంతం.

4 ఫుల్‌స్టాప్ లేని వాదనలు: ఒకరు వాదిస్తుంటే మరొకరు తగ్గడం జరిగితే ప్రమాదం ఉండదని ఇరువురికీ తెలుసు. కాని వాదనలు పెంచుకుంటూ పోతారు. పాత గొడవలు తవ్వుతారు. పై చేయి సాధించడానికి చెత్త మాటలు, అబద్ధాలు, అభాండాలు వేసి గాయపరుస్తారు. ఒకరినొకరు అవమానించుకుంటారు.

5 ఆర్థిక సమస్యలు: పెళ్లి సమయంలోనే ఇరువురి ఆర్థిక స్థితి తెలుసుకాబట్టి ఆ గ్రాఫ్ చేరుకునే బిందువును అంచనా కట్టుకుని జీవితాన్ని మొదలెట్టాలి. మనం సామాన్య ఉద్యోగులం అయినా పెద్ద ఉద్యోగాలు చేసే జంటతో పోల్చుకుంటే ఆ ఇమిటేషన్‌తో అప్పుసప్పులు చేస్తే ఇ.ఎం.ఐలలో ఇరుక్కుపోతే ఆర్థిక సమస్య లు వస్తాయి. డబ్బు విషయంలో ప్రతి పైసా ఇద్దరి అవగాహనలోనే వచ్చినా, ఖర్చు అయినా మంచి ఫలితాలు ఉంటాయి. భార్యాభర్తల్లో ఎవరికి ఆర్థిక క్రమశిక్షణ లేకపోయినా సమస్యలు పెరుగుతాయి. ఇది మరీ రిపేరు చేసుకోలేని సమస్య మాత్రం కాదు.

6 ఆరోగ్య సమస్యలు: బిజీ లైఫ్ వల్ల ఆరోగ్య సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. భర్త ఆరోగ్యం గురించి భార్య శ్రద్ధ పెట్టకపోయినా, భార్య ఆరోగ్యాన్ని భర్త పట్టించుకోకపోయినా లోలోపల ఆ కోపం ఉంటుంది. ఒకవేళ ఇరువురిలో ఒకరికి అనారోగ్యం వస్తే దాని మిషగా హర్ట్ చేసుకోవడం సూటిపోటి మాటలనడం ఇంకా ప్రమాదం. అనారోగ్యకాలంలో భార్యాభర్తల మధ్య బంధం చాలా గట్టిగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యవంతులు అవుతారు. కుటుంబ ఆరోగ్యం కూడా కాపాడబడుతుంది.

7 అవాంఛిత స్నేహాలు: చేతిలో ఫోను... ఎవరెవరితోనో స్నేహాలు... భార్యకు తెలియకుండా భర్త, భర్తకు తెలియకుండా భార్య చేసే స్నేహాలు (లైంగికమే కానక్కర్లేదు) కాపురానికి ప్రమాదంగా మారుతాయి. అవి మానేయమని భర్త/భార్య కోరితే మానేయడమే మంచిది. కుటుంబం కంటే ఆ స్నేహం ముఖ్యం కాదు.

ఇవాళ న్యూస్‌పేపర్లలో వస్తున్న చాలా వార్తలు కుటుంబ జీవనంలో చోటు చేసుకుంటున్న పెను విషాదాలను చూపుతున్నాయి. కుటుంబం అందమైనది. అందరికీ అవసరమైనది. చాలా జాగ్రత్తగా కుటుంబాన్ని నిర్వహించాలి. ఆ సంగతి అందరూ అర్థం చేసుకోవాలి.



జొకోవిచ్‌కు చుక్కెదురు

రోమ్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) కథ ముగిసింది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ 2-6, 6-4, 2-6తో ఏడో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) చేతిలో ఓడిపోయాడు. 2004 తర్వాత రోమ్ మాస్టర్స్ టోర్నీలో జొకోవిచ్, నాదల్‌లలో ఒక్కరు కూడా లేకుండా తొలిసారి ఫైనల్ జరగనుంది.



అర్జున్ శుభారంభం

షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ శుభారంభం చేశాడు. బుధవారం మొదలైన ఈ టోర్నీలో పోలాండ్ గ్రాండ్‌మాస్టర్ కాస్పెర్ పియోరన్‌తో జరిగిన తొలి రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 32 ఎత్తుల్లో గెలుపొందాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్, తమిళనాడుకు చెందిన దొమ్మరాజు గుకేశ్ కూడా తొలి రౌండ్‌లో గెలిచాడు. వెస్కోవి (బ్రెజిల్)తో జరిగిన గేమ్‌లో గుకేశ్ 33 ఎత్తుల్లో విజయం సాధించాడు.

జ్యోతి 'పసిడి' పరుగు

100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం



రాంచీ: జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకంతో మెరిసింది. బుధవారం జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి విజేతగా నిలిచింది. జ్యోతి అందరికంటే వేగంగా 12.89 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. నిత్య రామరాజ్ (తమిళనాడు; 13.44 సెకన్లు) రజతం... సప్న కుమారి (జార్ఖండ్; 13.58 సెకన్లు) కాంస్యం గెలిచారు. తెలంగాణ అథ్లెట్ అగసార నందిని 13.65 సెకన్లతో ఐదో స్థానంలో నిలిచింది. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ లావేటి యశ్వంత్ కుమార్ 14.62 సెకన్లలో గమ్యానికి చేరి చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలిచాడు.


భారత ఆర్చరీ జట్లకు నిరాశ



షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీలో కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లకు నిరాశ ఎదురైంది. రెండు విభాగాల్లో భారత జట్లు క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయాయి. మహిళల టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి, అవ్‌నీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 228-231 (57-58, 57-58, 57-59, 57-56)తో హజల్ బురున్, ఇపెక్ తొమ్రుక్, ఇర్మక్ యుక్సెల్‌లతో కూడిన తుర్కియే జట్టు చేతిలో ఓడిపోయింది. ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె, రిషభ్ యాదవ్, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టుకు తొలి రౌండ్‌లో 'బై' లభించగా... రెండో రౌండ్‌లో 236-228తో ఇండోనేసియా జట్టును ఓడించింది. అనంతరం క్వార్టర్ ఫైనల్లో టీమిండియా 231-234తో మెక్సికో జట్టు చేతిలో పరాజయం పాలైంది. పురుషుల రికర్వ్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర 656 పాయింట్లు స్కోరు చేసి 13వ ర్యాంక్‌లో నిలిచాడు.

ఢిల్లీ గెలిచెన్...

- 15 పరుగులతో పంజాబ్ పరాజయం
- మెరిసిన రోసో, పృథ్వీ షా
- లివింగ్‌స్టోన్ పోరాటం వృథా


రోసో

ధర్మశాల: 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి నిష్క్రమించిన తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ ఇతర జట్ల సమీకరణాలను దెబ్బ తీసే పనిలో పడింది. పదునైన బ్యాటింగ్‌తో తొలిసారి సీజన్‌లో 200 పరుగుల స్కోరు చేసిన ఆ జట్టు పంజాబ్ కింగ్స్‌ను దెబ్బ కొట్టింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 15 పరుగుల తేడాతో పంజాబ్‌పై గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిలీ రోసో (37 బంతుల్లో 82 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), పృథ్వీ షా (38 బంతుల్లో 54; 7 ఫోర్లు, 1 సిక్స్), వార్నర్ (31 బంతుల్లో 46; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టు భారీ స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 198 పరుగులు చేసింది. లివింగ్‌స్టోన్ (48 బంతుల్లో 94; 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) చెలరేగగా, అథర్వ తైడే (42 బంతుల్లో 55; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఈ ఓటమితో పంజాబ్ ప్లే ఆఫ్ అవకాశాలు దాదాపుగా కోల్పోయింది!

మూడు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు...

వార్నర్ ఎప్పటిలాగే శుభారంభం అందించగా... చాలా రోజుల తర్వాత మళ్లీ మ్యాచ్ ఆడే అవకాశం దక్కించుకున్న పృథ్వీ షా దానిని సమర్థంగా వాడుకున్నాడు. రబడ ఓవర్లో వార్నర్ 2 సిక్స్‌లు కొట్టగా, అర్ష్‌దీప్ ఓవర్లో వరుస బంతుల్లో పృథ్వీ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 61 పరుగులకు చేరింది. తొలి వికెట్‌కు 62 బంతుల్లోనే 94 పరుగులు జోడించిన తర్వాత వార్నర్ వెనుదిరగ్గా, మూడో స్థానంలో వచ్చిన రోసో మరింత జోరుగా బ్యాటింగ్ చేశాడు. రబడ ఓవర్లో అతను 2 భారీ సిక్స్‌లతో పాటు ఫోర్ కొట్టాడు. ఆ తర్వాత 36 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న పృథ్వీ ఆ వెంటనే వెనుదిరిగాడు. రోసో, సాల్ట్ (14 బంతుల్లో 26 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో ఆఖరి 2 ఓవర్లలోనే ఢిల్లీ 41 పరుగులు రాబట్టింది. హర్‌ప్రీత్ వేసిన చివరి ఓవర్లో రోసో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టగా, అంతకుముందు ఎలిస్ వేసిన 19వ ఓవర్లో సాల్ట్ కూడా 2 సిక్స్‌లు, ఫోర్ బాదాడు. 25 బంతుల్లోనే రోసో హాఫ్ సెంచరీ చేయడం విశేషం.

లివింగ్‌స్టోన్ మెరుపులు...

శిఖర్ ధావన్ (0) డకౌట్ కావడంతో ఛేదనలో పంజాబ్‌కు సరైన ఆరంభం లభించలేదు. అయితే తైడే, ప్రభ్‌సిమ్రన్ (22) రెండో వికెట్‌కు 33 బంతుల్లో 50 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే వేగంగా ఆడలేకపోవడంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న తైడే 'రిటైర్డ్ అవుట్'గా తప్పుకోగా, జితేశ్ శర్మ (0) విఫలమయ్యాడు. మరోవైపు 3 పరుగుల వద్ద నోర్జే క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన లివింగ్‌స్టోన్ సిక్సర్లతో చెలరేగిపోయాడు. 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించిన అతని ఆటతోనే పంజాబ్ గెలుపుపై ఆశలు పెంచుకుంది. చివరి 4 ఓవర్లలో 79 పరుగులు చేయాల్సిన దశలో లివింగ్‌స్టోన్... ఖలీల్ ఓవర్లో రెండు, ముకేశ్ ఓవర్లో మూడు సిక్స్‌లు బాదాడు. 19వ ఓవర్లో అతనికి ఒక బంతే ఆడే అవకాశం రాగా... ఇషాంత్ వేసిన చివరి ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టినా అప్పటికే ఆలస్యమైపోయింది.


లివింగ్‌స్టోన్

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) ధావన్ (బి) స్యామ్ కరన్ 46; పృథ్వీ షా (సి) తైడే (బి) స్యామ్ కరన్ 54; రోసో (నాటౌట్) 82; సాల్ట్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 213. వికెట్ల పతనం:** 1-94, 2-148. **బౌలింగ్:** స్యామ్ కరన్ 4-0-36-2, రబడ 3-0-36-0, అర్ష్‌దీప్ 2-0-21-0, ఎలిస్ 4-0-46-0, చహర్ 4-0-35-0, హర్‌ప్రీత్ బ్రార్ 3-0-39-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) ధుల్ (బి) అక్షర్ 22; ధావన్ (సి) అమన్ (బి) ఇషాంత్ 0; అథర్వ తైడే (రిటైర్డ్ అవుట్) 55; లివింగ్‌స్టోన్ (సి) అక్షర్ (బి) ఇషాంత్ 94; జితేశ్ (సి) ఖలీల్ (బి) నోర్జే 0; షారుఖ్ (సి) అక్షర్ (బి) ఖలీల్ 6; స్యామ్ కరన్ (బి) నోర్జే 11; బ్రార్ (రనౌట్) 0; చహర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 198. వికెట్ల పతనం:** 1-0, 2-50, 3-128, 4-129, 5-147, 6-180, 7-180, 8-198. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-1-20-1, ఇషాంత్ శర్మ 3-0-36-2, నోర్జే 4-0-36-2, ముకేశ్ 4-0-52-0, అక్షర్ పటేల్ 3-0-27-1, కుల్దీప్ యాదవ్ 3-0-21-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
లక్నో	13	7	5	1	15	0.304
ముంబై	13	7	6	0	14	-0.128
బెంగళూరు	12	6	6	0	12	0.166
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	13	6	7	0	12	-0.308
ఢిల్లీ	13	5	8	0	10	-0.572
హైదరాబాద్	12	4	8	0	8	-0.575

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ x బెంగళూరు (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'ఐపీఎల్'తో రిటైలింగ్‌లోకి...

నవభారత్ లిమిటెడ్ ప్రణాళికలు



సాక్షి, హైదరాబాద్: పామాయిల్ ఉత్పత్తుల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన నవభారత్ లిమిటెడ్ (ఎన్‌బీఎల్) కంపెనీ ఇకపై మరింత విస్తరణకు సిద్ధమైంది. ఇప్పటి వరకు దాదాపు పూర్తిగా హోల్‌సేల్ అమ్మకాలకే పరిమితమైన ఎన్‌బీఎల్ ముందు రిటెయిలింగ్ ద్వారా ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది ఐపీఎల్‌లో హైదరాబాద్ టీమ్ 'సన్‌రైజర్స్'తో ఎన్‌బీఎల్ జత కట్టి తమ ప్రచార కార్యక్రమాలను వేదికగా మార్చుకుంది. తాజా సీజన్‌లో రైజర్స్‌కు 'సింప్లిఫై పార్ట్‌నర్'గా ఎన్‌బీఎల్ వ్యవహరించింది. బుధవారం ఎన్‌బీఎల్ బృందంతో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రైజర్స్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌తో పాటు కోచ్‌లు డేల్ స్టెయిన్, ముత్తయ్య మురళీధరన్, హేమంగ్ బదానీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌బీఎల్ సంస్థ పురోగతి గురించి సీఈఓ శ్రీనివాస ప్రసాద్ వెల్లడించారు. 'రూ. 40 కోట్లతో మొదలైన మా టర్నోవర్ ప్రస్తుతం రూ. 1700 కోట్లకు చేరింది. ఎక్కువగా పామాయిల్ ఉత్పత్తులపైనే దృష్టి పెట్టాం. సూపర్‌మతి ఆయిల్‌కు మంచి గుర్తింపు ఉంది. రిఫైనరీ ద్వారా రోజుకు సుమారు 850 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు తయారు చేస్తున్నాం. అయితే ఇప్పుడు ఆయిల్ రంగంలో ఇతర సంస్థలకు పోటీగా సన్‌ఫ్లవర్, రైస్‌బ్రాన్ ఆయిల్‌ల రంగంలో కూడా అడుగు పెడుతున్నాం. రిటైల్‌పై ఇక ముందు ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. అందుకే రెండు తెలుగు రాష్ట్రాల్లో జనం ఆసక్తి చూపించే ఐపీఎల్ ఫ్రాంచైజీతో జత కట్టి ప్రచారం చేశాం' అని వివరించారు.

'ఎమిలియా' ఎఫ్1 రేసు రద్దు



ఇమోలా (ఇటలీ): ఫార్ములావన్ (ఎఫ్1) సీజన్‌లో భాగంగా ఈనెల 21న ఇటలీలో జరగాల్సిన ఎమిలియా రొమాన్య గ్రాండ్‌ప్రి రేసు రద్దయింది. ఈ రేసుకు వేదికగా నిలవాల్సిన ఇమోలా ప్రాంతాన్ని భారీవర్షాలు, వరదలు ముంచెత్తాయి. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో రేసును నిర్వహించి అందరినీ ఇబ్బంది పెట్టే యోచన లేదని ఎఫ్1 నిర్వాహకులు తెలిపారు. సీజన్‌లోని తదుపరి రేసు మొనాకో గ్రాండ్‌ప్రి ఈనెల 28న జరుగుతుంది.

హారిక గేమ్ 'డ్రా'



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తొలి 'డ్రా' నమోదు చేసింది. జర్మనీ ప్లేయర్ దినారా వాగ్నర్‌తో బుధవారం జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను తెల్ల పావులతో ఆడిన హారిక 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది.

విజయంతో ముగింపు


ప్రణయ్


సుజౌ (చైనా): సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీని భారత జట్టు విజయంతో ముగించింది. గ్రూప్ 'సి'లో భాగంగా ఆస్ట్రేలియా జట్టుతో బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-1తో గెలుపొందింది. చైనీస్ తైపీ, మలేసియా జట్లతో జరిగిన తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో భారత్ ఓడిపోవడంతో నాకౌట్ దశకు అర్హత పొందలేకపోయింది. తొలి మ్యాచ్‌లో సాయిప్రతీక్-తనీషా క్రాస్టో 21-17, 14-21, 18-21తో కెనెత్ చూ-గ్రోన్యా సోమర్‌విలె చేతిలో ఓడిపోయారు. అనంతరం రెండో మ్యాచ్‌లో ప్రణయ్ 21-8, 21-8తో జాక్ యుపై నెగ్గడంతో స్కోరు 1-1తో సమమైంది. మూడో మ్యాచ్‌లో అనుపమ 21-16, 21-18తో టిఫానీ హోపై, నాలుగో మ్యాచ్‌లో అర్జున్-ధ్రువ్ 21-11, 21-12తో టాంగ్-రేన్ వాంగ్‌లపై, ఐదో మ్యాచ్‌లో తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప 21-19, 21-13తో కైట్లిన్-ఎంజెలా యులపై విజయం సాధించారు.

సినిమా

అట్టహాసంగా ఆరంభమైన కాన్స్ చిత్రోత్సవాలు

76వ కాన్స్ చిత్రోత్సవాలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఫ్రాన్స్‌లో ఈ నెల 16న మొదలైన ఈ చిత్రోత్సవాలు 27 వరకు కొనసాగుతాయి. ఎనిమిది మంది జ్యూరీ సభ్యులకు స్వీడన్‌కు చెందిన రూబెన్ ఓస్ట్‌లాండ్ సారథ్యం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార శాఖ డిప్యూటీ మినిస్టర్ ఎల్. మురుగన్ ఈ చిత్రోత్సవాల్లో ఇండియన్ టీమ్‌ను లీడ్ చేస్తున్నారు. 12 రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో పలువురు దేశ, విదేశీ తారలు రెడ్ కార్పెట్‌పై మెరవనున్నారు. ఇక తొలి రోజు వేడుక విశేషాల్లోకి వెళదాం.

- రెడ్ కార్పెట్‌పై మెరిసిన ఇండియన్ తారలు
- 'జాన్ ద్యు బెర్రీ' సినిమాకు ఏడు నిమిషాల స్టాండింగ్ ఒవేషన్


● జాన్ ద్యు బెర్రీలో ఓ దృశ్యం

ఏడు నిమిషాల స్టాండింగ్ ఒవేషన్

తొలి రోజు బయోగ్రాఫికల్ డ్రామా 'జాన్ ద్యు బెర్రీ' ప్రదర్శనతో ప్రారంభమై, చివరి రోజు ఉత్సవాలు 'ఎలిమెంటల్' సినిమా ప్రదర్శనతో ముగుస్తాయి. 'జాన్ ద్యు బెర్రీ' సినిమాలో ఓ లీడ్ రోల్ చేసిన జానీ డెప్ ఈ చిత్రోత్సవాలకు హాజరయ్యారు. ఈ చిత్ర ప్రదర్శన ముగిసిన తర్వాత వీక్షకులు ఏడు నిమిషాల పాటు స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడం విశేషం. తమ చిత్రానికి ఇంత అద్భుత స్పందన లభించిన నేపథ్యంలో జానీ డెప్ కళ్లు చెమర్చాయి. ఈ వీడియో వైరల్ అవుతోంది. మైవెన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

కాన్స్‌లో భారతీయం

ప్రతి ఏడాదీ కాన్స్ చిత్రోత్సవాల్లో భారతీయ తారలు మెరుస్తుంటారు.


● సారా అలీఖాన్


● ఈషా గుప్తా

ఈ ఏడాది తొలి రోజు హిందీ తారలు సారా అలీఖాన్, ఈషా గుప్తా, మానుషీ చిల్లర్, ఊర్వశీ రౌతేలా రెడ్ కార్పెట్‌పై మెరిశారు. కాగా సారా, ఈషా, మానుషీలు తొలిసారి కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొంటున్నారు. ఈ ముగ్గురితో పాటు ఊర్వశి కూడా రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు. దేశీ లుక్‌లో అగుపించిన సారాకి ప్రశంసలు లభించాయి. వీరు మాత్రమే కాదు.. ఇంకా హీరోయిన్లు అనుష్కా శర్మ, మృణాల్ ఠాకూర్, సన్నీ లియోన్, నాగాల్యాండ్ యాక్ట్రస్ ఆండ్రియా కెవిచుసాలు తొలిసారిగా ఈ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో పాల్గొంటారు. ఇంకా ఆస్కార్ అవార్డు విన్నింగ్ ప్రొడ్యూసర్ గునీత్ మోంగా, దర్శకుడు మధుర్ భండార్కర్, హీరోయిన్ అదితీరావ్ హైదరీ, నటుడు విజయ్‌వర్మ, దర్శకుడు విఘ్నేష్ శివన్ వంటి వారు పాల్గొననున్నట్లు సమాచారం. అలాగే దర్శకుడు అనురాగ్ కశ్యప్ తెరకెక్కించిన 'కెన్నెడీ', దర్శకుడు కను బెహ్ల్ తీసిన 'ఆగ్రా', మణిపూర్ దర్శకుడు అరిబామ్ శ్యామ్ శర్మ తెరకెక్కించిన 'ఇషానౌ', యుధాజిత్ బసు 'నెహెమిచ్' వంటి భారత చిత్రాలు కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితం కానున్నాయి. 'కెన్నెడీ' చిత్రంలోని ప్రధాన పాత్రల్లో ఒకరిగా నటించిన సన్నీ లియోన్ ఈ చిత్రం ప్రదర్శనలో భాగంగానే ఉత్సవాలకు హాజరవుతున్నారు.

రెండు దశాబ్దాలుగా...

కాన్స్ చిత్రోత్సవాలంటే చాలామంది ఐశ్వర్యా రాయ్ కోసం ఎదురు చూస్తారు. ఎందుకంటే దాదాపు రెండు దశాబ్దాలుగా కాన్స్ రెడ్ కార్పెట్‌పై ఐష్ మెరుస్తున్నారు. షారుక్ ఖాన్, ఐశ్వర్యా రాయ్, మాధురీ దీక్షిత్ ప్రధాన పాత్రల్లో సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందిన 'దేవదాస్' (2002) చిత్రం 55వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. అప్పట్నుంచి ఐశ్వర్యా రాయ్ క్రమం తప్పకుండా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరవుతున్నారు. ఈ ఏడాది చిత్రోత్సవాల్లో సందడి చేసేందుకు తన కూతురు ఆరాధ్యతో కలిసి ఐశ్వర్యా రాయ్ బుధవారం ముంబై నుంచి బయలుదేరారు.


● మానుషీ చిల్లర్


● ఊర్వశీ రౌతేలా

ఇక స్పీడ్‌గా సినిమాలు చేస్తాను
- నందినీ రెడ్డి

"డైరెక్టర్ పూరి జగన్నాథ్‌గారిలా నేను సినిమా కథని స్పీడ్‌గా రాయలేను. నాకు రచయితల టీమ్ లేదు. ఒక్కదాన్నే స్క్రిప్ట్‌ని రాసుకుంటాను.. ఇందుకు 7 నుంచి 9 నెలలు టైమ్ పడుతుంది. ఇప్పుడు రచయితల టీమ్‌ను పెట్టుకున్నాను. 'అన్నీ మంచి శకునములే' విడుదలకి నాకు మంచి స్లాట్ దొరికింది. కుటుంబమంతా కలిసి థియేటర్స్‌లో హాయిగా ఎంజాయ్ చేసేలా మా సినిమా ఉంటుంది" అని డైరెక్టర్ నందినీ రెడ్డి అన్నారు. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్రవిందా మూవీస్‌తో కలిసి ప్రియాంకా దత్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర దర్శకురాలు నందినీ రెడ్డి చెప్పిన విశేషాలు.



● 'అన్నీ మంచి శకునములే' కథ ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని విక్టోరియాపురం అనే ఊరిలో సాగుతుంది. సంతోష్, మాళవికతో పాటు మిగిలిన ఐదు పాత్రలకూ ప్రాధాన్యత ఉంటుంది. ఆ ఊరికి, ఈ పాత్రలకు, హీరో హీరోయిన్ల మధ్య ప్రేమకథకి సంబంధం ఏంటి? వంటి అంశాలన్నీ ఒకదానితో ఒకటి లింక్ అయి ఉంటాయి. 'హమ్ ఆప్‌కే హై కౌన్' సినిమాలో ప్రతి పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు.. అలా మా సినిమాలోనూ ప్రతి పాత్రకి స్పేస్ ఇవ్వాలని చూసుకున్నాం.. అదే నాకు పెద్ద సవాల్‌గా అనిపించింది.

● 'అన్నీ మంచి శకునములే' కథ చాలా సింపుల్‌గా ఉంటుంది. 'పెళ్ళిచూపులు' సమయంలో విజయ్ దేవరకొండకి 'అన్నీ మంచి శకునములే' కథ సరిపోతుందనుకున్నాను. అయితే ఆ తర్వాత తన స్టార్‌డమ్ మారిపోవడంతో ఈ కథ సెట్ కాదనుకున్నాను. హీరో పాత్ర చాలా కూల్‌గా ఉంటుంది.. అందుకే ఆ పాత్రకి సంతోష్ న్యాయం చేయగలడని తీసుకున్నాం. ఈ కథకి హీరోను మార్చి పెద్ద రేంజ్‌లో తీయాలంటే కుదరదు.. కథకు గౌరవం ఇవ్వాలి.. లేదంటే దేనికీ న్యాయం చేయలేం. సంతోష్, మాళవిక తమ పాత్రలకు వంద శాతం న్యాయం చేశారు.. ఎమోషన్స్ అద్భుతంగా పండించారు. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో బెస్ట్ క్లయిమాక్స్ ఈ సినిమాకు రాశాననుకుంటున్నాను.

● కథ డిమాండ్ మేరకే చాలా విరామం తర్వాత షావుకారు జానకి, గౌతమి, వాసుకి వంటివారిని తీసుకున్నాను. రచయిత లక్ష్మీభూపాల్ నా బ్రదర్ లాంటివాడు.. నా సినిమాకు ప్రేమతో రాస్తాడు. 'ఓ బేబీ' తర్వాత మిక్కీ జె. మేయర్ 'అన్నీ మంచి శకునములే'కి అద్భుతమైన పాటలు, క్లయిమాక్స్ ఫీల్‌కు అనుగుణంగా నేపథ్య సంగీతం ఇచ్చాడు. మేకింగ్‌లో అశ్వినీదత్‌గారు, స్వప్న, ప్రియాంక, నాగ్ అశ్విన్.. ఎవరూ కల్పించుకోలేదు. ఇప్పటివరకూ నాకు ఒక్కో సినిమాకి యావరేజ్‌గా రెండేళ్లు పట్టింది.. ఇకపై వేగంగా సినిమాలు చేస్తాను. నా తర్వాతి సినిమా సిద్ధు జొన్నలగడ్డతో ఉంటుంది. అందులో సమంత నటిస్తారా? లేదా అనేది ఇప్పుడే చెప్పలేను. ఈ సినిమా కథ ఎవరూ ఊహించలేని విధంగా సరికొత్తగా ఉంటుంది.

పెళ్లికి తేదీ కుదిరింది


● నిశ్చితార్థ వేడుకలో శర్వానంద్, రక్షిత

హీరో శర్వానంద్ వివాహానికి ముహూర్తం ఖరారైంది. జైపూర్‌లోని లీలా ప్యాలెస్‌లో జూన్ 3న శర్వానంద్, రక్షితల వివాహం జరగనుంది. జూన్ 2న మెహందీ ఫంక్షన్ జరుగుతుంది. మరుసటి రోజు శర్వానంద్‌ని పెళ్లి కొడుకుని చేస్తారు. అదే రోజు అంటే జూన్ 3న రాత్రి 11గంటల సమయంలో శర్వానంద్, రక్షితల వివాహ వేడుక ప్రారంభం అవుతుంది. ఈ పెళ్లికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో శర్వానంద్, రక్షితల నిశ్చితార్థం జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది.

నేను కూడా యూత్ అనిపించింది
- హీరో నాని


● బుచ్చిబాబు, శ్రీకాంత్, నాని, సుమంత్ ప్రభాస్

"మేమంతా యూత్ అని గర్వంగా చెప్పుకునే టీమ్ నన్ను ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి పిలిచారంటే నేనూ యూత్ అనే ఎగ్జైట్‌మెంట్ కలిగింది'' అన్నారు హీరో నాని. సుమంత్ ప్రభాస్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ఓ ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– ''సుమంత్ ప్రభాస్ తీసిన షార్ట్ ఫిల్మ్స్ చూసి తనలో మంచి ఛార్మ్ ఉందనుకున్నాను. ఇప్పుడు తనే హీరోగా, దర్శకుడిగా 'మేమ్ ఫేమస్' చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు నాని. ''వల్గారిటీ లేని సినిమా ఇది'' అన్నారు సుమంత్ ప్రభాస్. ''యూత్ అనుకున్నది సాధిస్తారని చెప్పే కథే ఈ సినిమా'' అన్నారు నిర్మాతలు.

బిచ్చగాడు 2 కోసం ప్రాణం పెట్టారు
- అడివి శేష్


● కావ్యా థాపర్, ఫాతిమా, విజయ్, అడివి శేష్, పూరి ఆకాశ్

''సినిమా కోసం ప్రాణం పెట్టి చేశామని అందరూ చెబుతుంటారు. కానీ, 'బిచ్చగాడు 2' కోసం విజయ్, ఫాతిమాగార్లు నిజంగా ప్రాణం పెట్టి పనిచేశారు. వారికోసమైనా 'బిచ్చగాడు 2' హిట్టవ్వాలి'' అన్నారు హీరో అడివి శేష్. విజయ్ ఆంటోని హీరోగా నటించి, దర్శకత్వం వహించడంతో పాటు సంగీతమందించిన చిత్రం 'బిచ్చగాడు 2'. కావ్యా థాపర్ హీరోయిన్. ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. కాగా తెలుగులో ఈ చిత్రాన్ని ఉషా పిక్చర్స్‌పై విజయ్ కుమార్, వీరనాయుడు రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరోలు అడివి శేష్, ఆకాశ్ పూరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''విజయ్ ఆంటోనిగారిని ఇంతవరకు ప్రేమిస్తూ వచ్చాను.. కానీ ఆయన్ను కలిశాక గౌరవం మొదలైంది. 'బిచ్చగాడు 2' పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''బిచ్చగాడు' తొలి భాగం నచ్చినవారికి రెండో భాగం కూడా నచ్చుతుంది'' అన్నారు. ''నేను సినిమాకు కేవలం నిర్మాతను మాత్రమే. అన్నీ మా ఆయన (విజయ్ ఆంటోని) చూసుకున్నారు. ఆయన ప్రమాదానికి గురైనా.. అభిమానుల ప్రేమ వల్లే కోలుకున్నారు'' అన్నారు ఫాతిమా విజయ్ ఆంటోని.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	372	61,561
నిఫ్టీ ▽	105	18,182

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	12,480	▲	137
డోజోన్స్	33,398	▲	386
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,723	▽	28
డాక్స్	15,951	▲	54
షాంఘై	3,284	▽	7
నికాయ్	30,094	▲	251

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	60,550
బంగారం (22 క్యారెట్)	57,180
వెండి (కిలో)	74,600

మరోసారి చర్చలకు టెస్లా



న్యూఢిల్లీ: ప్రభుత్వంతో మరోసారి చర్చలకు టెస్లా సిద్ధమైంది. 'సమావేశం కోసం టెస్లా ప్రతినిధులు సంప్రదించారు. దిగుమతి సుంకంలో తగ్గింపు ఇవ్వాలని కంపెనీ గతంలో ప్రతిపాదించింది. దేశీయ తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నందున కంపెనీ చేసిన ప్రతిపాదన ఆమోదించలేదు. ఇప్పుడు వారు అదే ప్రతిపాదనతో వస్తున్నారా లేదా మరొక ప్రతిపాదనను తీసుకువస్తున్నారా అనేది మాకు తెలియదు' అని ఒక అధికారి తెలిపారు. కాగా, భారత్‌లో తమ కార్లను మొదట విక్రయించడానికి, సర్వీస్ చేయడానికి అనుమతిస్తే తప్ప.. కంపెనీ దేశీయంగా తమ ఉత్పత్తులను తయారు చేయదని టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ గతేడాది స్పష్టం చేశారు. దిగుమతి చేసుకున్న వాహనాలతో మొదట విజయం సాధిస్తే, భారత్‌లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయవచ్చని ఆయన చెప్పారు. టెస్లా తన వాహనాలను ఇక్కడి మార్కెట్లో విడుదల చేయాలని భావిస్తోందని, అయితే దిగుమతి సుంకాలు ప్రపంచంలోనే ఇక్కడ అత్యధికం అని మస్క్ అన్నారు. 'టెస్లా తన ఎలక్ట్రిక్ వాహనాలను భారత్‌లో తయారు చేయడానికి సిద్ధంగా ఉంటే అప్పుడు ఏమీ సమస్య లేదు. కానీ కంపెనీ ఎట్టిపరిస్థితుల్లో చైనా నుండి కార్లను దిగుమతి చేసుకోవడానికి వీల్లేదు' అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అంతకు ముందు తెలిపారు.

సోనాలికా ట్రాక్టర్స్ స్పీడ్

హైదరాబాద్: ట్రాక్టర్ బ్రాండ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సోనాలికా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూడా పటిష్ట వృద్ధి రేటుతో తన ప్రయాణాన్ని కొనసాగించింది. ఈ మేరకు విడుదలైన సంస్థ ప్రకటన ప్రకారం, ఏప్రిల్‌లో సంస్థ 12,590 ట్రాక్టర్లను విక్రయించింది.



తద్వారా మార్కెట్ షేర్‌లో దాదాపు 1.9 శాతాన్ని సొంతం చేసుకుంది. రైతుల అవసరాలు తీర్చడంలో అత్యాధునిక సాంకేతిక విలువలతో బ్రాండ్ పెంచిన విశ్వసనీయతే సోనాలికా అమ్మకాలు పెరగడానికి కారణమని ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ ప్రకటనలో పేర్కొన్నారు.

భారత్‌లో అత్యంత సంపన్నులు తగ్గారు!

- 30 మిలియన్ డాలర్లు సంపద పైబడిన వారిపై నైట్ ఫ్రాంక్ నివేదిక
- గత ఏడాది 7.5 శాతం డౌన్
- అయితే వచ్చే ఐదేళ్లలో భారీ పెరుగుదల అంచనాలు



న్యూఢిల్లీ: భారతదేశంలో 30 మిలియన్ డాలర్ల (రూ.246 కోట్లు) పైన నెట్‌వర్త్ ఉన్న అల్ట్రా–హై–నెట్–వర్త్ వ్యక్తుల సంఖ్య గత ఏడాది 7.5 శాతం తగ్గి 12,069కి చేరినట్లు నైట్ ఫ్రాంక్ తాజా నివేదిక పేర్కొంది. అయితే రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య 19,119 పెరుగుతుందని నైట్ ఫ్రాంక్ తెలిపారు. ఇదే జరిగితే పెరుగుదల పరిమాణం 58.4 శాతమన్నమాట. "ది వెల్త్ రిపోర్ట్ 2023" శీర్షికన ఆయా అంశాలకు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ తాజా నివేదిక తెలిపిన ఆసక్తికరమైన అంశాలను పరిశీలిస్తే...

- భారత్ బిలియనీర్లు 2021లో 145 ఉంటే, 2022నాటికి 161కి పెరిగింది. 2027 నాటికి 195 మందికి ఈ సంఖ్య పెరుగుతుందని అంచనా.
- దేశంలో మిలియన్ డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ ఆస్తి విలువ కలిగిన సంపన్నుల జనాభా 2021లో 7,63,674 ఉంటే, 2022లో 7,97,714కి పెరిగింది. 2027 నాటికి ఈ జనాభా 16,57,272కు చేరుతుందని అంచనా...
- భారత్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా 2022లో అల్ట్రా–హై–నెట్–వర్త్ వ్యక్తుల సంఖ్య 3.8 శాతం తగ్గింది. 2021లో మాత్రం 9.3 శాతం పెరిగింది.
- ఆర్థిక మందగమనాలు, తరచుగా రుణ రేట్ల పెంపుదల, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి, స్టాక్ మార్కెట్ ఒడిదుడుకుల కారణంగా అత్యంత సంపన్నుల సంపద, పెట్టుబడి పోర్ట్‌ఫోలియో ప్రభావితమవుతోంది.
- భారత్ విషయానికి వస్తే, వడ్డీరేట్ల పెరుగుదల, రూపాయిపై డాలర్ బలోపేతం వంటి అంశాలు వ్యక్తుల నెట్‌వర్త్ పెరుగుదలపై ప్రభావితం చూపిస్తోంది.

వృద్ధి బాట...



పారిశ్రామిక, పారిశ్రామికేతర రంగాలలో భారత్ ఇటీవల చక్కటి అభివృద్ధిని నమోదుచేసుకుంటోంది. ఆయా కార్యకలాపాలు ఇటీవలి కాలంలో దేశంలో ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడంలో దోహదపడ్డాయి. కొత్త సంపదను సృష్టించే గ్లోబల్ స్టార్టప్ హబ్‌గా భారతదేశం కీలక స్థానంలో ఉంది. దేశంలో గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ స్టార్టప్‌లు మొదలైన రంగాల నుండి వెలువడుతున్న కొత్త అవకాశాలు ఆర్థిక ఊపును ప్రోత్సహిస్తున్నాయి. సంపద సృష్టికి దోహదపడతాయి, ఇవన్నీ భారత్‌లో అత్యంత సంపన్నుల సంఖ్య పెరగడానికి తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి

– శిశిర్ బైజల్, నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ

హ్యుందాయ్, షెల్ జోడీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా తాజాగా ఎనర్జీ రంగంలో ఉన్న షెల్ ఇండియాతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా హ్యుందాయ్‌కి చెందిన 36 డీలర్‌షిప్ కేంద్రాల వద్ద 60 కిలోవాట్ ఫాస్ట్ చార్జర్లను షెల్ ఏర్పాటు చేస్తుంది. దేశంలో బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల కోసం చార్జింగ్ మౌలిక సదుపాయాల విస్తరణను పెంచడం ఈ వ్యూహాత్మక భాగస్వామ్య లక్ష్యం అని కంపెనీ తెలిపింది.



'కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న జాతీయ లక్ష్యాన్ని సాధించడానికి వినియోగదారులు ఎలక్ట్రిక్ వాహనాలను స్వీకరించడాన్ని వేగవంతం చేయడంలో ఇటువంటి వ్యూహాత్మక భాగస్వామ్యాలు ప్రాథమికమైనవి' అని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ తెలిపారు. హ్యుందాయ్ ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల కోసం దేశవ్యాప్తంగా 45 నగరాల్లో 72 కేంద్రాలను నిర్వహిస్తోంది.

ఎస్‌పీ హిందుజా ఇక లేరు

87 ఏళ్ల వయసులో లండన్‌లో మృతి



న్యూఢిల్లీ: హిందుజా గ్రూప్ చైర్మన్, హిందుజా సోదరుల్లో అందరి కంటే పెద్ద అయిన శ్రీచంద్ పరమానంద్ హిందుజా (ఎస్‌పీ హిందుజా) 87 ఏళ్ల వయసులో, అనారోగ్యంతో బుధవారం లండన్‌లో తుది శ్వాస విడిచారు. తమ కుటుంబ పెద్ద, హిందుజా గ్రూప్ చైర్మన్ ఎస్‌పీ హిందుజా మృతి పట్ల సోదరులు గోపీచంద్, ప్రకాశ్, అశోక్, కుటుంబ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. ఎస్‌పీ హిందుజా భార్య మధు సైతం 82 ఏళ్ల వయసులో ఈ ఏడాది జనవరిలోనే కన్నుమూశారు. వీరికి కుమార్తెలు షను, వినూ ఉన్నారు. దేశ విభజనకు ముందు భారత్‌లో భాగంగా ఉన్న కరాచీలో, వ్యాపార కుటుంబంలో ఎస్‌పీ హిందుజా జన్మించారు. భారత్ నుంచి బోఫోర్స్ సంస్థ కాంట్రాక్టు పొందే విషయంలో ఎస్‌పీ హిందుజా, ఆయన సోదరులు గోపీచంద్, ప్రకాశ్ కమీషన్లు తీసుకున్నట్టు అప్పట్లో ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2005లో ఢిల్లీ హైకోర్టు వీరిని నిర్దోషులుగా ప్రకటించింది.

వ్యాపార నేపథ్యం..

హిందుజా వ్యాపారాలను పరమానంద్ దీప్‌చంద్ హిందుజా ప్రారంభించారు. ప్రస్తుతం పాకిస్తాన్ ఆధీనంలోని సింధ్ ప్రాంతంలో వస్తు వాణిజ్యం నిర్వహించే వారు. 1919లో ఇరాన్‌కు వీరి కుటుంబం తరలిపోయింది. 1964లో రాజ్ కపూర్ నటించిన 'సంగం' సినిమాని మిడిల్‌ఈస్ట్ ప్రాంతంలో ఎస్‌పీ హిందుజా పంపిణీ చేసి, భారీ లాభాలు ఆర్జించారు. 1980లో అశోక్ లేలాండ్‌ను కొనుగోలు చేశారు. అనంతరం గల్ఫ్ ఆయిల్ ఇంటర్నేషనల్ నియంత్రణను షెవ్రాన్ నుంచి దక్కించుకున్నారు. 1993లో ఎస్‌పీ హిందుజా ఇండస్‌ఇండ్ బ్యాంక్ ద్వారా బ్యాంకింగ్‌లోకి ప్రవేశించారు. వీరి కుటుంబం బ్రిటన్‌లో స్థిరపడింది. బ్రిటన్, భారత్ మధ్య సంబంధాల బలోపేతంలోనూ వీరి పాత్ర ఉంది.

మహిళా సమ్మాన్ డిపాజిట్‌పై టీడీఎస్ లేదు



న్యూఢిల్లీ: కేంద్ర సర్కారు 2023–24 బడ్జెట్‌లో మహిళా సమ్మాన్ పేరుతో ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రకటించింది. గరిష్టంగా రూ.2 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వార్షిక వడ్డీ 7.5 శాతం. రెండేళ్లకు గడువు ముగుస్తుంది. మహిళల కోసమే ఈ డిపాజిట్‌ను తీసుకొచ్చింది. అయితే ఇందులో పెట్టుబడిపై వచ్చే వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుందని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) తాజాగా స్పష్టం చేసింది. అదే సమయంలో రాబడిపై టీడీఎస్ (మూలం వద్ద పన్ను కోత) అమలు చేయరని పేర్కొంది. సీబీడీటీ ఆదేశాల ప్రకారం మహిళా సమ్మాన్ సర్టిఫికెట్‌లో వచ్చే వడ్డీ ఆదాయం రూ.40వేలు మించకపోతే టీడీఎస్ వర్తించదని స్పష్టమవుతోందని నాంజియా అండర్సన్ ఇండియా పార్ట్‌నర్ నీరజ్ అగర్వాల్ తెలిపారు. ఈ పథకంలో గరిష్ట పెట్టుబడిపై ఒక ఏడాదిలో 7.5 శాతం మేరకు రాబడి రూ.15,000గానే ఉంటుందని, కనుక టీడీఎస్ వర్తించదన్నారు.

మార్కెట్‌కు రెండో రోజూ నష్టాలు..

ఐటీ షేర్లలో అమ్మకాలు

ముంబై: ఐటీ, బ్యాంకింగ్, టెక్నాలజీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో దేశీయంగా కీలక సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 372 పాయింట్లు క్షీణించి 61,561 వద్ద, నిఫ్టీ 105 పాయింట్లు తగ్గి 18,182 వద్ద ముగిశాయి. అంతర్జాతీయంగా సెంటిమెంట్ బలహీనంగా ఉండటం, అమెరికా మార్కెట్లు మందగమన భయాలను ఎదుర్కొనే ప్రయత్నాల్లో ఉండటం తదితర అంశాల నేపథ్యంలో దేశీ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఏప్రిల్‌లో అమెరికాలో అమ్మకాలు క్షీణించడం, రుణ పరిమితులపై చర్చలు కొనసాగుతూ ఉండటం వంటివి మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీసినట్లు ఆయన పేర్కొన్నారు. సెన్సెక్స్‌లో కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, హెచ్‌సీఎల్, ఇన్ఫీ, ఏషియన్ పెయింట్స్, విప్రో మొదలైనవి క్షీణించాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ, మారుతీ సుజుకీ, ఎస్‌బీఐ తదితర స్టాక్స్ లాభపడ్డాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం పెరగ్గా మిడ్‌క్యాప్ సూచీ 0.16 శాతం క్షీణించింది. కీలక సూచీల్లో రియల్టీ 1.29 శాతం, టెక్ 0.89 శాతం, యుటిలిటీస్ 0.82 శాతం, ఐటీ 0.79 శాతం, టెలికం 0.57 శాతం క్షీణించాయి. ఎఫ్‌ఎంసీజీ, ఇండస్ట్రియల్స్, ఆటో సూచీలు లాభపడ్డాయి.



ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ మార్కెట్లు లాభాల్లో చైనా, హాంకాంగ్ నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌ఐఐ) నికరంగా రూ. 149 కోట్లు కొనుగోళ్లు జరపగా, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ. 204 కోట్ల మేర విక్రయించాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

జేఎన్‌ఏఎఫ్ఏయూ యూనివర్సిటీలో బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జేఎన్‌ఏఎఫ్ఏయూ, అనుబంధ కళాశాలల్లో బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఏడీఈఈ)ని నిర్వహిస్తోంది.

» కోర్సులు, సీట్ల వివరాలు: బీఎఫ్ఏ(అప్లైడ్ ఆర్ట్)–50 సీట్లు, బీఎఫ్ఏ(పెయింటింగ్) –35 సీట్లు, బీఎఫ్ఏ(స్కల్ప్చర్)–20 సీట్లు, బీఎఫ్ఏ(యానిమేషన్)–60 సీట్లు, బీఎఫ్ఏ(ఫోటోగ్రఫీ)–50 సీట్లు, బీడిజైన్(ఇంటీరియర్ డిజైన్)–60 సీట్లు.
» అర్హత: ఇంటర్మీడియట్ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి. » ప్రోగ్రామ్ వ్యవధి: నాలుగేళ్లు.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది: 05.06.2023.
» రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది: 12.06.2023.
» ప్రవేశ పరీక్ష తేదీలు:17.06.2023, 18.06.2023.
» వెబ్‌సైట్: www.jnafauadmissions.com

తెలంగాణ హైకోర్టులో 96 స్టెనోగ్రాఫర్ పోస్టులు

తెలంగాణ హైకోర్టు రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 96
» అర్హత: గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి. వయసు: 18 నుంచి 34 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.32,810 నుంచి రూ.96,890 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 25.05.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.06.2023.
» వెబ్‌సైట్: www.tshc.gov.in

తెలంగాణ హైకోర్టులో 84 కాపీస్ట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టు రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పనిచేసేందుకు కాపీస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 84
» అర్హత: 12వ తరగతి/ఇంటర్మీడియట్/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి.

వయసు: 18 నుంచి 34 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.22,900 నుంచి రూ.69,150 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ టెస్ట్(స్కిల్ టెస్ట్) ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 25.05.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.06.2023.
» స్కిల్ టెస్ట్ తేది: జూలై 2023.
» వెబ్‌సైట్: www.tshc.gov.in

తెలంగాణ హైకోర్టులో 144 టైపిస్ట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టు రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో టైపిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 144
» అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి.
» వయసు: 18 నుంచి 34 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ టెస్ట్(స్కిల్‌టెస్ట్) ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 25.05.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.06.2023.
» స్కిల్ టెస్ట్ తేది: జూలై 2023.
» వెబ్‌సైట్: www.tshc.gov.in

ఏపీ డీఈఈసెట్-2023

ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యా విభాగం.. 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల డీఈఎల్ఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు డీఈఈసెట్–2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. డీఈఈసెట్ ర్యాంక్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్‌లు/ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

» పరీక్ష: ఏపీ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈసెట్)–2023
» కోర్సు: డీఈఎల్ఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్).
» అర్హత: కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. వయసు:01.09.2023 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.
» ఎంపిక విధానం: డీఈఈసెట్‌లో సాధించిన ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 28.05.2023.
» హాల్ టిక్కెట్ల జారీ తేది: 05.06.2023.
» ప్రవేశ పరీక్ష తేదీలు: 12.06.2023 నుంచి 13.06.2023.
» వెబ్‌సైట్: www.apdeecet.apcfss.in

విడుదలైన యూపీఎస్సీ జాబ్ క్యాలెండర్

దేశంలో అత్యున్నత నియామక సంస్థ.. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ). జాతీయ స్థాయిలో ఏటా సివిల్స్‌తో పాటు పలు కేంద్ర సర్వీసులకు నియామక పరీక్షలను కమిషన్ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు పోటీపడుతుంటారు. యూపీఎస్సీ తాజాగా 2024 సంవత్సరానికి సంబంధించి వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేసింది. నోటిఫికేషన్ విడుదల తేదీ, దరఖాస్తులకు చివరి తేదీలతోపాటు పరీక్ష తేదీలను సైతం ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. యూపీఎస్సీ ఎగ్జామ్ క్యాలెండర్-2024లో పేర్కొన్న పరీక్షల వివరాలు..

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

దేశంలోని సివిల్స్ వంటి ఉన్నత సర్వీసుల్లో చేరాలని కలలు కనే అభ్యర్థుల సంఖ్య లక్షల్లో ఉంటుంది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులకు అభ్యర్థులను ఎంపిక చేసే మూడంచెల పరీక్ష.. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్! ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- నోటిఫికేషన్ తేది: 2024 ఫిబ్రవరి 14
- దరఖాస్తుకు చివరితేది: 2024 మార్చి 5
- ప్రిలిమినరీ పరీక్ష తేది: 2024 మే 26
- మెయిన్ ఎగ్జామినేషన్ తేది: 2024 సెప్టెంబర్ 20

ఎన్‌డీఏ,ఎన్ఏ ఎగ్జామినేషన్- 2024

త్రివిధ దళాల్లో ఎంట్రీ లెవల్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ(ఎన్ఏ) ఎగ్జామినేషన్. ఈ పరీక్ష ద్వారా ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీల్లోకి చురుకైన యువతను ఎంపిక చేసి.. శిక్షణనిచ్చి.. దేశ రక్షణలో భాగస్వాములను చేస్తారు. త్రివిధ దళాల్లో లెఫ్టినెంట్ హోదా మొదలు.. జనరల్, అడ్మిరల్, ఎయిర్ చీఫ్ మార్షల్ వరకూ.. ఇలా.. వివిధ ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా.. ఎన్‌డీఏ, ఎన్ఏలో శిక్షణ పొందిన వారే. ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఎన్‌డీఏ, ఎన్ఏలలో అడుగు పెట్టొచ్చు. ప్రతి ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

ఎన్‌డీఏ,ఎన్ఏ ఎగ్జామినేషన్(1)–2024 తేదీలు:
- నోటిఫికేషన్ తేది: 2023 డిసెంబర్ 20
- దరఖాస్తుకు చివరితేది: 2024 జనవరి 9
- పరీక్ష తేది: 2024 ఏప్రిల్ 21

ఎన్‌డీఏ,ఎన్ఏ ఎగ్జామినేషన్(2)–2024 తేదీలు:

» సివిల్స్ నుంచి సీడీఎస్ వరకూ వివిధ పరీక్షల తేదీలు వెల్లడి
» పరీక్షల నిర్వహణలో నిర్దిష్ట షెడ్యూల్‌ను అనుసరిస్తున్న యూపీఎస్సీ

- నోటిఫికేషన్ తేది: 2024 మే 15
- దరఖాస్తుకు చివరి తేది: 2024 జూన్ 4
- పరీక్ష తేది: 2024 సెప్టెంబర్ 1.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్-2024

డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించి.. కన్జర్వేటర్ వంటి ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు మార్గం.. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్). ఐఎఫ్ఎస్‌ను కూడా ఆల్ ఇండియా సర్వీస్‌గానే పేర్కొంటారు. బీఎస్సీ, బీటెక్, అగ్రికల్చరల్ బీఎస్సీ తదితర సైన్స్, ఇంజనీరింగ్ డిగ్రీ అర్హతలతో ఈ పరీక్షకు పోటీపడొచ్చు.

- నోటిఫికేషన్ తేది: 2024 ఫిబ్రవరి 14
- దరఖాస్తుకు చివరి తేది: 2024 మార్చి 5
- ప్రిలిమినరీ పరీక్ష తేది: 2024 మే 26
- మెయిన్ పరీక్ష తేది: 2024 నవంబర్ 24

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగం కోరుకునే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు చక్కటి అవకాశం.. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ఈఎస్ఈ). ఇందులో విజయం సాధిస్తే కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్నత కొలువు సొంతం చేసుకోవచ్చు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ తదితర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈఎస్ఈకి అర్హులు.

- నోటిఫికేషన్ తేది: 2023 సెప్టెంబర్ 6
- దరఖాస్తుకు చివరి తేది: 2023 సెప్టెంబర్ 26
- ప్రిలిమినరీ పరీక్ష తేది: 2024 ఫిబ్రవరి 18
- మెయిన్ పరీక్ష తేది: 2024 జూన్ 23

సీడీఎస్ ఎగ్జామినేషన్-2024

త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకులో..ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్(సీడీఎస్) ఎగ్జామినేషన్. ఇందులో విజయం సాధిస్తే..కొలువు ఖరారు కావడమే కాకుండా.. శిక్షణ సమయంలోనే ప్రతి నెలా స్టయిఫండ్ సైతం పొందొచ్చు. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో సీడీఎస్‌కు పోటీపడొచ్చు. ప్రతి ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

సీడీఎస్ ఎగ్జామినేషన్(1)–2024 తేదీలు:
- నోటిఫికేషన్ తేది: 2023 డిసెంబర్ 20
- దరఖాస్తుకు చివరితేది: 2024 జనవరి 9
- పరీక్ష తేది: 2024 ఏప్రిల్ 21



సీడీఎస్ ఎగ్జామినేషన్(2)–2024 తేదీలు:
- నోటిఫికేషన్ తేది: 2024 మే 15
- దరఖాస్తుకు చివరి తేది: 2024 జూన్ 4
- పరీక్ష తేది: 2024 సెప్టెంబర్ 1

కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్-2024

కేంద్ర జలవనరులు, గనుల మంత్రిత్వ శాఖల్లోని ఉన్నతస్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకునేందుకు మార్గం.. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో జియాలజిస్ట్, జియోఫిజిసిస్ట్, కెమిస్ట్ హైడ్రోజియాలజిస్ట్ తదితర పోస్టులను ఈ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. జియలాజికల్ సైన్స్, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ తదితర విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ పరీక్షకు అర్హులు.

- నోటిఫికేషన్ తేది: 2023 సెప్టెంబర్ 20
- దరఖాస్తుకు చివరి తేది: 2023 అక్టోబర్ 10
- ప్రిలిమినరీ పరీక్ష తేది: 2024 ఫిబ్రవరి 18
- మెయిన్ పరీక్ష తేది: 2024 జూన్ 22

ఐఈఎస్/ఐఎస్ఎస్ ఎగ్జామినేషన్ 2024

ఐఈఎస్/ఐఎస్ఎస్ ఎగ్జామినేషన్ 2024 ద్వారా.. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్(ఐఈఎస్), ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐఎస్ఎస్)ల్లో చేరొచ్చు. ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనోమెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన వారు ఐఈఎస్‌కు; స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/ అప్లైడ్ స్టాటిస్టిక్స్‌లో ఏదైనా ఒక సబ్జెక్టుతో బ్యాచిలర్ డిగ్రీ(లేదా) ఇవే సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ చదివిన వారు ఐఎస్ఎస్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- నోటిఫికేషన్ తేది: 2024 ఏప్రిల్ 10
- దరఖాస్తుకు చివరి తేది: 2024 ఏప్రిల్ 30
- పరీక్ష తేది: 2024 జూన్ 21.

కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

కేంద్ర వైద్యారోగ్య సర్వీసుల్లో 'డాక్టర్లు'గా చేరేందుకు వీలుకల్పించే పరీక్ష.. కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఎంఎస్ఈ). దీని ద్వారా ఇండియన్ రైల్వే, ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, సెంట్రల్ హెల్త్ సర్వీస్ విభాగాల్లో.. 'మెడికల్ ఆఫీసర్' పోస్టులు భర్తీ చేస్తారు. ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారు సీఎంఎస్ఈకి దరఖాస్తు చేసుకోవచ్చు.

- నోటిఫికేషన్ తేది: 2024 ఏప్రిల్ 10
- దరఖాస్తుకు చివరితేది: 2024 ఏప్రిల్ 30
- పరీక్ష తేది: 2024 జూలై 14.

సీఏపీఎఫ్ (అసిస్టెంట్ కమాండెంట్స్) ఎగ్జామినేషన్-2024

బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర కేంద్ర సాయుధ బలగాల్లో ఆఫీసర్ కేడర్ పోస్టుల్లో చేరేందుకు మార్గం..సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్) (అసిస్టెంట్ కమాండెంట్స్) ఎగ్జామినేషన్. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ పరీక్షకు అర్హులు.

- నోటిఫికేషన్ తేది: 2024 ఏప్రిల్ 24
- దరఖాస్తుకు చివరితేది: 2024 మే 14
- పరీక్ష తేది: 2024 ఆగస్టు 4

- వీటితోపాటు సీఐఎస్ఎఫ్ ఏసీ(ఈఎక్స్ఈ) ఎల్‌డీసీఈ–2024 నోటిఫికేషన్ 2023 నవంబర్ 29న వెలువడనుంది. దరఖాస్తుకు చివరితేదీ 2023 డిసెంబర్ 19. పరీక్ష తేదీ 2024 మార్చి 10. అదేవిధంగా ఎస్.ఒ./స్టెనో(జీడీ–బి/జీడీ–1) ఎల్‌డీసీఈ–2024 నోటిఫికేషన్ 2024 సెప్టెంబర్ 11న వెలువడనుంది. దరఖాస్తులకు చివరి తేది 2024 అక్టోబర్ 1. పరీక్ష తేది 2024 డిసెంబర్ 07. అంతేకాకుండా యూపీఎస్సీ రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆర్‌టీ)ల కోసం 2024 జనవరి 13, ఫిబ్రవరి 24, మార్చి 9, జూలై 6, ఆగస్టు 10, అక్టోబర్ 19, డిసెంబర్ 21 తేదీలను రిజర్వ్ చేశారు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in

క్లుప్తంగా...

శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల షెడ్యూల్‌ విడుదల

తిరుమల :తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లను బుక్‌ చేసుకునే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా టీటీడీ షెడ్యూల్‌ విడుదల చేసింది. సేవా టికెట్లు లేదా దర్శన టికెట్ల విడుదల తేదీ ఆదివారం వచ్చినట్లయితే వాటిని మరుసటి రోజు విడుదల చేస్తుంది. ప్రతినెలా 18 నుంచి 20వ తేదీ వరకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల లక్కీ డిప్‌ కోసం నమోదు చేసుకోవచ్చు. 20 నుంచి 22వ తేదీ వరకు డిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌ సేవ, సహస్రదీపాలంకార సేవలతోపాటు వర్చువల్‌ సేవా టికెట్లను 21వ తేదీన విడుదల చేస్తారు. శ్రీవాణి, అంగ ప్రదక్షిణ, వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్లు 23వ తేదీన విడుదలవుతాయి. రూ.300 దర్శన టికెట్ల కోటాను 24న,గదుల కోటాను 25న, తిరుమలలో గదుల కోటాను 26న విడుదల చేస్తుంది.

ఉర్దూ అకాడమీ సభ్యులుగా ముగ్గురు నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ పాలక మండలికి ప్రభుత్వం బుధవారం ముగ్గురు సభ్యులను నియమించింది. చిత్తూరు జిల్లా పీలేరుకు చెందిన షేక్‌ అబ్దుల్‌ కలీం, కృష్ణాజిల్లాకు చెందిన షేక్‌ దిల్షాద్‌ నజరానా, నంద్యాల జిల్లాకు చెందిన ఎస్‌.మూర్తజావళి ఉర్దూ అకాడమీ సభ్యులుగా నియమితులయ్యారు. వీరు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎండీ ఇంతియాజ్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

అసాంక్రమిక వ్యాధుల కట్టడికి 'హార్ట్స్‌' వ్యూహం

ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు



సాక్షి, న్యూఢిల్లీ : అసాంక్రమిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం వంటి వాటి వ్యాప్తిని నిరోధించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన 'హార్ట్స్‌' వ్యూహాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఏపీ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జీ-20 సదస్సు భాగస్వామ్యంతో బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో కృష్ణబాబు మాట్లాడారు. గుండెజబ్బుతో మరణిస్తున్న వారి సంఖ్య ప్రపంచ సరాసరి కన్నా భారత్‌లో ఎక్కువగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన 'హార్ట్స్‌' వ్యూహం అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గుండె జబ్బు మరణాలు తగ్గించడానికి ఏపీ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని వివరించారు. 2025 నాటికి 7.5 కోట్ల మందికి ప్రామాణిక వైద్య, ఆరోగ్య సేవలందించాలని నిర్ణయించామని తెలిపారు.

ఎన్జీటీ తీర్పుపై సుప్రీంకోర్టు పాక్షిక స్టే

పర్యావరణ ఉల్లంఘనలపై రూ.25 కోట్లు చెల్లించాలని ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని ఆవులపల్లి, ముదివేడు, నేతిగుంటపల్లి రిజర్వాయర్ల నిర్మాణానికి సంబంధించి జాతీయ హరిత ట్రిబ్యునల్‌ (ఎన్జీటీ) ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు పాక్షికంగా స్టే విధించింది. ఎన్జీటీ విధించిన రూ.100 కోట్ల జరిమానాలో రూ.25 కోట్లు మాత్రమే కృష్ణానది యాజమాన్య నిర్వహణ బోర్డు (కేఆర్‌ఎంబీ)కి చెల్లించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. రూ.100 కోట్ల జరిమానా విధిస్తూ ఎన్జీటీ ఇచ్చిన తీర్పును సవాల్‌ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్‌ సంజీవ్‌ ఖన్నా, జస్టిస్‌ ఎం.ఎం.సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్‌ న్యాయవాది ముకుల్‌ రోహత్గి వాదనలు వినిపిస్తూ ఎన్జీటీ తీర్పుపై స్టే విధించాలని కోరారు. రూ.100 కోట్ల జరిమానా అంటే రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రభారం పడుతుందన్నారు. జరిమానా ఎత్తివేయాలని కోరారు. అనంతరం ఎన్జీటీ తీర్పుపై పాక్షికంగా స్టే విధిస్తూ.. రూ.25 కోట్లు ఎనిమిది వారాల్లో కేఆర్‌ఎంబీకి చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది. రిజర్వాయర్ల పనుల నిలిపివేతపై ఎన్జీటీ ఆదేశాలపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది.

అవినాశ్‌రెడ్డి పిటిషన్‌ను విచారించనున్న వెకేషన్‌ బెంచ్‌

సీబీఐ విచారణ నుంచి రక్షణ కల్పించాలని అవినాశ్‌ పిటిషన్‌

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్‌ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణకు సంబంధించి ఎంపీ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు వెకేషన్‌ బెంచ్‌ విచారించనుంది. సీబీఐ విచారణ నుంచి రక్షణ కల్పించాలంటూ అవినాశ్‌ దాఖలు చేసిన పిటిషన్‌ అత్యవసరంగా విచారించాలంటూ బుధవారం సుప్రీంకోర్టు మెన్షనింగ్‌ జాబితాలో ఉంది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ ధర్మాసనం ఎదుట మెన్షనింగ్‌లు ఎక్కువ సంఖ్యలో జాబితా అయ్యాయి. దీంతో మరీ అత్యవసరం ఉన్నవైతే రిజిస్ట్రీకి లేఖ రూపంలో తెలియజేయాలని సీజేఐ సూచించారు. తొలి 50 మెన్షనింగ్‌లు తొలి వారం, తర్వాతవి రెండో వారంలో వెకేషన్‌ బెంచ్‌ విచారిస్తుందని సీజేఐ జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ స్పష్టం చేశారు.

'జగనన్నకు చెబుదాం'తో దిగొస్తున్న అధికారులు

ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు

- 2020లో మోసపోయిన ఇద్దరు బాధితులు
- 1902కు ఫోన్‌ చేయగానే పోలీసుల స్పందన.. వ్యాపారిపై కేసు నమోదు
- మరో ఫిర్యాదుతో బాధితుడి ఇంటికొచ్చిన ఆర్డీవో, తహసీల్దార్లు



మీర్జాపురంలో అర్జీదారుని ఇంటికి వెళ్లి రికార్డులు పరిశీలిస్తున్న గుడివాడ ఆర్డీవో పద్మావతి

పెనుకొండ/హనుమాన్‌జంక్షన్‌ రూరల్‌ : 'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదు చేసిన బాధితుల కోసం అధికారులు, పోలీసులు దిగొస్తున్నారు. ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించి, ఆధారాలు తీసుకుని న్యాయం చేసేందుకు ఉపక్రమిస్తున్నారు. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి చేతిలో మోసపోయిన ఇద్దరు బాధితులు, వీఆర్వో నిర్లక్ష్యంతో ఇబ్బందిపడుతున్న మరో బాధితుడు 1902 నంబర్‌కు ఫోన్‌ చేయడంతో అధికారులు ఫిర్యాదుదారులను సంప్రదించి వారికి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

మూడేళ్లుగా ముప్పతిప్పలు

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం పాలసముద్రానికి చెందిన దిలీప్‌రెడ్డి మండలంలోని గొల్లపల్లి-చంద్రగిరి మధ్య రోడ్డు పక్కన ప్లాట్లు వేశాడు. తన వద్ద ప్లాట్లు కొనేవారికి బ్యాంకులోను కూడా తానే ఇప్పిస్తానని ప్రచారం చేశాడు. దీంతో పెనుకొండకు చెందిన గొల్ల గోపాల్‌, ఓబుళరెడ్డిలు ఆయన వద్ద ప్లాట్లు కొనుగోలు చేసేందుకు వెళ్లగా, ఒక్కో ప్లాట్‌ రూ.16 లక్షలుగా చెప్పాడు. ఒక్కో ప్లాట్‌కు రూ.4 లక్షల చొప్పున అడ్వాన్స్‌ ఇస్తే.. మిగతా మొత్తం తానే బ్యాంకు ద్వారా లోను ఇప్పిస్తానన్నాడు. దీంతో వారిద్దరూ 2020, జనవరిలో చెరో ప్లాట్‌ కోసం రూ.4 లక్షల చొప్పున దిలీప్‌రెడ్డికి ఇచ్చారు. ఆ తర్వాత దిలీప్‌రెడ్డి ముఖం చాటేశాడు. లోన్‌ సంగతి తర్వాత కనీసం తాము చెల్లించిన డబ్బులన్నా వెనక్కి ఇవ్వాలని కోరగా.. చెక్కులిచ్చాడు. వాటిని బ్యాంకులో వేయగా అవి బౌన్స్‌ అయ్యాయి. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించి నోటీసులు పంపగా.. దిలీప్‌రెడ్డి వాటిని తీసుకోలేదు. ఇలా మూడేళ్ల పాటు పోరాటం చేస్తున్న బాధితులు రెండు రోజుల కిందట 'జగనన్నకు చెబుదాం'కు ఫోన్‌ చేసి ఫిర్యాదు చేశారు. 1902 కాల్‌ సెంటర్‌ వారు వివరాలన్నీ నమోదు చేసుకుని, సమీప పోలీస్‌స్టేషన్‌కు వివరాలు పంపారు. దీంతో బుధవారం 'కియా' పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌ఐ వెంకటరమణ బాధితులకు ఫోన్‌ చేయగా గొల్ల గోపాల్‌ అందుబాటులోకి వచ్చాడు. అతన్ని స్టేషన్‌కు పిలిపించి వివరాలపై ఆరా తీసి, ఆధారాలు తీసుకున్నారు. అనంతరం దిలీప్‌పై కేసు నమోదు చేశారు. మరో బాధితుడు ఓబుళరెడ్డిని కూడా స్టేషన్‌కు పిలిపించి ఫిర్యాదు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. మూడేళ్లుగా కనీసం కేసు కూడా నమోదు కాలేదని, 1902కు ఫోన్‌ చేయగానే పోలీసులే కేసు నమోదు చేశారని బాధితుడు గొల్ల గోపాల్‌ చెప్పారు.

అర్జీదారు ఇంటికి ఆర్డీవో

ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురానికి చెందిన గోళ్ల రాణికి బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలోని ఆర్‌ఎస్‌ నంబర్‌ 110-2లో రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పట్టా భూమి అయినప్పటికీ కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారులు 22ఏ కేటగిరీ కింద ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు. అప్పటి నుంచి రాణితో పాటు ఆమె కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే వీఆర్వో సరిగ్గా స్పందించకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. విసుగుచెందిన గోళ్ల రాణి కుటుంబ సభ్యులు ఈ నెల 13వ తేదీన 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేశారు. స్పందించిన గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, బాపులపాడు తహసీల్దార్‌ సీహెచ్‌ నరసింహారావు, మల్లవల్లి వీఆర్వో ప్రసాద్‌ను వెంటపెట్టుకుని బుధవారం మీర్జాపురంలోని గోళ్ల రాణి ఇంటికి వెళ్లారు. మల్లవల్లి వ్యవసాయ భూములకు సంబంధించిన ప్రభుత్వ రికార్డులను తనిఖీ చేయడంతో పాటుగా, గోళ్ల రాణి వద్ద ఉన్న పత్రాలను కూడా ఆర్డీవో పద్మావతి పరిశీలించారు. సమస్య పరిష్కరించకుండా పదే పదే అర్జీదారులను తిప్పుకోవడం తగదని వీఆర్వో ప్రసాద్‌ను ఆర్డీవో మందలించారు. దీర్ఘకాలంగా ఉన్న మల్లవల్లి ఆర్‌ఎస్‌ నంబర్‌ 110-2 సెక్షన్‌ 22ఏ సమస్యను తక్షణమే పరిష్కరించి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

కళ్లు లేని కబోది ఈనాడు

- సీఎం సభపై దుర్మార్గపు రాతలు
- ఎవరికీ ఏ ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు
- అయినా పనిగట్టుకుని దుష్ప్రచారం
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మండిపాటు



నిజాంపట్నం : కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తున్న ఈనాడు పత్రిక తప్పుడు రాతలను మానుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మండిపడ్డారు. ఇరుకు రోడ్లలో సీఎం ర్యాలీ అంటూ దిగజారుడు రాతలు రాయడం ఎవరి కోసం అని ప్రశ్నించారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిజాంపట్నం-చందోలు ప్రధాన రహదారిలో దాదాపు రెండు ఎకరాల విస్తీర్ణంలో హెలిప్యాడ్‌, నిజాంపట్నం-రేపల్లె ప్రధాన రహదారిలో 7.50 ఎకరాల్లో సీఎం సభ, 20 ఎకరాల్లో వాహనాల పార్కింగ్‌ కోసం ఏర్పాట్లు చేయడం 'ఈనాడు'కు కనిపించలేదా అని నిలదీశారు. వందలాది వాహనాల రాకపోకలు సాగే ప్రధాన రహదారిని పట్టుకుని ఇరుకు రోడ్డని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ధ్వజమెత్తారు. 2 లక్షల వాటర్‌ ప్యాకెట్లు, 50 వేల బాటిళ్లు ఏర్పాటు చేస్తే, మంచి నీరు లేదని దుష్ప్రచారం చేయడం సబబు కాదన్నారు. నిజాంపట్నం బస్టాండ్‌ నుంచి బావాజీపాలెం వరకు ఆరు పాయింట్లలో టెంట్‌లు వేసి భోజన వసతి కల్పించామని తెలిపారు. సుమారు 25 వేల మంది సభా ప్రాంగణంలో కూర్చున్నారని, ఎండను లెక్కచేయక అంతకు రెండింతల జనం బయట ఉన్నారన్నారు. నిజాంపట్నం హార్బర్‌లో రూ.370 కోట్లతో ఫిషింగ్‌ జెట్టీ నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేయడంతో పాటు దిండి పరిశావారిపాలెంలో చేపపిల్లల హేచరీస్‌, పరిశోధన కేంద్రం, ప్రాసెసింగ్‌ యూనిట్‌ కోసం ప్రభుత్వం 270 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించిందన్నారు. రూ.180 కోట్లతో ఆ ప్రాజెక్ట్‌ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారని తెలిపారు.

ఉనికి కోసమే టీడీపీ పాట్లు

పట్టుమని 10 కిలోమీటర్లు నడిచే ఓపిక లోకేశ్‌కు, 5 కిలోమీటర్లు నడిచే ఓపిక ఎమ్మెల్యే సత్యప్రసాద్‌కు లేదనే విషయం అందరికీ తెలుసని ఎంపీ మోపిదేవి తెలిపారు. సత్యప్రసాద్‌.. సరదాలు, షికార్లు కాసేపు పక్కన పెట్టి, వివరాలు కనుక్కుని మీడియాతో మాట్లాడితే బావుంటుందని హితవు పలికారు. ఉనికి కాపాడుకునేందుకే టీడీపీ పాట్లు పడుతోందని చెప్పారు. గతంలో మత్స్యకార భరోసా లబ్ధిదారుల ఎంపిక విషయమై విచారణ చేపట్టామని, తప్పు చేసిన వారిపై చర్యలు కూడా తీసుకున్నామన్నారు.



ఏసీ హెల్మెట్‌ను ధరింపజేస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, (ఇన్‌సెట్‌లో) చార్జింగ్‌ బ్యాటరీతో నడిచే ఏసీ హెల్మెట్‌

ట్రాఫిక్‌ పోలీసులకు ఏసీ హెల్మెట్లు

నిప్పులుగక్కే ఎండల్లో నిలబడి ట్రాఫిక్‌ విధులు నిర్వర్తించే పోలీసులకు ఏసీ హెల్మెట్లు ఇచ్చేందుకు అనంతపురం రేంజ్‌ డీఐజీ ఆర్‌.ఎస్‌.అమ్మిరెడ్డి, అనంతపురం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు. గంట చార్జింగ్‌ పెడితే ఎనిమిది గంటల పాటు ఏసీ హెల్మెట్‌ పనిచేస్తుంది. రూ.13 వేలు విలువజేసే ఈ హెల్మెట్లను హైదరాబాద్‌ నుంచి తెప్పించనున్నారు. ముందుగా ఏసీ హెల్మెట్లు ఎలా పనిచేస్తాయో తెలుసుకునేందుకు డీఐజీ, ఎస్పీతోపాటు డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ వెంకటేశ్‌నాయక్‌ అనంతపురం క్లాక్‌టవర్‌ వద్ద బుధవారం ట్రాఫిక్‌ విధుల్లో ఉన్న పోలీసులకు స్వయంగా ఏసీ హెల్మెట్లు ధరింపజేశారు. హెల్మెట్‌ పెట్టుకున్నపుడు తలకు చల్లగా ఉందని, సౌకర్యవంతంగా ఉందని సిబ్బంది తెలిపారు. త్వరలోనే అవసరమైనన్ని హెల్మెట్లు తెప్పిస్తామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

-అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌

కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు

- రాయలసీమలో ఎక్కువ ప్రభావం
- వడదెబ్బకు గురై 9 మంది మృతి

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్‌: రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. బుధవారం రాయలసీమ జిల్లాల్లో ఎండ నిప్పులు చెరిగింది. తిరుపతి, నెల్లూరు, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, వైఎస్సార్‌, చిత్తూరు జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించింది. తిరుపతి జిల్లా పల్లాం, నెల్లూరు జిల్లా కసుమూరులో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లా రావిపాడులో 45.9, కురిచేడులో 45.7, ఉప్పలపాడులో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు బాగా పెరిగాయి. రాత్రిపూట కూడా అనేక ప్రాంతాల్లో 36 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం మన్యం జిల్లా కొమరాడ, వైఎస్సార్‌ జిల్లా చాపాడు, వీరపనాయునిపల్లె, కమలాపురం, వల్లూరు, ముద్దనూరు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మిగిలినచోట్ల కూడా ఎండ ప్రభావం చూపుతుందని పేర్కొంది. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్‌, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్‌, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 43 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

వడదెబ్బకు గురై 9 మంది మృతి

వైఎస్సార్‌ జిల్లా ఎర్రగుంట్ల మండలం కదిరివారిపల్లె వీఆర్‌ఏ రత్నంరాజు (50) బుధవారం వడదెబ్బకు గురై మృతి చెందారు. విధి నిర్వహణలో ఉండగా కిందపడిపోయిన ఆయనను స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వడదెబ్బకు పల్నాడు జిల్లా గణపవరంలో కెల్లంపల్లి నాగేశ్వరరావు (85), తులసీవనం వృద్ధాశ్రమంలో ఉండే మామిడి గంగమ్మ (82), ఎస్సీ కాలనీకి చెందిన దివ్యాంగుడు పెనుమల పిచ్చయ్య (65), పిడుగురాళ్లలో చిమట సీతారావమ్మ (68) మరణించారు. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం గ్రామానికి చెందిన పల్లం దావీదు (58), కందుకూరు శ్రీరామ్‌నగర్‌ కాలనీకి చెందిన ఇరువూరి మాలకొండయ్య (75), కొండాపురం మండలం చింతలదేవి పంచాయతీ దగాదిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు శేషమ్మ (68) వడదెబ్బకు బుధవారం మృతి చెందారు. తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం చెలికంపాడు ఎస్సీ కాలనీకి చెందిన అశోక్‌ (47) ఉపాధి పనులకు వెళ్లగా.. వడదెబ్బకు గురై మరణించాడు.

'తెలుగు భాష'తోనూ దుష్ట రాజకీయం

రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



సాక్షి, అమరావతి : 'తెలుగు భాష'తోనూ టీడీపీ దుష్ట రాజకీయాలు చేస్తోందని అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు మండిపడ్డారు. సచివాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే.. ప్రజలను మభ్య పెట్టేందుకు భాషాభిమానుల ముసుగులో వాస్తవాలపై బురద జల్లే తంతు చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు హయాంలో అధికార భాషా సంఘాన్ని విస్మరించినప్పుడు భాషాభిమానులైన మండలి బుద్ధప్రసాద్‌, కమ్యూనిస్టు నాయకులు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. బుద్ధప్రసాద్‌ చెప్పినట్లు.. తెలుగు పాలన భాషగా అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. కానీ, ఆ తర్వాత అధికారంలోకొచ్చిన చంద్రబాబు తెలుగుకు ఏగతి పట్టించారో కూడా చెబితే బాగుండేదన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌.. తెలుగు భాషా, సంస్కృతి పరిరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకుని నిద్రాణంలో ఉన్న అధికార భాషా సంఘాన్ని వెలుగులోకి తెచ్చారని గుర్తుచేశారు. పాలన భాషగా తెలుగును అమలు చేస్తుంటే.. వర్తమాన రాజకీయ, సామాజిక స్పృహ లేని వ్యక్తులు అర్థరహిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలను పూర్తిగా వాడుక తెలుగులో జరిపేందుకు సాంకేతికతను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. టీడీపీలో జయంతి, వర్ధంతికి తేడా తెలియని చాలా మంది నాయకులు తెలుగు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని.. వారికి తమ భాషా సంఘం తరఫున శిక్షణ కూడా అందిస్తామని ఎద్దేవా చేశారు. కుహనా రాజకీయాల్లో చిక్కుకున్న కమ్యూనిస్టులు టీడీపీ మెదడులో మెదిలిన ఆలోచనలనే పలకడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌ మాట్లాడుతూ తెలుగు ఔన్నత్యాన్ని నిలబెట్టేందుకు ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందన్నారు.

'జాప్యం' కారణంగా క్రమశిక్షణ ప్రొసీడింగ్స్‌ను కొట్టేయలేం

- షోకాజ్‌ నోటీసును ప్రాథమిక దశలో కొట్టేయడానికి వీల్లేదు
- వీటి విషయంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవు
- తుది ఉత్తర్వులిచ్చినప్పుడే జోక్యం చేసుకోగలవు
- జాప్యం వల్ల నష్టం ఏమిటో నిరూపించాల్సింది ఉద్యోగే
- మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ తర్లాడ రాజశేఖర్‌రావు తీర్పు

సాక్షి, అమరావతి : క్రమశిక్షణ చర్యలకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్న కారణంతో క్రమశిక్షణ ప్రొసీడింగ్స్‌ను కొట్టేయడం సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. జాప్యం వల్ల తనకు జరిగే నష్టమేమిటో నిరూపించాల్సిన బాధ్యత ఉద్యోగిదేనని, శిక్ష కంటే ఎక్కువ మనోవేదన కలిగిస్తోందని అంటే సరిపోదని చెప్పింది. అంతేకాక క్రమశిక్షణ ప్రొసీడింగ్స్‌ను, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఇచ్చే షోకాజ్‌ నోటీసు లేదా చార్జిషీట్‌ను ప్రాథమిక దశలో కొట్టేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఇవి ఏ వ్యక్తి హక్కులను ఉల్లంఘించవంది. శిక్ష విధిస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసినప్పుడో, మరో రకంగా ప్రభావితం అయ్యేలా ఉత్తర్వులు ఇచ్చినప్పుడే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని చెప్పింది. ఎలాంటి కారణాల్లేకుండా, పరిధి దాటి షోకాజ్‌ ఇచ్చినప్పుడే హైకోర్టు జోక్యం చేసుకుంటుందని తెలిపింది. ఉద్యోగిపై అభియోగాల తీవ్రతను పరిగణనలోకి తీసుకోవడం తప్పనిసరని తెలిపింది. ప్రస్తుత కేసులో జాప్యానికి అధికారులు బాధ్యులు కాదని, రాష్ట్ర విభజన తరువాత చోటు చేసుకున్న పరిణామాలేనని పేర్కొంది. అయితే మూడు నెలల్లో శాఖాపరమైన విచారణ ముగించాలని సంబంధిత అధికారిని ఆదేశించింది. లేని పక్షంలో పిటిషనర్‌పై మోపిన అభియోగాలు ఆటోమేటిక్‌గా రద్దవుతాయంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ తర్లాడ రాజశేఖర్‌రావు ఇటీవల తీర్పు వెలువరించారు.ఎక్సైజ్‌ శాఖలో అసిస్టెంట్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సూపరింటెండెంట్‌ డి.ప్రభాకర్‌పై అధికార దుర్వినియోగం, మామూళ్ల వసూలు వంటి పలు అభియోగాలతో అధికారులు 2013లో క్రమశిక్షణ ప్రొసీడింగ్స్‌ జారీ చేశారు. ఈ ప్రొసీడింగ్స్‌ను ఇప్పటివరకు ముగించలేదని, జాప్యం జరుగుతున్నందున వాటిని కొట్టేయాలంటూ ప్రభాకర్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్‌ తర్లాడ రాజశేఖర్‌రావు విచారణ జరిపారు. పిటిషనర్‌ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం క్లిష్టతరమైన కేసుల్లో శాఖాపరమైన విచారణను 6 నెలల్లో, మామూలు కేసుల్లో 3 నెలల్లోనే పూర్తి చేయాలన్నారు. పిటిషనర్‌ విషయంలో 9 ఏళ్లు పూర్తి కావొస్తున్నా విచారణ పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వ న్యాయవాది కిషోర్‌ కుమార్‌ వాదనలు వినిపిస్తూ, పిటిషనర్‌పై తీవ్రమైన ఆరోపణలున్నాయన్నారు. కేవలం జాప్యం కారణంగా క్రమశిక్షణ ప్రొసీడింగ్స్‌ను కొట్టేయడానికి వీల్లేదన్నారు.

టీడీపీ మాజీ మంత్రి అఖిలప్రియ అరెస్టు

- ఏవీ సుబ్బారెడ్డిపై హత్యాయత్నం కేసు
- అఖిలప్రియ భర్త భార్గవరామ్‌ కూడా అరెస్టు
- 14 రోజుల రిమాండ్‌ విధించిన మేజిస్ట్రేట్‌
- అఖిలప్రియ ఫిర్యాదుతో ఏవీ సుబ్బారెడ్డి పైనా కేసు నమోదు



అఖిలప్రియ, భార్గవరామ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం (నంద్యాల): నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామ శివారులో మంగళవారం నారా లోకేశ్‌ పాదయాత్రలో టీడీపీ సీనియర్‌ నేత ఏవీ సుబ్బారెడ్డిపై దాడి చేసి, హత్యాయత్నం చేసిన కేసులో అదే పార్టీకి చెందిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అఖిలప్రియ, ఆమె భర్త, అనుచరులు, కిరాయి హంతకులతో కలిసి తనను చంపేందుకు ప్రయత్నించారని సుబ్బారెడ్డి నంద్యాల తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొరికాడురా కొడుకు, చంపండిరా అంటూ అఖిలప్రియ తన మీదకు అనుచరులను ఉసిగొల్పారని, నలుగురు తన గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించారని, ఎడమ భుజం, ముఖంపై, ఛాతీపై తీవ్రంగా కొట్టారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు భూమా అఖిలప్రియ, భార్గవరామ్‌, మోహన్‌, వెంకట సాయినాథ్‌, మరో ఏడుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం అఖిలప్రియ, భార్గవరామ్‌ను ఆళ్లగడ్డ పట్టణంలోని వారి నివాసంలో అదుపులోకి తీసుకొని పాణ్యం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఏడాది చంటి బిడ్డతో అఖిలప్రియ పాణ్యం స్టేషన్‌కు వచ్చారు. సాయంత్రం నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్య పరీక్షల అనంతరం నంద్యాల జేఎఫ్‌ఎంసీ కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్‌ ఆదినారాయణ వారికి 14 రోజుల రిమాండ్‌ విధించారు. అఖిలప్రియను కర్నూలు మహిళా సబ్‌ జైలుకు, భార్గవరామ్‌, మోహన్‌, వెంకటసాయినాథ్‌లను కర్నూలు జిల్లా జైలుకు తరలించారు.

సుబ్బారెడ్డి నా చున్నీ లాగి గొంతు నులిమి చంపాలని చూశాడు

పాదయాత్రలో మంగళవారం రాత్రి కార్యకర్తలతో కలిసి వస్తున్న తనను ఏవీ సుబ్బారెడ్డి చున్నీ లాగి గొంతుకు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించాడని అఖిలప్రియ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు సుబ్బారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

'నవ'నవలాడుతున్న పుంజు!



పదునైన గోర్లతో కోడిపుంజు

ఈ పుంజు వయసు ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా తొమ్మిదేళ్లు. మండలంలోని క్రిష్టిపాడుకు గోసుల పుల్లయ్య దీని యజమాని. పుట్టినప్పటి నుంచి బొద్దుగా ఉండటం, దీనికి పుట్టిన పిల్లలు కూడా బలంగా ఉంటుండటంతో ఈ పుంజును ఎవరికీ అమ్మకుండా కాపాడుకుంటూ వస్తున్నాడు. వీటి జీవిత కాలం మూడు నుంచి ఏడేళ్లేనని, అయితే ఈ పుంజు తొమ్మిదేళ్లు బతకడంపై వెటర్నరీ డాక్టర్‌ హరిత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

\- దొర్నిపాడు(నంద్యాల)

వైద్య విద్యార్థులకు వేసవి సెలవులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎండల తీవ్రత నేపథ్యంలో వైద్య విద్యార్థులకు 10 నుంచి 15 రోజులు సెలవులు ఇవ్వాలని డాక్టర్‌ వైఎస్సార్‌ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్‌ బాబ్జీ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వచ్చే నెలలో నిర్వహించనున్న పరీక్షల షెడ్యూల్‌లో మాత్రం ఏమాత్రం మార్పు ఉండదని స్పష్టం చేశారు.

జూన్‌ 15కల్లా రాష్ట్రానికి 'నైరుతి'

నేడో, రేపో అండమాన్‌లోకి ప్రవేశం



అండమాన్‌ సముద్రతీరంలో కురుస్తున్న వర్షం (ఫైల్‌)

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది జూన్‌ 15వ తేదీకి రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ప్రతి ఏడాదీ మే 20 నాటికి అండమాన్‌ సముద్రం, దక్షిణ బంగాళాఖాతంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. జూన్‌ 1 నాటికి కేరళను తాకుతాయి. అప్పట్నుంచే దేశంలో నైరుతి రుతుపవనాల ప్రభావం మొదలవుతుంది. అయితే ఈ ఏడాది 'నైరుతి' మూడు రోజులు ఆలస్యంగా జూన్‌ 4 నాటికి కేరళను తాకే అవకాశం ఉందని ఇప్పటికే భారత వాతావరణ శాఖ వెల్లడించింది. గతేడాది మే 20వ తేదీ కంటే వారం రోజుల ముందే నైరుతి రుతుపవనాలు అండమాన్‌ సముద్రంలోకి ప్రవేశించాయి. ఈసారి మాత్రం ఒకటి, రెండు రోజుల ముందు ప్రవేశించి.. ఈనెల 22 నాటికి అండమాన్‌, నికోబార్‌ దీవుల అంతటికీ విస్తరిస్తాయని ఐఎండీ పేర్కొంది. మరోవైపు రుతుపవనాల ప్రవేశానికి సూచికగా మూడు రోజులుగా అండమాన్‌, నికోబార్‌ దీవుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అనంతరం రుతుపవనాలు జూన్‌ 4 నాటికి కేరళను తాకనుండటంతో.. ఆ ప్రభావం ఏపీపైనా ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి నైరుతి రుతుపవనాలు కేరళను తాకిన పది రోజుల్లోగా రాయలసీమ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తాయి. అనంతరం మరో వారం రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తాయి. అంతా అనుకూలిస్తే జూన్‌ 10కి బదులు 15వ తేదీకల్లా రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ సీజన్‌లోనూ రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఇసుక ర్యాంప్‌నకు రివర్‌ కన్జర్వేటరే అనుమతివ్వాలి

- ఆ తర్వాతే ర్యాంప్‌లను నోటిఫై చేయాలి
- 'తూర్పు గోదావరి' కలెక్టర్‌ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: గోదావరి వరదను అడ్డుకునేందుకు వీలుగా రాజమహేంద్రవరంలో నిర్మించిన 'కట్ట' వద్ద ఇసుక తవ్వకాల నిమిత్తం ర్యాంప్‌ ఏర్పాటునకు అనుమతినిస్తూ తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు రద్దు చేసింది. ర్యాంప్‌ ఏర్పాటునకు రివర్‌ కన్జర్వేటరే అనుమతులివ్వాలని.. కలెక్టర్‌ కాదని స్పష్టం చేసింది. అనుమతులు వచ్చిన తర్వాతే ర్యాంప్‌లను నోటిఫై చేయాలని స్పష్టం చేసింది. ఇసుక ర్యాంప్‌ ఏర్పాటు ప్రాంతం.. భారీ వాహనాలు తిరగడం వల్ల కలుగుతున్న నష్టంపై మదింపు చేయాలని రివర్‌ కన్జర్వేటర్‌ను హైకోర్టు ఆదేశించింది. ర్యాంప్‌ ఏర్పాటు నిమిత్తం బోట్‌మెన్‌ సొసైటీలు పెట్టుకున్న వినతులపై 4 వారాల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ రావు రఘునందన్‌రావు ఇటీవల తీర్పు వెలువరించారు. ర్యాంప్‌ ఏర్పాటుకు అనుమతివ్వడం వల్ల భారీ వాహనాలు వస్తున్నాయని, దీని వల్ల కట్ట దెబ్బతింటోందని, ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని మహ్మద్‌ జమా అనే వ్యక్తితో పాటు మరో నలుగురు హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఇసుక తవ్వకాల కోసం ర్యాంప్‌ ఏర్పాటునకు బోట్స్‌మెన్‌ సొసైటీలకు అనుమతినిస్తూ కలెక్టర్‌ గత నవంబర్‌ 2న ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ రద్దు చేయాలని కోరారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్‌ రఘునందన్‌రావు విచారణ జరిపారు. రెవెన్యూ, గనుల శాఖ అధికారులు విచారణ జరిపిన తర్వాతే ర్యాంప్‌ ఏర్పాటుకు అనుమతినిచ్చినట్లు కలెక్టర్‌ నివేదించారు. ప్రస్తుత కట్టకు మరో వైపున ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశామని.. దాని మీదుగా ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవకాశం కల్పించామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, నిబంధనల ప్రకారం రివర్‌ కన్జర్వేటర్‌ మాత్రమే ర్యాంప్‌ ఏర్పాటుకు అనుమతివ్వాల్సి ఉంటుందన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943